
'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 298

బుధవారం 12-7-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



టెస్ట్ సమరం కొత్తగా..

నేటి నుంచి భారత్, వెస్టిండీస్ మధ్య తొలి మ్యాచ్

- 12లో



ఫాక్స్‌కాన్ సొంత ప్లాన్

చిప్ ప్లాంట్‌కు ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసే యోచన


- 13లో



తృణమూల్ కాంగ్రెస్ ఆధిక్యం

పశ్చిమ బెంగాల్ స్థానిక ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం దిశగా దూసుకెళ్తోంది.

వివరాలు 6లో ▸



మహోగ్ర యమున

వరద నీటితో ఢిల్లీలో యమునా నది మహోగ్రంగా మారింది. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

వివరాలు 6లో ▸



ఎవరెస్ట్ వద్ద కూలిన హెలికాప్టర్

నేపాల్‌లోని ఎవరెస్ట్ శిఖరం సమీపంలో హెలికాప్టర్ కూలిపోవడంతో మెక్సికోకు చెందిన ఐదుగురు, ఒక పైలట్ మృతి చెందారు.

వివరాలు 6లో ▸



పేదరికంపై భారత్ విజయం!

అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్ పేదరికంపై విజయం సాధించడంలో ముందంజలో ఉందని ఐరాస ప్రశంసించింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

పచ్చ కళ్లద్దాలు తీసి రోడ్ల అభివృద్ధి చూడు రామోజీ

- యథాప్రకారం మరోసారి అక్కసువెళ్లగక్కిన ఈనాడు పత్రిక
- రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానం అంటూ అడ్డగోలు రాతలు
- బాబు హయాంలో కంటే వైఎస్ జగన్ పాలనలోనే ఎక్కువ నిధులు ఖర్చు
- రోడ్ల నిర్మాణం, నిర్వహణకు టీడీపీ ప్రభుత్వం చేసిన వ్యయం రూ. 3,160.38 కోట్లు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే చేసిన వ్యయం రూ. 4,492.99 కోట్లు
- టీడీపీ ప్రభుత్వం పెట్టిన బిల్లుల బకాయిలు చెల్లించిన జగన్ సర్కార్.. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తంగా 12,894 కి.మీ మేర రోడ్లకు మరమ్మతులు
- పంచాయతీరాజ్ పరిధిలో 5,374 కి.మీ. మేర కొత్త తారు రోడ్ల నిర్మాణం
- పట్టణాల్లో మరమ్మతుల కోసం గుర్తించిన పనుల్లో ఇప్పటికే 85.63 శాతం పూర్తి
- వాస్తవాలను మరుగున పెట్టి విషంకక్కిన పచ్చపత్రిక

3 లో

స్క్రీన్ ప్లే.. రామోజీ

డైరెక్షన్.. చంద్రబాబు

యాక్షన్.. పవన్‌కళ్యాణ్

'దుష్ట' పన్నాగం!

సేవామూర్తులపై ఆది నుంచి దుష్ట చతుష్టయం అక్కసు

- దేశమంతా ప్రశంసిస్తున్న వ్యవస్థపై దత్తపుత్రుడి దుర్మార్గ వ్యాఖ్యలు
- ప్రభుత్వ పథకాలకు అర్హులు దూరం కావాలన్నదే జనసేనాని ఆరాటమా?
- పైరవీలు, పైసా లంచం లేకుండా ఇంటింటికీ వలంటీర్ల సేవలు
- నాలుగేళ్లలో సంక్షేమ పథకాలతో 8.06 కోట్ల మందికి నేరుగా రూ.2.25 లక్షల కోట్లు
- అర్హులను గుర్తిస్తూ ప్రతి గడపకూ సంక్షేమాన్ని చేరవేస్తున్న వలంటీర్లు

సాక్షి, అమరావతి: వలంటీర్ల గురించి ఒక్కమాటలో చెప్పాలంటే సేవామూర్తులు.. సంక్షేమ సారథులు! దేశమంతా వారి పనితీరును మెచ్చుకుంది. కోవిడ్ వేళ మానవతా మూర్తులుగా నిలిచిన వలంటీర్ల సేవలను ప్రధాని సైతం అభినందించారు. మూటలు మోసే ఉద్యోగాలని తొలుత వలంటీర్లను తూలనాడిన వారు ఆ తరువాత నోట మాట రాక సర్దుకున్నారు. నాలుగేళ్లలో కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.25 లక్షల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా జమ చేయడం వెనుక ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించిన వలంటీర్ల

మిగతా 2వ పేజీలో ▸



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

వలంటీర్ల వ్యవస్థ దండగ

- తప్పు చేస్తున్నారు కాబట్టే మీకు కోపం
- వలంటీర్లు లేకపోతే పాలన ఆగిపోతుందా
- వలంటీర్ వ్యవస్థే అర్థంలేనిది
- మరోసారి పవన్ కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు

- వివరాలు 3లో



ఇవి పవన్ రగిల్చిన ఆగ్రహ జ్వాలలు

- పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ వలంటీర్లు
- రెండోరోజూ రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు
- దిష్టిబొమ్మలతో శవయాత్రలు, ర్యాలీలు, ప్రదర్శనలు
- పవన్ బొమ్మలకు చెప్పు దెబ్బలతో సన్మానాలు

2 లో

● శభాష్ వలంటీర్..



రేయింబవళ్లకు తేడా తెలియని కుటుంబానికి వలంటీర్లు అండగా నిలిచారు. బాపట్ల మండలంలోని హైదరపేటకు చెందిన అంధుడు నరాలశెట్టి సుబ్బారావు. ఆయనకు భార్య, ఒక కొడుకు. వీరు కూడా అంధులే. యాచనతో పొట్టపోసుకునేవారు. ఈ నేపథ్యంలో సుబ్బారావును అనారోగ్యం బలి తీసుకుంది. సుబ్బారావు మృతదేహాన్ని ఏం చేయాలో భార్యాకొడుకులకు అర్థం కాలేదు. ఒకపక్క కరోనా, మరోపక్క గుండెల్లో వేదన. ఆ కుటుంబానికి వలంటీర్లు కాండ్రు వాణి, ఎలిసమ్మ, వినోద్, నరేశ్, సుమలత అండగా నిలిచారు. వారే దగ్గరుండి సుబ్బారావు అంత్యక్రియలు నిర్వహించారు.

● మా వలంటీరు



గత ఏడాది గోదావరికి వరద వచ్చినప్పుడు మా ఇల్లు నీట మునిగింది. మేం బయటకు వెళ్లలేని పరిస్థితి. నిత్యావసర వస్తువులు, పాలు, తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందిపడ్డాం. ఆ సమయంలో మా గ్రామానికి చెందిన వలంటీర్ చెవల శృతి మాకు ఎంతగానో సహాయ పడింది. బంధువులు కూడా రాలేని పరిస్థితుల్లో ప్రభుత్వం అందించిన నిత్యావసర సరుకులను శృతి నడుము లోతు నీటిలో మోసుకుని తీసుకొచ్చి మాకు ఇచ్చింది. పాలు, తాగునీరు కూడా ఆమె అందజేసింది. వరద తగ్గేవరకు మా యోగక్షేమాలు తెలుసుకుంటూనే ఉంది. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం కూడా అందేలా చేసింది. ఆ తర్వాత కూడా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చేలా చూస్తోంది.

– ఆకుమర్తి జ్యోతి, పెద కందాలపాలెం, పి.గన్నవరం మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా.

మరిన్ని వలంటీర్ల కథనాలు 4 లో

న్యూస్‌రీల్

'కోలగట్ల' జలాసనాలు



జాతీయ స్విమ్మింగ్ పూల్ డేను పురస్కరించుకుని విజయనగరంలో నిర్వహించిన కార్యక్రమంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గంట పాటు నీటిపై తేలియాడుతూ పలు యోగాసనాలు వేసి అందరినీ ఆకట్టుకున్నారు.

వివరాలు 5లో ▸

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు



అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. కేటాయించి(అసైన్ చేసి) 20 ఏళ్లు పూర్తయిన భూములపై సంబంధిత రైతులకు యాజమాన్య హక్కులు కల్పించనుంది. రాష్ట్ర కేబినెట్‌లో దీనిపై చర్చించి ఆమోద ముద్ర వేయనున్నట్లు సమాచారం.

వివరాలు 13లో ▸

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!


నిబంధనలకు విరుద్ధంగా రూ. కోటి దాటి డిపాజిట్లు

ఆ కోటీశ్వరులందరికీ నోటీసులు

అక్రమ డిపాజిట్లపై కూపీ లాగుతున్న సీఐడీ

ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్లు.. 23 చిట్టీ గ్రూపుల మూసివేత... త్వరలో మరికొన్ని

ఆ చిట్టీల నిర్వహణకు అధీకృత అధికారి నియామకానికి సన్నాహాలు



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో సీఐడీ దర్యాప్తు వేగవంతమైంది. చిట్‌ఫండ్స్ ముసుగులో సాగిన నల్లధనం దందాపై దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా సేకరించిన అక్రమ డిపాజిట్ల వివరాలను వెలికి తీసేందుకు సిద్ధమైంది. మార్గదర్శిలో ఇప్పటికే మూసి వేసిన 23 చిట్ గ్రూపులతోపాటు మరికొన్ని గ్రూపుల మూసివేతకు చర్యలు చేపట్టింది. ఆ చిట్టీల నిర్వహణను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది.

రూ.కోటికిపైగా డిపాజిట్‌దారులకు నోటీసులు

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.కోటి అంతకుమించి డిపాజిట్లు చేసినవారికి సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు. డిపాజిట్ల ముసుగులో

మిగతా 13వ పేజీలో ▸



కాలువలో బోల్తా పడిన బస్సు

పెళ్లింట పెనువిషాదం

- ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం
- కాలువలో ఆర్టీసీ బస్సుపడి ఏడుగురు దుర్మరణం.. 17 మందికి గాయాలు
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రగాయాలైన వారికి రూ.2 లక్షలు
- స్వల్పంగా గాయపడ్డ వారికి రూ.50 వేలు
- ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు
- ఘటనా స్థలానికి హుటాహుటిన ఎస్పీ, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది

5 లో



ఈడీ చీఫ్ పదవీ కాలం పొడిగింపు చట్టవిరుద్ధమే

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చీఫ్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చట్టవిరుద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నెల 31వ తేదీ తర్వాత ఆయన పదవిలో కొనసాగరాదని తేల్చిచెప్పింది. ఈలోగా ఈడీకి కొత్త చీఫ్‌ను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

- వివరాలు 6లో



'రాజధాని' వ్యాజ్యాలన్నీ త్రిసభ్య ధర్మాసనానికి

రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలను అడ్డుకునే దిశగా టీడీపీ దాఖలు చేయించిన పిటిషన్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్5 జోన్ ఏర్పాటు, జీవో 45పై వ్యాజ్యాలను తామే విచారిస్తామని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలన్న అనుబంధ వ్యాజ్యంపైనా విచారణ జరుపుతామని తెలిపింది.

- వివరాలు 14లో

ఒకటి కాదు రెండు కాదు.. దాదాపు ఏడు శతాబ్దాల విరామం తర్వాత వేయి స్తంభాల దేవాలయంలో అంతర్భాగంగా ఉన్న కళ్యాణ మంటపంలో శివపార్వతుల కళ్యాణం జరగబోతోంది. కాకతీయుల హయాం తర్వాత మళ్లీ ఇంతకాలానికి కళ్యాణ మంటపం కళకళలాడబోతోంది.

విఖ్యాత వేయి స్తంభాల దేవాలయ కళ్యాణ మంటపం పునర్నిర్మాణ పనులు పూర్తి కావచ్చిన నేపథ్యంలో, సెప్టెంబరులో దాన్ని ఘనంగా ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత వచ్చే శివరాత్రి వేడుకలను అందులోనే నిర్వహించాలని భావిస్తోంది.

కాకతీయుల తర్వాత మళ్లీ ఇప్పుడే!



- ఏడు శతాబ్దాల తర్వాత ఆ మంటపంలో మళ్లీ శివపార్వతుల కళ్యాణం
- సెప్టెంబరులో వేయి స్తంభాల గుడి కళ్యాణమంటపం సిద్ధం

సాక్షి, హైదరాబాద్

కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడి హయాంలో వేయి స్తంభాలతో రుద్రేశ్వరస్వామి దేవస్థానాన్ని నిర్మించారు. ఓవైపు దేవాలయం, దానికి మరోవైపు కళ్యాణమంటపాన్ని అద్భుత శిల్పకళా వైభవంతో రూపొందించారు. కాకతీయుల ఇలవేల్పుగా భాసిల్లిన పరమశివుడికి ఈ ఆలయంలో నిత్యాభిషేకాలు జరిగేవి. డెక్కన్ ప్రాంతాన్ని వశం చేసుకునే సమయంలో తుగ్లక్ సేనలు దీన్ని పాక్షికంగా ధ్వంసం చేశాయని చరిత్రకారులు చెబుతారు. అప్పట్లో కళ్యాణమంటపం పైకప్పు 40 శాతం కూలిపోయింది. దాంతో ఆ శిథిల మంటపంలో ఇక వేడుకలు నిర్వహించటం ఆపేశారు. అంతే.. మళ్లీ ఇప్పటి వరకు నిర్వహించలేదు. ఇప్పుడు ఆ మంటపాన్ని పునర్నిర్మించటంతో తిరిగి వేడుకల నిర్వహణ ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.



చివరి దశలో పనులు..

దాదాపు 18 ఏళ్ల క్రితం కళ్యాణ మంటపాన్ని పునర్నిర్మించాలన్న ఉద్దేశంతో పూర్తిగా విప్పదీశారు. అందులోని రాళ్లకు నెంబర్లు వేసి పద్మాక్షి గుట్ట వద్ద ఉంచారు. కానీ పనులు ముందుకు సాగలేదు. మూడేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం దృష్టి సారించి వేగంగా పనుల నిర్వహణ ప్రారంభించింది. ఇప్పుడు ప్రధాన నిర్మాణ పనులు పూర్తికాగా, వారం రోజులుగా పైకప్పు పనులు చేస్తున్నారు. ఆగస్టు చివరి నాటికి ఆ పనులు కొలిక్కి తెచ్చి సెప్టెంబరులో మంటపాన్ని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నాటి క్వారీ నుంచే ఇప్పుడూ రాళ్ల వినియోగం..

హన్మకొండకు చేరువగా ఉన్న అమ్మవారి పేట క్వారీ నుంచి మంటప పునర్నిర్మాణ పనులకు రాళ్లను తెచ్చి వాడుతున్నారు. అప్పట్లో కాకతీయ రాజులు నిర్మించిన దేవాలయాలకు ఈ గుట్ట రాయినే వాడేవారు. నాడు రాళ్లను తొలిచేందుకు చేసిన రంధ్రాలు ఇప్పటికీ కనిపిస్తున్నాయి. దాదాపు 60 టన్నుల బరువున్న ఓ భారీ బండరాయిని ఇటీవలే మంటపం వద్దకు తరలించారు. దాన్ని పైకప్పుపై అమర్చనున్నారు. ఆ గుండుపై 800 ఏళ్ల కింద తొలిచినప్పటి రంధ్రాల జాడలు ఇంకా ఉండటం విశేషం. అదే రాయి భాగాన్ని ఇప్పుడు మళ్లీ వేయిస్తంభాల కళ్యాణ మంటపానికి వినియోగిస్తుండటం యాధృచ్ఛికం. ఈ మంటపానికి సంబంధించి 163 బీమ్‌లకు గాను 28 జాడ లేకుండా పోయాయి. కూలిన తర్వాత ప్రజలు వాటి ముక్కలను తరలించుకుపోయారు. ఇప్పుడు వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో ఒక్కోటి 8 అడుగుల పొడవు, రెండున్నర అడుగుల వెడల్పు, 30 టన్నుల బరువుండే 8 బీమ్‌ల ఏర్పాటు పనులు పూర్తి కావచ్చాయి. వాటిపై 32 పైకప్పు సల్పాలను పరచనున్నారు. ఈ సల్ప రాళ్లు ఒక్కోటి 15 అడుగుల వెడల్పుతో ఉండనున్నాయి. తమిళనాడుకు చెందిన శివకుమార్ స్థపతి ఆధ్వ ర్యంలో అదే రాష్ట్రానికి చెందిన 28 మంది శిల్పులు ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. కేంద్రప్రభుత్వం రూ.19 కోట్లు విడుదల చేసింది. ఇప్పటికే రూ.10 కోట్లు ఖర్చు కాగా, నిర్మాణ పనులు పూర్తయ్యే నాటికి మరో రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు.



అలా నిఘా వర్గాల నుండి సమాచారం అందగానే స్పీచ్ మొదలెడతారు!

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే

ప్రైవేట్ సహా అన్ని రకాల పరిశ్రమల్లో సమర్థంగా అమలు కావాలి

- కలెక్టర్లు పర్యవేక్షిస్తూ ఆరు నెలలకు ఒకసారి నివేదికివ్వాలి: సీఎం జగన్
- పరిశ్రమలకు వీలైనంత ఎక్కువగా శుద్ధి చేసిన నీటిని అందించాలి
- కంపెనీలు ఏవైనా సరే పంటలు కొంటే రైతన్నలకు 'మద్దతు' తప్పనిసరి
- సీఎం అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి
- రూ.13,295 కోట్ల పెట్టుబడులతో 10,181 ఉద్యోగాల కల్పనకు 'ఎస్ఐపీబీ' ఆమోదం



సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకు చెందాల్సిందేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇది ఇప్పటికే కార్యాచరణలోకి రాగా సమగ్ర పర్యవేక్షణ ద్వారా మరింత సమర్థంగా అమలవుతుందన్నారు. దీనిపై సమీక్షిస్తూ క్రమం తప్పకుండా ఆరు నెలలకు ఒకసారి నివేదికలు పంపాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. రూ.13,295 కోట్ల

మిగతా 13వ పేజీలో ▸

వలంటీర్ల తీవ్ర నిరసన


కర్నూలులోని కల్లూరు చెన్నమ్మ సర్కిల్ వద్ద పవన్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలుపుతున్న వలంటీర్లు


వైఎస్సార్ జిల్లా పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు


గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పాత మద్రాస్ రోడ్డులో పవన్ దిష్టిబొమ్మను నిప్పు పెడుతున్న వలంటీర్లు


తిరుపతి పట్టణంలో పవన్ ఫ్లెక్సీలు, చిత్రపటాలను దహనం చేసి పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వలంటీర్లు


ప్రకాశం జిల్లా దేవరాజుగట్టులో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను తగలబెడుతూ నిరసన తెలుపుతున్న వలంటీర్లు


విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న వలంటీర్లు


కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణంలో మానవహారంగా ఏర్పడి పవన్‌కళ్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వలంటీర్లు


శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో మానవహారంతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు


కృష్ణా జిల్లా మచిలీపట్నంలో పవన్ దిష్టిబొమ్మతో శవయాత్ర చేస్తున్న వలంటీర్లు, లబ్ధిదారులు


విశాఖ జిల్లా మారికవలసలో పవన్ దిష్టి బొమ్మను చెప్పతో కొడుతున్న వలంటీర్



శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరిలో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు


శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రధాన రహదారిపై ర్యాలీ చేస్తున్న వలంటీర్లు

ఇవి పవన్ రగిల్చిన ఆగ్రహ జ్వాలలు

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై మండిపడ్డ సేవా సైన్యం

సాక్షి నెట్‌వర్క్: వలంటీర్లపై పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ సచివాలయ సేవా సైన్యం రాష్ట్ర వ్యాప్తంగా భగ్గుమంటోంది. పవన్ తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ రెండో రోజైన మంగళవారం కూడా వలంటీర్లు నిరసనలు చేపట్టారు. పవన్ దిష్టి బొమ్మలతో శవయాత్రలు, ర్యాలీలు, ప్రదర్శనలు నిర్వహించారు. పవన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

గోదావరి జిల్లాల్లో తీవ్ర నిరసన

పవన్ వ్యాఖ్యలపై ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మంగళవారం నిరసనలు కొనసాగాయి. ఏలూరు ఫైర్‌స్టేషన్, 12 పంపుల సెంటర్లలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. టి.నరసాపురం, కొయ్యలగూడెం, ధర్మాజీగూడెం, జంగారెడ్డిగూడెం, ఉంగుటూరు, భీమడోలులో నిరసనలు చేపట్టారు. కైకలూరు, మండవల్లి, నర్సాపురం, ఉండి, కాళ్ల, ఆకివీడు, పాల కోడేరు మండలాల్లో నిరసన చేపట్టారు. తణుకులో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాకినాడ జిల్లా శంఖవరం, కత్తిపూడి, జి.కొత్తపల్లిలో పవన్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. రౌతులపూడిలో వలంటీర్లు ర్యాలీ చేశారు. కొత్తపల్లి మండలం ఉప్పాడ బీచ్ రోడ్డు సెంటర్‌లో దిష్టి బొమ్మను దహనం చేశారు. సామర్లకోట, పెద్దాపురంలో మానవహారం నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ, రాజానగరంలో ర్యాలీ చేశారు. వేమగిరి, నల్లజర్ల మండలం తూర్పు చోడవరం, దేవరపల్లిలో దిష్టిబొమ్మను దగ్ధపరిచారు. కోనసీమ జిల్లా అమలాపురం, అల్లవరం, తాళ్లరేవు, కాట్రేనికోన, ఐ.పోలవరం, మండపేట, రాయవరం, రాజోలు, మామిడికుదురు, ఆలమూరు, కొత్తపేట, పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో నిరసనలు చేశారు.

ఉత్తరాంధ్రలో నిరసన సెగలు

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. సీతమ్మధారలోని నక్కవానిపాలెం వద్ద వలంటీర్లు నిరసన ప్రదర్శన చేశారు. తగరపువలసలో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మధురవాడ వాంబే కాలనీలో పవన్ ఫొటోలను తగులబెట్టారు. ఆరిలోవ, ఎంవీపీ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో పవన్‌పై కేసులు నమోదు చేశారు. చినవాల్తేరు 20 వార్డు, అగనంపూడి, 69వ వార్డులో మానవహారం ఏర్పాటు చేశారు. అక్కయ్యపాలెం ఎన్‌జీవో కాలనీ, కంచరపాలెం నేతాజీ జంక్షన్‌లో నిరసన తెలిపారు. అనకాపల్లి జిల్లా మాడుగులలో ర్యాలీ నిర్వహించారు. చోడవరం కొత్తూరు జంక్షన్, రావికమతం మండలం కొత్తకోటలో ఆందోళన చేశారు. మునగపాక మండల వలంటీర్లు ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అల్లూరి జిల్లా పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం, రాజవొమ్మంగి వలంటీర్లు నిరసనలు చేశారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలం, ఇచ్ఛాపురం, ఆమదాలవలసలో పవన్ పై పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల, గజపతి నగరం, రాజాం, ఎస్.కోట, బొబ్బిలి, కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండ, వీరఘట్టం, భామిని మండల కేంద్రాల్లో నిరసన చేపట్టారు. పవన్‌ను అరెస్ట్ చేయాలంటూ సంతకవిటి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కృష్ణా, గుంటూరు జిల్లాల్లో చెప్పు దెబ్బలు

కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని వలంటీర్లు కోనేరు సెంటర్‌లో పవన్ దిష్టి బొమ్మతో శవయాత్ర చేశారు. పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టి దహనం చేశారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోనూ ఆందోళనలు జరిగాయి. బాపట్ల జిల్లాలో పలుచోట్ల పవన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం, వేమూరు, నిజాంపట్నం, బాపట్లలో ఆందోళనలు చేశారు.

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో..

నెల్లూరు జిల్లా ఉదయగిరి, మనుబోలు మండలంలోని జట్లకొండూరు, చేజర్ల మండలం మాముడూరు, అనంసాగరం, మాముడూరు, అనంతసాగరం మండలం బొమ్మవరంలో పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ప్రకాశం జిల్లా దర్శి, యర్రగొండపాలెం, కనిగిరి, త్రిపురాంతకం, పెద్దారవీడు, పుల్లల చెరువు, బేస్తవారిపేట, తర్లుపాడు, కంభం, తాళ్లూరు, ముండ్లమూరు, వెలిగండ్ల, పీసీపల్లి, పామూరుల్లో నిరసన ప్రదర్శనలు చేశారు.

రాయలసీమలోనూ నిరసనల వెల్లువ

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా వలంటీర్లు నిరసనలు తెలిపారు. తాడిపత్రి, పెద్దవడుగూరు, బుక్కరాయసముద్రం, శింగనమల, గుంతకల్లు, రాప్తాడు, హిందూపురం, లేపాక్షి, మడకశిర, గోరంట్ల, పరిగి, చిలమత్తూరు, పెనుకొండ, కంబదూరు, బొమ్మన హాళ్, కణేకల్లు, విడపనకల్లు, ధర్మవరం, ముదిగుబ్బ, బత్తలపల్లి, కదిరి, తనకల్లు, ఓడీచెరువు, నల్లమాడ, అమడగూరు తదితర ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి పవన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వలంటీర్ల నిరసనలు కొనసాగాయి. పలుచోట్ల పోలీస్ స్టేషన్‌లో పవన్‌పై ఫిర్యాదు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని వలంటీర్లు పవన్‌పై పోలీసులకు ఫిర్యాదులు చేశారు. కర్నూలులోని కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో పవన్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి తగులబెట్టారు. తుగ్గలి, ఆత్మకూరు, పాణ్యం, పోలూరులో పవన్ దిష్టి బొమ్మలు దగ్ధం చేశారు. పెద్దకడుబూరు, కౌతాళం, పత్తికొండ, రామాపురంల్లో నిరసనలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల, కమలాపురం, బద్వేలు, బ్రహ్మంగారి మఠం, ఎర్రగుంట్ల, చాపాడు తదితర ప్రాంతాల్లో వలంటీర్లు నిరసన తెలిపారు.

స్క్రీన్ ప్లే.. రామోజీ
డైరెక్షన్.. చంద్రబాబు
యాక్షన్.. పవన్‌కళ్యాణ్
'దుష్ట' పన్నాగం!

▶ మొదటి పేజీ తరువాయి

కృషి దాగి ఉంది. ఇంత సంక్షేమం సాకారం కావడం.. ప్రతి ఇల్లూ లబ్ధి పొందిన సంతోషంతో కళకళలాడటం దుష్ట చతుష్టయానికి మింగుడు పడటం లేదు! వలంటీర్ వ్యవస్థపై ఓ పథకం ప్రకారం బురద చల్లుతూ యాక్షన్‌లోకి దిగాయి! పాత కథనాలను వల్లె వేస్తూ స్క్రిప్టు ప్రకారం తమతమ పాత్రలను పక్కాగా పోషిస్తున్నాయి! అందులో తాజా అంకమే వలంటీర్లను సంఘ విద్రోహ శక్తులతో పోలుస్తూ జనసేనాని తన శక్తిమేరకు ఈ డ్రామాను రక్తి కట్టించడం!!

మహమ్మారికి ముకుతాడు..

2019 ఆగస్టు 15వతేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన వలంటీర్ల వ్యవస్థ తమ అత్యుత్తమ సేవలతో రాష్ట్ర ప్రజలందరి మన్ననలు పొందడమే కాకుండా దేశానికే ఆదర్శంగా మారింది. పాలనలో విప్లవాత్మక సంస్కరణలకు నాంది పలికింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి 50 ఇళ్లకు, పట్టణ ప్రాంతాల్లో 70–100 ఇళ్లకు ఒకరు చొప్పున వలంటీర్ల నియామకంతో పాలనలో వేగం పెరిగి ఏ కార్యక్రమమైనా గంటల వ్యవధిలోనే ప్రజల చెంతకు చేరేందుకు దోహదపడింది. కరోనా సమయంలో సర్వే ద్వారా బాధితులను మూడు రోజుల వ్యవధిలోనే గుర్తించి మహమ్మారికి అడ్డుకట్ట వేసేందుకు తోడ్పడింది. కోవిడ్ బారినపడ్డ వారి వద్దకు వెళ్లేందుకు సొంత కుటుంబ సభ్యులే జంకినా వలంటీర్లు మాత్రం వెనుకాడలేదు. ఎప్పటికప్పుడు వ్యాధి సోకినవారిని గుర్తిస్తూ వైద్య సేవలను అందచేయడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడారు. నాలుగు నెలల వ్యవధిలో 14 విడతలు ఫీవర్ సర్వే నిర్వహించి సమర్థంగా కోవిడ్‌ను కట్టడి చేయగలిగారు. వలంటీర్ల వ్యవస్థ క్షేత్రస్థాయిలో అత్యంత సమర్థంగా పని చేయడం ద్వారా ఒకే రోజు రికార్డు స్థాయిలో 13.59 లక్షల మందికి కోవిడ్ వ్యాక్సిన్లను ప్రభుత్వం అందజేసింది. కరోనా సమయంలో వలంటీర్ల సేవలను ప్రధాని నరేంద్ర మోదీ సైతం ప్రశంసించారు.

పథకం ప్రకారం వ్యవస్థపై విషం..

- వలంటీర్లు మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు ఇటీవల పెరిగాయి. వలంటీర్ల వ్యవస్థ ప్రజాస్వామ్యానికే పెను సవాల్‌గా మారింది. ప్రజలు స్వేచ్ఛగా జీవించే హక్కు, భావ ప్రకటన స్వేచ్ఛకు పెను విఘాతంగా మారింది. వలంటీర్ల వ్యవస్థ ప్రజలను భయపెడుతోంది. ఈ వ్యవస్థ ఓ మాఫియాలా మారిందని విపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వలంటీర్ల అరాచకాల గురించి చెబుతూ పోతే పెద్ద గ్రంథమే అవుతుంది.
  – 2022 డిసెంబరు 10న 'ఈనాడు' ప్రత్యేక కథనం.
- వలంటీర్లనే సమాంతర సర్కారీ వ్యవస్థను సృష్టించి స్వీయ కార్యాలను చక్కబెట్టుకోగలుగుతున్నారు. వాటికి ప్రజలు మూగ ప్రేక్షకులు, బాధితులు కావాల్సి రావడమే ఆంధ్ర రాష్ట్రానికి పట్టిన ఏలినాటి శని మహిమ. **– 2023 మార్చి 3న 'ఈనాడు' ఎడిటోరియల్**
- ఊళ్లల్లో వలంటీర్లు పెద్ద న్యూసెన్స్ అయ్యారు. బ్రిటీష్ వాళ్లకు ఏజెంట్లలా వీళ్లు ప్రభుత్వానికి ఏజెంట్లుగా మారారు. బెదిరింపులు, అవినీతికి పాల్పడుతున్నారు. **– 2021 అక్టోబరు 30న కుప్పం పర్యటనలో చంద్రబాబు.**
- వలంటీర్లకు సన్మానమంటూ రూ.233 కోట్లు తగలేస్తూ పండగ చేసుకుంటున్నారు. **– 2022 ఏప్రిల్ 7న చంద్రబాబు ట్వీట్**
- వలంటీర్ల కథేంటో చూస్తాం. ఆ వ్యవస్థే దండగ. టీడీపీ కార్యకర్తలు వలంటీర్ల లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి పార్టీ ఆఫీసు నెంబరుకు వాట్సాప్ చేస్తే వారి సంగతి చూసుకుంటాం. ఈ వివరాలు పంపిన వారికి రూ.10 వేల పారితోషికం కూడా పార్టీ తరపున ఇస్తాం. **– 2021 మార్చి 29న తిరుపతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు.**
- 'వలంటీర్లు ప్రతి గ్రామంలో ఏ కుటుంబంలో ఆడపిల్లలకు ఏ లోపాలున్నాయి? ఎలాంటి అలవాట్లు ఉన్నాయి? ఎవరైనా అబ్బాయిలను ప్రేమిస్తున్నారా? వారిలో వితంతువులున్నారా? అనే సమాచారాన్ని వలంటీర్లు ఇవ్వడంతో మహిళలను ట్రాప్ చేసి కిడ్నాపులు చేస్తున్నారు. **– 2023 జూలై 9న ఏలూరులో పవన్‌కళ్యాణ్**

పడిగాపులు లేవు.. పలకరింపులే

గతంలో అవ్వాతాతలు పింఛన్ డబ్బులు తీసుకోవాలంటే నడవలేని పరిస్థితిలో కూడా కచ్చితంగా రావాల్సిన దుస్థితి. ఆత్మగౌరవాన్ని చంపుకుంటూ ఎక్కడిస్తారో అంతుబట్టక ప్రతి నెలా కార్యాలయాల వద్ద దయనీయంగా పడిగాపులు కాయాల్సి వచ్చేది. అలాంటిది ఇప్పుడు వలంటీర్లు ఠంచన్‌గా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి చిరునవ్వుతో పలుకరిస్తూ వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్మును అందజేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ప్రతి నెలా మొదటి తారీఖునే దాదాపు 64 లక్షల మంది అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఏ చిన్న ఇబ్బందీ కలుగకుండా దాదాపు రూ.1,750 కోట్లు వలంటీర్ల ద్వారా వారి చేతికి అందుతున్నాయి.

నేరుగా, పారదర్శకంగా రూ.2.25 లక్షల కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ విధానంలో 8.06 కోట్ల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.2.25 లక్షల కోట్లను నేరుగా జమ చేసింది. ప్రతి పథకం అమలు సమయంలో అర్హులకు సమాచారం ఇవ్వడంతోపాటు అనంతరం డబ్బులు అందినట్లు ఈ–కేవైసీ ద్వారా లబ్ధిదారుల నుంచి అంగీకారాన్ని తీసుకుంటున్నారు. తద్వారా పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఏ పథకంలోనూ ఎక్కడా అవినీతికి తావులేని పరిస్థితిని తీసుకొచ్చింది.


దేశానికే దిక్సూచిగా..

సంక్షేమ పథకాల అమలుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన రిటైర్డ్ ఐఏఎస్‌లు, విద్య, సామాజిక రంగ నిపుణులతో కూడిన కమిటీ వలంటీర్ల పనితీరును పరిశీలించి దేశమంతా అమలు చేయాలని సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. మన రాష్ట్రంలో వలంటీర్ల సేవలను గుర్తించిన కేరళ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అనంతపురం జిల్లాలో పర్యటించిన కర్ణాటక ఐఏఎస్ అధికారుల బృందం తమ రాష్ట్రంలోనూ వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు అనుగుణంగా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ప్రకటించింది. మహారాష్ట్ర సర్కారు సైతం వలంటీర్ల సేవలను ప్రశంసించింది.

పట్టణ ఆస్తుల సర్వేలో వేగం

- ఆగస్టు నాటికి 123 పురపాలికల్లో సర్వే పూర్తికి సన్నాహాలు
- 89 పురపాలిక ప్రాంతాల్లో ఇప్పటికే డ్రోన్ మ్యాపింగ్ పూర్తి
- 20 పురపాలికల్లో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రారంభం
- ఆస్తుల యజమానులను కలిసి వివరాలు నమోదు

సాక్షి, అమరావతి: పట్టణ ప్రాంతాల్లో ఆస్తులను పక్కాగా సర్వే చేసి, రికార్డులు తయారు చేయడంలో పురపాలక పట్టణాభివృద్ధి శాఖ వేగం పెంచింది. జగనన్న భూహక్కు– భూరక్ష పథకం కింద రాష్ట్రంలోని 123 పురపాలికల్లో సుమారు 40 లక్షల ఆస్తుల మ్యాపింగ్‌ను ఆగస్టు నాటికి పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే 89 యూఎల్బీ (పట్టణ స్థానిక సంస్థలు)ల్లో డ్రోన్ సర్వే పూర్తవగా, నెలరోజుల్లో మిగిలిన 34 యూఎల్బీల్లో కూడా మ్యాపింగ్ పూర్తి చేసేలా సిబ్బందిని సమాయత్తం చేశారు. కాగా, డ్రోన్ సర్వే మ్యాపింగ్ పూర్తయిన 20 యూఎల్బీల్లో ఇంటింటి సర్వే (గ్రౌండ్ ట్రూథింగ్) చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సర్వే సిబ్బంది ఆయా ఆస్తుల యజమానులను వ్యక్తిగతంగా కలిసి డ్రోన్ మ్యాపింగ్ (ఇమేజెస్)తో ఆస్తుల కొలతలను పక్కాగా సరిపోల్చి, యజమానుల అభిప్రాయాలను నమోదు చేసి రికార్డులు తయారు చేయనున్నారు. వివరాల నమోదుపై ఆయా మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అధికారి, వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శి, వార్డు అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, వార్డు రెవెన్యూ కార్యదర్శులకు మంగళవారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని సీడీఎంఏ కార్యాలయంలో శిక్షణనిచ్చారు. ప్రస్తుతం యూఎల్బీల్లో ఉన్న సర్వే నంబర్లు, ఆస్తి పన్ను చెల్లింపు డేటా ప్రకారం 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో 32 లక్షల ఆస్తులు, 7 లక్షల ఖాళీ స్థలాలు ఉన్నట్టు మున్సిపల్ శాఖ గుర్తించింది. వీటికి అదనంగా ఆస్తులు, స్థలాలు మరో లక్ష వరకు పెరగవచ్చని



అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో భవనాలు, రోడ్లు, చెరువులు, కాలువలు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. వేటికవి ప్రత్యేక డేటా తయారు చేశారు. అన్ని ఆస్తుల మ్యాపింగ్‌ను ఆగస్టు నాటికి పూర్తిచేసేందుకు లక్ష్యంగా నిర్దేశించారు. కాగా, గతంలో ప్రభుత్వాలు పట్టణ ఆస్తుల గుర్తింపు దృష్టి పెట్టకపోవడంతో కొనుగోలు, అమ్మకంలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ తరహా సమస్యలు లేకుండా ప్రభుత్వం సమగ్ర అర్బన్ సర్వే ప్రక్రియను చేపట్టింది.

25 వేల మంది సిబ్బంది..

పట్టణాల్లో సర్వే పనులకు మొత్తం 25 వేల మంది సిబ్బంది వివిధ స్థాయిల్లో పనిచేస్తున్నారు. వీరికి అవసరమైన శిక్షణను ఇవ్వడంతో పాటు సర్వేలో సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి వార్డులోను ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీతో పాటు నలుగురు సర్వే సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. వీరు తమ పరిధిలోని సుమారు 1,000 నివాసాలు, మరో 200 ఇతర ఆస్తుల వివరాలను సర్వర్‌లో ఉన్న ఆస్తుల వివరాలతో సరిపోలుస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉండి, సరిహద్దు సమస్యలు లేని వాటికి యజమానుల అంగీకారంతో ఆస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తయితే వ్యవసాయ భూములకు పట్టాదార్ పాస్ పుస్తకం ఉన్నట్టే పట్టణాల్లోని స్థలాలు, ఇళ్లకు గుర్తింపు పత్రాలు ఉంటాయి. దీంతోపాటు ప్రభుత్వ స్థలాలు, రోడ్లకు కూడా గుర్తింపు నంబర్లతో పాటు పక్కా రికార్డులు తయారవుతాయి. ఈ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పాత పట్టణాల రికార్డులతో పాటు పట్టణాల్లో విలీనమైన సుమారు 650 గ్రామాల రికార్డులు, ప్రస్తుతమున్న రికార్డులతో సరిపోల్చి ఏ ఆస్తి ఎవరి పేరిట ఉందో పూర్తి సమాచారాన్ని సర్వర్‌లో నమోదు చేశారు. సర్వేతో పాటు రెవెన్యూ రికార్డులు, ప్లానింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా వార్డు సచివాలయ సిబ్బంది ఆస్తుల యజమానులను స్వయంగా కలిసి మరోసారి రికార్డులను సరిచూస్తారు.

యజమాని ధైర్యంగా ఉండొచ్చు



పట్టణాల్లో ఆస్తుల యజమానులు వేరే ప్రాంతంలోనో.. దేశంలోనో ఉన్నప్పుడు వారి ఆస్తులను ఆక్రమించి కొందరు దొంగ పత్రాలతో విక్రయించిన ఘటనలు చాలా జరిగాయి. ఆయా ఆస్తులకు ప్రభుత్వం వద్ద సరైన పత్రాలు లేకపోవడమే అందుకు కారణం. మరికొన్ని చోట్ల పూర్వీకుల పేరిట ఉన్న ఆస్తులను చాలామంది తమ పేరుపై మార్చుకోలేదు. దీంతో రిజిస్ట్రేషన్ సమయంలో ఇబ్బంది ఏర్పడుతోంది. అర్బన్ ఆస్తుల సర్వే పూర్తయితే ప్రతి ఆస్తికి హక్కు పత్రం వస్తుంది. ఆన్‌లైన్‌లోను ఆ వివరాలు నమోదవుతాయి. యజమాని ఫొటో, బయోమెట్రిక్ వివరాలు సైతం రికార్డు అవుతాయి. దీంతో ఇక్కడ ఆస్తులున్నవారు విదేశాల్లో కూడా నిశ్చింతగా ఉండొచ్చు. వారి అనుమతి లేకుండా ఆస్తులను ఎవరూ తాకలేరు. – **పులిపాటి కోటేశ్వరరావు, సీడీఎంఏ**

క్లుప్తంగా...

నేడు కేబినెట్ భేటీ

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం రాష్ట్ర కేబినెట్ సమావేశం కానుంది. ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాకులోని కేబినెట్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుంది. ఇందులో పలు అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఏపీలో ఓటర్ల జాబితా సవరణపై చర్చ
సీఈసీ కార్యాలయంలో ఎన్నికల అధికారుల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఓటర్ల జాబితా సవరణపైచర్చించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) డిప్యూటీ కమిషనర్‌తో ఏపీ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలోని సీఈసీ కార్యాలయంలో 3 గంటల పాటు ఈ సమావేశం జరిగింది. అనంతరం మీనా మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై చర్చ జరిగిందని తెలిపారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో)ల నియామకం, ఓటర్ల జాబితా తయారీ తదితర అంశాలను సమీక్షించినట్లు చెప్పారు. రాష్ట్రంలో వంద శాతం ఓటరు కార్డుల ముద్రణ పూర్తయిందన్నారు. ఈ నెల 20న ఏపీలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కొత్త ఓటర్లను చేర్చుకోవడం, మృతి చెందిన వారిని జాబితా నుంచి తొలగించడం నిమిత్తం బూత్ లెవెల్ అధికారులు రాష్ట్రంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఆగస్టు 2, 3 తేదీల్లో విశాఖలో ఎన్నికల సంఘం సమావేశం ఉంటుందని చెప్పారు.

సీఐడీ ఇన్‌చార్జ్ చీఫ్‌గానే పీఎస్సార్

సాక్షి, అమరావతి: ఇంటెలిజెన్స్ డీజీ పీఎస్సార్ ఆంజనేయులు సీఐడీ విభాగం ఇన్‌చార్జ్‌గానే బాధ్యతలు స్వీకరించారని ఆ విభాగం మంగళవారం తెలిపింది. సీఐడీ విభాగం అదనపు డీజీ సంజయ్ హృద్రోగ సంబంధమైన చికిత్స కోసం సెలవులో వెళ్లారని పేర్కొంది. ఆయన సెలవు ముగించుకుని రాగానే మళ్లీ సీఐడీ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తారని వెల్లడించింది.

ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్



సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తర భారతదేశ యాత్రలకు వచ్చి భారీ వర్షాల్లో చిక్కుకున్న ఏపీ వాసులకు సహకారం అందించడానికి ఏపీ ప్రభుత్వం ఏపీ భవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా ఏపీకి చెందిన పలువురు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసింది. వివరాలకు భవన్ ఓఎస్డీ పి.రవిశంకర్ (98719 99055), కె.సునీల్‌కుమార్ (88009 24911)లను సంప్రదించాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

జీఎస్టీ మండలి సమావేశంలో మంత్రి బుగ్గన

సాక్షి, న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన నిర్వహించిన జీఎస్టీ మండలి 50వ సమావేశానికి ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ హాజరయ్యారు. మంగళవారం విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

కోర్టులను తప్పుదారి పట్టిస్తున్న బాబు అండ్ కో

బహుజన పరిరక్షణ సమితి నాయకులు



రిలే దీక్షల్లో బహుజన నాయకులు

తాడికొండ: మూడు రాజధానుల వ్యవహారంలో కోర్టులను తప్పుదారి పట్టిస్తున్న చంద్రబాబు అండ్ కో దుర్మార్గపు వైఖరికి తగిన శాస్తి తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 1017వ రోజుకు చేరాయి. నాయకులు మాట్లాడుతూ ఒక సామాజికవర్గం తమ ఆధిపత్యం దెబ్బతింటుందనే మూడు రాజధానులకు అడుగడుగునా అడ్డుపడుతూ కోర్టులను సైతం తప్పుదారి పట్టిస్తోందన్నారు. నాయకులు బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను కించపరచొద్దు

తెలంగాణ పీఆర్ అండ్ ఆర్‌డీ సలహాదారు జి.జయపాల్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను కించపరుస్తూ మాట్లాడటం సరికాదని తెలంగాణ రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ సలహాదారు జి.జయపాల్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రజల అవసరాలు, వారి అవస్థల గురించి కనీస అవగాహన లేనివారు.. మొత్తం వ్యవస్థనే అవమానించడం దారుణమన్నారు. వీరి వల్ల వలంటీర్లందరి ఆత్మస్థైర్యం దెబ్బతింటుందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి వ్యవస్థ గురించి ఆలోచించలేదన్నారు. అధికారులు అన్ని కుటుంబాలను, వ్యక్తులను కలిసి వారి కనీస అవసరాలను పరిష్కరించడం సాధ్యం కాదన్నారు. వలంటీర్ వ్యవస్థ వల్ల అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు చేరుతున్నాయని పేర్కొన్నారు.

వలంటీర్ పాదాలు కడిగిన ఎమ్మెల్యే ఆర్కే



వలంటీర్ రజిత పాదాలు కడుగుతున్న ఆర్కే

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం ఈమనిలో గ్రామస్తులకు ఉత్తమ సేవలు అందించిన దళిత గ్రామ వలంటీర్ జె.రజిత పాదాలను మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) మంగళవారం కడిగారు. పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని తెలియజేశారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా అందరివాడు

రంగా విగ్రహావిష్కరణ సభలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



రంగా విగ్రహావిష్కరణలో ధర్మశ్రీ, నరేంద్ర

బుచ్చెయ్యపేట (అనకాపల్లి జిల్లా): వంగవీటి మోహన రంగా అందరివాడని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాది మెయిన్ రోడ్డులో పార్టీలకతీతంగా రంగా మిత్ర మండలి యువత ఏర్పాటు చేసిన వంగవీటి రంగా విగ్రహాన్ని రాధా–రంగా మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు వంగవీటి నరేంద్రతో కలిసి ధర్మశ్రీ మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే ఎదిరించే వ్యక్తిగా రంగా పేదల హృదయాల్లో ఉన్నారని, ఆయన ఏ ఒక్క వర్గానికో చెందిన వ్యక్తి కాదన్నారు. వంగవీటి నరేంద్ర మాట్లాడుతూ వంగవీటి రంగాపై ఎవరైనా తప్పుడు పోస్టింగ్‌లు పెడితే సహించేది లేదని హెచ్చరించారు.

మత్స్యకారుల కోసం గ్రీన్ క్లైమేట్ నిధులు: ఎంపీ బాలశౌరి

చిలకలపూడి (మచిలీపట్నం): మత్స్యకారుల కుటుంబాల ప్రయోజనాల కోసం గ్రీన్ క్లైమేట్ నిధులు మంజూరుకు కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి హామీ ఇచ్చినట్లు మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని బాలశౌరి మంగళవారం కలిసి మత్స్యకారుల కుటుంబాలకు అవసరమైన చర్యలపై చర్చించారు.



అనంతపురం జిల్లా కదిరి-హిందూపురం రహదారి



అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం-బొబ్బర్లంక రహదారి

పచ్చ కళ్లద్దాలు తీసి రోడ్ల అభివృద్ధి చూడు రామోజీ

సాక్షి, అమరావతి: షరా మామూలుగానే రామోజీరావు మరోసారి సీఎం వైఎస్ జగన్‌పైనా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపైనా అక్కసు వెళ్లగక్కారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందంటూ ఈనాడు పత్రికలో ఓ పేజీ నిండుగా ఆయన 'పచ్చ'పాతం చూపించారు. వాస్తవం ఏమిటంటే.. టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలోనే రోడ్ల అభివృద్ధికి ఎక్కువగా నిధులు వెచ్చించారు. అందులోనూ రెండేళ్లపాటు కరోనా పరిస్థితులు ఉన్నప్పటికీ కూడా రోడ్ల నిర్మాణం, నిర్వహణ, పునరుద్ధరణ కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించి ఖర్చు చేసింది. టీడీపీకి మేలు చేసేందుకు పచ్చ కళ్లద్దాలు పెట్టుకున్న రామోజీరావు వాటిని తీసి చూస్తే రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కనిపిస్తుంది. వాస్తవాలు తెలుస్తాయి. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి మధ్య వ్యత్యాసం తెలుస్తుంది. పైగా సీఎం జగన్‌కు ఉచిత సలహాలు ఇవ్వాల్సిన అవసరం కూడా ఉండదు.



శ్రీకాకుళం జిల్లా కళింగపట్నం-పార్వతీపురం రహదారి

వాస్తవాలు ఇవిగో..

- చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 2014 నుంచి 2019 సమయంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం రూ. 3,335.3 కోట్లు విలువైన పనులు చేసింది. అయితే రూ. 2,772.60 కోట్ల బిల్లులే చెల్లించింది. రూ. 562.7 కోట్లు పెండింగ్ పెట్టింది. ఇక పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి రోడ్ల కోసం రూ. 471.15 కోట్ల పనులు చేసింది. వాటిలో కూడా రూ. 387.78 కోట్ల బిల్లులే చెల్లించి రూ. 86.37 కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టింది. మొత్తంగా ఈ రెండు శాఖల పరిధిలో రూ. 3,160.38 కోట్లు ఖర్చు చేశారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019 నుంచి ఇప్పటి వరకు ఈ నాలుగేళ్లలోనే ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో రూ. 4,148.59 కోట్లు ఖర్చు చేసింది. టీడీపీ ప్రభుత్వంలో పెండింగ్ బకాయిల్లోని రూ. 554.83 కోట్లతో పాటు ఈ ప్రభుత్వంలో చేసిన పనుల కోసం రూ. 3,593.76 కోట్లు విలువైన బిల్లులు చెల్లించింది. ఇక పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ. 344.4 కోట్ల పనులు చేసింది. టీడీపీ ప్రభుత్వం బకాయిల్లో రూ. 61.83 కోట్లను కూడా చెల్లించింది. మొత్తంగా ఈ రెండుశాఖల పరిధిలో రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 4,492.99 కోట్లు ఖర్చు చేసింది.
- మరో ఆర్థిక సంవత్సరం మిగిలి ఉండగానే నాలుగేళ్లలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన కంటే రూ. 1,332 కోట్లు అధికంగా ఖర్చు చేసింది.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో ఆర్‌అండ్‌బీ పరిధిలో దాదాపుగా 11,500 కి.మీ., పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో దాదాపు 1,394.34 కి.మీ., మొత్తంగా 12,894 కి.మీ మేర రోడ్లకు మరమ్మతులు చేసింది.
- ఇవి కాకుండా మునిసిపల్ శాఖ పరిధిలో పెద్ద మొత్తంలో రోడ్లకు మరమ్మతులు నిర్వహించారు.
- రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చంద్రబాబు ప్రభుత్వం 2014–19 మధ్య ఐదేళ్ల కాలంలో 3,507 కిలో మీటర్ల పొడవున కొత్తగా తారు రోడ్లను నిర్మిస్తే.. ప్రస్తుత వైఎస్ జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం నాలుగేళ్ల కాలంలోనే 5,374 కిలో మీటర్ల కొత్త తారు రోడ్ల నిర్మాణం చేపట్టింది. రాష్ట్రంలో పంచాయతీరాజ్ పరిధిలో మొత్తం 27,141 కిలో మీటర్ల పొడవున తారు రోడ్లు ఉండగా, అందులో మరమ్మతులు అవసరమైన చోట తక్షణం నిధులు మంజూరు చేసి పనులు చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకు

ఆర్ అండ్ బి రోడ్లు		
చేసిన పనులు	చెల్లించిన బిల్లులు	పెండింగ్ బిల్లులు
రూ. 3,335.30 కోట్లు	రూ. 2,772.60 కోట్లు	రూ. 562.70 కోట్లు
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రోడ్లు		
చేసిన పనులు	చెల్లించిన బిల్లులు	పెండింగ్ బిల్లులు
రూ. 471.15 కోట్లు	రూ. 387.78 కోట్లు	రూ.86.37కోట్లు
మొత్తం రూ.3,160.38		

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2023 మార్చి వరకు..

ఆర్ అండ్ బి రోడ్లు		
చేసిన పనులు	గత ప్రభుత్వ పెండింగ్ బిల్లుల చెల్లింపు	ప్రస్తుత ప్రభుత్వ పనులకు చెల్లించిన బిల్లులు
రూ.4,148.59కోట్లు (11,500 కి.మీ.)	రూ.554.83 కోట్లు	రూ.3,593.76కోట్లు
పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రోడ్లు		
చేసిన పనులు	గత ప్రభుత్వ పెండింగ్ బిల్లుల చెల్లింపు	ప్రస్తుత ప్రభుత్వ పనులకు చెల్లించిన బిల్లులు
రూ.344.40 కోట్లు (1,394 కి.మీ.)	రూ. 61.83 కోట్లు	రూ. 282.57 కోట్లు
	మొత్తం: రూ. 4,492.99 కోట్లు	(మొత్తం 12,894కి.మీ.)

ఉన్మాదిలా మాట్లాడుతున్న పవన్

వలంటీర్లకు ఆయన క్షమాపణలు చెప్పాలి.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధుల డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రజలకు విశేష సేవలందిస్తున్న వలంటీర్ వ్యవస్థపై జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై అన్ని వర్గాల నేతలు మండిపడుతున్నారు. వలంటీర్ వ్యవస్థ అంటే ఏమిటో అవగాహన లేక పవన్ ఉన్మాదిలా మాట్లాడుతున్నారని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, మంత్రులు, పలు సంఘాల నేతలు ధ్వజమెత్తారు. వలంటీర్ల వ్యవస్థను నెలకొల్పి, ప్రజలకు ప్రభుత్వాన్ని చేరువ చేసిన సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలతో పాటు ప్రపంచవ్యాప్తంగా మన్ననలు అందుకొంటున్నారని చెప్పారు. సీఎం జగన్‌ను ఓడించలేమన్న దుగ్ధతోనే టీడీపీ అధినేత చంద్రబాబు వెనుక ఉండి పవన్‌తో ఇటువంటి మాటలు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. పవన్ ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

పవన్ రాజకీయ బృహన్నల

వలంటీర్ల వ్యవస్థ, నియామకం, విధులు, వారు ఎవరనే విషయాలు తెలియని అజ్ఞాని పవన్. అందుకే ఉన్మాదిలా మాట్లాడుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలే కాదు.. ప్రపంచం మొత్తం ప్రశంసిస్తోంది. పవన్ నెత్తిన చంద్రబాబు అనే శని ఉన్నంత కాలం అతను బాగుపడడు. వలంటీర్ వ్యవస్థతో సీఎం జగన్ మేరుపర్వతంలా ఎదిగిపోవడంతో ఆయన్ని ఢీకొట్టడం పవన్, చంద్రబాబు, పచ్చ మీడియా తరం కాదు. అదే దుగ్ధతో వలంటీర్ వ్యవస్థపై దుష్ప్రచారానికి దిగారు. ఇప్పటికీ పవన్



పశ్చాత్తాపం పడకపోగా కొత్త బూతులు తిట్టాడు. మహిళల అక్రమ రవాణా అంటే ఏమిటో తెలియని అమాయక ప్రజల మనసుల్లో విషబీజాలు నాటాడు. పవన్‌కు చెడు సలహాలు ఇచ్చి, అతనితో మాట్లాడించి, ప్రజల్లో అతన్ని పనికిమాలినవాడుగా, రాజకీయ బృహన్నలగా చేయడమే చంద్రబాబు అండ్ కో, పచ్చ మీడియా పన్నిన కుట్ర. రాష్ట్రంలోని దేవాలయాల్లో ఇంజనీరింగ్, విద్యుత్ విభాగాల్లో సిబ్బంది పోస్టుల భర్తీ చేస్తాం.

– కొట్టు సత్యనారాయణ, ఉప ముఖ్యమంత్రి

పవన్‌వి గాలిమాటలు



రాజాం: పవన్ గాలికొచ్చి గాలి మాటలు మాట్లాడుతుంటాడు. ఏదైనా రాజకీయ పార్టీకి, నేతకు ఒక స్ఫూర్తి, ఆలోచన ఉంటాయి. పవన్‌కు, ఆ పార్టీకి ఇవేమీ లేవు. ఇంతవరకూ ఆయన చేసిన కార్యక్రమాల్లో ఏ ఒక్కటైనా స్ఫూర్తిగా ఉన్నాయా? ఒక ఆలోచన, అవగాహన, విధానం లేని వ్యక్తిని రాజకీయ నాయకుడని ఎలా అనగలం?వలంటీర్లు అంతా ఆయా గ్రామాలు, వార్డులకు చెందిన వ్యక్తులే. బయట నుంచి వచ్చిన వారు కాదు. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణం. పవన్ మాటల్లో అర్థం, న్యాయం లేవు. రాజకీయాలు అంటే ఒక బాధ్యత కలిగి ఉండాలి. అటువంటి బాధ్యత పవన్‌కు లేదు.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

పవన్ క్షమాపణ చెప్పాలి



రాజమహేంద్రవరం సిటీ: పేదలకు చిత్తశుద్ధితో సేవలందిస్తున్న వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ బేషరతుగా వలంటీర్లను ఏ ఉద్దేశంతో అనుమానిస్తున్నారో, అవమానిస్తున్నారో పవన్ బహిరంగంగా తెలపాలి. పవన్‌కు కేంద్ర నిఘా సంస్థలు సమాచారం ఇచ్చాయనడం విచిత్రంగా ఉంది. ఏ చిన్న పొరపాటు జరిగినా వెంటనే కఠిన చర్యలు తీసుకునేలా కేంద్రంలో, రాష్ట్రంలో చాలా సమర్థమైన రక్షణ వ్యవస్థలు ఉన్నాయి. పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే పవన్ ఆ వ్యాఖ్యలు చేసినట్లు కనిపిస్తోంది. వలంటీర్లకు ఇస్తున్న రూ.5 వేలు ప్రభుత్వ వేతనం కాదు. గౌరవ భృతి. ఈ వ్యవస్థ అమలుకు అనేక రాష్ట్రాలు ముందుకు వస్తున్నాం

– మార్గాని భరత్ రామ్, ఎంపీ

వలంటీర్ అంటే లారీ ఎక్కి మాట్లాడి హోటల్‌కి వెళ్లడం కాదు



ఏలూరు (టూటౌన్): వలంటీర్ అంటే లారీ ఎక్కి మాట్లాడి హోటల్‌కి వెళ్లడం కాదు. మాల, మాదిగ, లంబాడీ పల్లెలకు వెళ్లు పవన్. అక్కడ సీఎం వైఎస్ జగన్ పాలన కనిపిస్తుంది. అక్కడ దేవుడిలా ఒక వలంటీర్ కనిపిస్తాడు. దేశంలోనే అనేక మంది సీఎంలు రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థను కొనియాడుతున్నారు. వలంటీర్లు తిరగబడితే వారాహిని కూడా వదిలి పారిపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం అంటే ప్రజలకు సేవ చేయడమే, రామోజీరావు పచ్చళ్ల కంపెనీ, చిట్‌ఫండ్ కంపెనీ కాదు. పవన్ అసలు పేదల వైపా? ధనవంతుల వైపా? మతోన్మాదుల వైపా? ముందు తేల్చుకుని చెప్పాలి.

– జూపూడి ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు

వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి



ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న వలంటీర్లకు పవన్ తక్షణమే క్షమాపణ చెప్పాలి. గౌరవ వేతనంతో స్వచ్ఛందంగా పనిచేస్తున్న వలంటీర్లను అవమానించడం పవన్ దిగజారుడుతనానికి నిదర్శనం. అది టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టే. గతంలో పింఛను తీసుకోవాలంటే వృద్ధులు పంచాయతీ, మున్సిపల్ ఆఫీసులకు వెళ్లి లైన్‌లో నిల్చునేవారు. వలంటీర్ల వ్యవస్థతో నేడు ఆ ఇబ్బందులు తొలగిపోయాయి. మహిళలను కించపర్చిన పవన్‌ను 2024లో ఎక్కడ పోటీ చేసినా ఓడిస్తాం.

– ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు

పవన్ అవివేకంతో మాట్లాడుతున్నాడు



సాక్షి, అమరావతి: వలంటీర్ వ్యవస్థపై పవన్ చేసిన వ్యాఖ్యలు ఆయన అవివేకానికి అద్దం పడుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేయడంతో గ్రామ స్వరాజ్యం సాధ్యమైంది. వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా సేవలందిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు రావడాన్ని జీర్ణించుకోలేకే పవన్ ఉన్మాదంతో మాట్లాడుతున్నారు. వలంటీర్లకు పవన్ క్షమాపణ చెప్పాలి.

– వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంత్ నాయక్

సీఎం జగన్‌నే కాదు.. వలంటీర్లను చూసినా పవన్‌కు వణుకే

- వలంటీర్లపై పిచ్చివాగుడు వాగితే పళ్లు రాలగొడతారు
- పవన్‌కు మంత్రి ఆర్కే రోజా స్ట్రాంగ్ వార్నింగ్
- వలంటీర్ల కాళ్లు కడిగి పవన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- మిస్సింగ్ కేసుల్లో టాప్ టెన్ స్టేట్స్‌లో ఏపీ లేనే లేదని వెల్లడి
- నీ తల్లిని తిట్టిన వాళ్లను గెలిపించమని అడగటానికి సిగ్గు లేదా అని నిలదీత

సాక్షి, అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటేనే కాదు.. వలంటీర్లను చూసినా పవన్‌కి వణుకేనని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా చెప్పారు. మంత్రి మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 'దత్తపుత్రుడైన ఇరిటేషన్ స్టార్ పవన్... సీఎం వైఎస్ జగన్‌ని, వలంటీర్లను, మహిళలను గౌరవం లేకుండా మాట్లాడుతున్నారు. వలంటీర్ వ్యవస్థ నడ్డివిరుస్తా అని అంటున్నారు. పవన్ వారి వెంట్రుక కూడా పీకలేరు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఈ వ్యవస్థ ప్రతి కుటుంబాన్ని సొంత కుటుంబంగా భావించి సేవలందిస్తోంది. ఒక్క రూపాయి లంచం లేకుండా ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజల ముంగిటకు వచ్చేలా వలంటీర్లు పనిచేస్తున్నారు. రాష్ట్రంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా.. కరోనా నుంచి మొదలు మొన్నటి వరదల వరకు సాయం కోసం ప్రజలు మొదట కాల్ చేసేది వలంటీర్‌కే. కొవిడ్‌లో జనసైనికులు సైతం వారి సేవలు పొందిన వారే. సాక్షాత్తు ఐఏఎస్ శిక్షణ సిలబస్‌లో ఈ వ్యవస్థ స్థానం సంపాదించింది అంటే ఎంత గొప్ప వ్యవస్థో పవన్ తెలుసుకోవాలి. వలంటీర్ల సేవలు చూసి కేరళ రాష్ట్రం, బ్రిటన్ దేశస్తులు కొనియాడారు. ఈ వ్యవస్థను వాళ్లు కూడా అమల్లోకి తెచ్చారు. రాష్ట్రంలో 2.60 లక్షల మంది వలంటీర్లలో 1.80 లక్షల



మంది మహిళలే. మహిళలే మహిళలను హ్యూమన్ ట్రాఫికింగ్ చేయడానికి ఈ ఉద్యోగం ఎంచుకున్నారా అని పవన్‌ను ప్రశ్నిస్తున్నా. చంద్రబాబు ఇచ్చిన స్క్రిప్ట్‌ను పవన్ సిగ్గూ ఎగ్గూ లేకుండా చదువుతున్నారు. ఆయన మాటలను ఒక మహిళగా నేను సహించలేను. ఇకనైనా పవన్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడాలి. వలంటీర్ల కాళ్లు కడిగి క్షమాపణలు చెప్పాలి. వలంటీర్లపై పిచ్చి వాగుడు వాగితే పళ్లు రాలగొడతారు' అని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. 2024లో జగనన్న వన్స్‌మోర్.. బైబై బీపీ (బాబు, పవన్) అని చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని రోజా చెప్పారు. సింగ్యులర్‌గా మాట్లాడటం కాదు.. దమ్ముంటే సీఎం జగన్‌తో సింగిల్‌గా పోటీ చేయాలని సవాల్ చేశారు.

బాలకృష్ణ, రాధాకృష్ణలకు ఇంటర్వ్యూలెలా ఇచ్చావు

'వార్డు మెంబరు కూడా కాని పవన్‌కు కేంద్ర నిఘా సంస్థలు రిపోర్టు ఇచ్చాయా? అవి మేం నమ్మాలా? మిస్సింగ్‌కు, హ్యూమన్ ట్రాఫికింగ్‌కు పవన్ తేడా తెలుసుకోవాలి. మిస్సింగ్ కేసుల్లో టాప్ టెన్ స్టేట్స్‌లో ఏపీ లేనే లేదు. తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. కేసీఆర్‌ను నిలదీయగలవా? రాష్ట్రంలో ప్రతి కుటుంబం సీఎం జగన్‌కే ఓటేస్తుందనే వలంటీర్ వ్యవస్థను దూరం చేయాలనుకుంటున్నారు. నీ దత్త డాడీ హయాంలో కాల్ మనీ సెక్స్ రాకెట్‌పై నోరెందుకు తెరవలేదు? నీ తల్లిని తిట్టిని వాళ్లను గెలిపించమని అడగటానికి సిగ్గు లేదా? గోదావరి జిల్లాల్లో వరదలొస్తే నువ్వు, నీ దత్త డాడీ ఎక్కడ ఉన్నారు? ఆ వలంటీర్లే పీకల్లోతు నీళ్లల్లో దిగి సరుకులు అందించారు. చంద్రబాబు కుమారుడు, అతని స్నేహితుల ఆధ్వర్యంలో ఈనాడు, ఈటీవీ, ఏబీఎన్‌లలో నీ కుటుంబంపై డిబేట్లు చేస్తూ, అత్యాచారం జరిపారని నువ్వే ట్వీట్లు చేశావు. మరి ఏబీఎన్ రాధాకృష్ణ ఇంటర్వ్యూకి పిలిచినప్పుడు సిగ్గులేకుండా ఎందుకు వెళ్లావ్? నీ జనసైనికులను అలగా జనం, సంకర జాతి అన్న బాలకృష్ణకు ఎగురుకుంటూ వెళ్లి ఇంటర్వ్యూ ఎందుకిచ్చావ్' అని రోజా మండిపడ్డారు.

గోదావరి జిల్లాల్లో పవన్‌కు అభ్యర్థులే లేరు

- ఎక్కడ పోటీ చేస్తారో ఆయనకే క్లారిటీ లేదు
- వలంటీర్లలో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారు
- అవగాహన లేకుండా పవన్ చౌకబారు వ్యాఖ్యలు: ఎంపీ మిథున్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, ఏలూరు/ ఏలూరు టౌన్: ఉభయ గోదావరి జిల్లాల్లోని 34 నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీకి అభ్యర్థులే లేరని, అసలు పవన్ ఎక్కడ పోటీ చేస్తారో ఆయనకే స్పష్టత లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఎద్దేవా చేశారు. వలంటీర్లలో ఎక్కువ శాతం మహిళలే ఉన్నారన్న కనీస అవగాహన లేకుండా వలంటీర్ల వ్యవస్థపై పవన్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తెచ్చి పేదలకు ప్రభుత్వ సేవలు చేరవేశారని చెప్పారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేనంతగా ప్రభుత్వం ప్రజలకు చేరువైందని తెలిపారు. సీఎం జగన్ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యల వల్ల జీడీపీ వృద్ధి రేటులో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో ఉందని, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో ఉందని తెలిపారు. 14 ఏళ్ళు సీఎంగా ఉన్న చంద్రబాబు ఈ రాష్ట్రానికి ఏం చేశారో అందరికీ తెలుసునని చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తారని చెప్పారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ సైతం వలంటీర్ల వ్యవస్థను మెచ్చుకున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ మళ్లీ సీఎం అవుతారన్న వణుకుతోనే చంద్రబాబు వెనుక ఉండి పవన్‌తో మాట్లాడిస్తున్నారని విమర్శించారు.

9 నెలలు సైనికుల్లా కష్టపడితే అధికారం మనదే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమాని సైనికుల్లా పనిచేయాలని ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అధ్యక్షతన మంగళవారం ఇక్కడి పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రముఖ జాతీయ చానల్స్ చేసిన సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ మరోసారి ఘన విజయం సాధిస్తుందని తేల్చి చెప్పాయన్నారు. వైఎస్సార్‌సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌పే మరోసారి సీఎంను చేసేందుకు ప్రతి ఒక్కరూ వారికి అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తించాలని సూచించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, తెల్లం బాలరాజు, దూలం నాగేశ్వరరావు, మేకా ప్రతాప్ అప్పారావు, ఎలీజా, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దండగ

- వలంటీర్లపై మరోసారి పవన్ కళ్యాణ్ తీవ్ర వ్యాఖ్యలు
- సరైన పాయింట్ ఎత్తాను కాబట్టే ఇంత స్పందన వచ్చింది

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లు తన ఫ్లెక్సీలను, బొమ్మలను చెప్పులతో కొట్టడం చూశానని, తప్పు చేస్తున్నారు కాబట్టే వారికి కోపం వచ్చిందని అన్నారు. తాను సరైన పాయింట్ ఎత్తాను కాబట్టే ఈ స్థాయిలో స్పందన వచ్చిందన్నారు. మంగళవారం ఏలూరు నగరంలోని క్రాంతి కళ్యాణమండపంలో దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల ముఖ్య నేతలు, మహిళల విస్తృత స్థాయి సమావేశంలో పవన్‌కళ్యాణ్ మాట్లాడారు. వలంటీర్లు సేకరించిన డేటా ఎవరికి ఇస్తున్నారు, ఏ డేటా సెంటర్‌కు వెళుతోంది, వైఎస్సార్‌సీపీ ఆఫీసులో ఉందా, జగన్ ఇంట్లో ఉందా, సెక్యూర్ డేటాను ఎక్కడికి పట్టుకుపోతున్నారు, వలంటీర్ ఫోన్ మిస్ అయితే ఎవరు బాధ్యత వహిస్తారు, వలంటీర్ వ్యవస్థ లేకపోతే పాలన ఆగిపోతుందా.. అంటూ ప్రశ్నించారు. రేషన్ వాహనాలు లేకపోతే పంపిణీ ఆగిపోతుందా అని ప్రశ్నించారు. అసలు వలంటీర్ల వ్యవస్థ అర్థం లేనిదన్నారు. వారికి ఎవరూ డేటా ఇవ్వవద్దన్నారు. జనవాణిలో కొందరు తనను కలిసినప్పుడు వలంటీర్లు ఇంటికి వచ్చి తమ ఆడపిల్లలను ఇబ్బంది పెడుతున్నారని చెబితే తనకు ఇదంతా తెలిసిందన్నారు. వ్యక్తిగత వివరాలు, ఆధార్, బ్యాంక్ ఖాతాలో జమ వివరాలు వంటివన్నీ కూడా వలంటీర్లు తెలుసుకుంటున్నారని చెప్పారు. ప్రతి ఇంటికీ గుట్టు ఉంటుందని, పార్లమెంట్‌లో సమాచారం మేరకు 2019–21 మధ్య 18 సంవత్సరాల్లోపు 29,279 మంది అమ్మాయిలు మిస్ అయ్యారని, వారిలో 14 వేల మంది రికవరీ అయ్యారని చెప్పారు. అమ్మాయిలు మిస్ అయితే టీవీ చానళ్లలో డిబేట్లు ఉండవన్నారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి 'మీ ఇంట్లో ఆడపిల్లలు మిస్సయితే ఇంత ప్రశాంతంగా ఉంటావా అంటూ అభ్యంతరకరంగా వ్యాఖ్యానించారు.



సాయాన్ని తిరస్కరించినప్పుడు మాత్రమే నువ్వు స్వేచ్ఛగా ఉండగలవు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 12 జూలై 2023

మన పాపమే... ఈ ప్రకృతి శాపం!

కనీసం నలభై, యాభై ఏళ్ళుగా ఎన్నడూ చూడనంతటి వర్షం. ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులుగా వర్షాలతో హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, జమ్మూ – కశ్మీర్‌లలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు. ఉత్తర భారతావనిలో అనేక చోట్ల ఎత్తైన ఆలయ శిఖరాలను సైతం ముంచేస్తూ ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు. పేరుకుపోయిన బురదలో కూరుకుపోయిన ఆవాసాలు. ఆకస్మిక వరదలతో సిమ్లాలో కుప్పకూలిన భవనాలు. చమోలీలో కొట్టుకుపోయిన బ్రిడ్జీలు. విరిగిపడ్డ కొండచరియలు, కోతపడ్డ రహదారులు. ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న యమునా నదితో దేశ రాజధాని ఢిల్లీకి సైతం వరద ముప్పు. హిమాచల్‌లో 70 మందికి పైగా దుర్మరణం. ఒక్క ఉత్తరాఖండ్‌లోనే రూ.4 వేల కోట్లకు పైగా నష్టం. వరదలో చిక్కుకున్న వందలాది గ్రామాలు, వేలాది జనం. ప్రకృతి కోపిస్తే, మనిషి పిపీలకమేనని ఇవన్నీ మరోసారి ఋజువు చేస్తున్నాయి. వాతావరణ మార్పుతో పాటు అభివృద్ధి పేరిట మనం చేస్తున్న పర్యావరణ విధ్వంసమూ ఈ బీభత్సానికి కారణమని వెక్కిరిస్తున్నాయి. పట్టణాభివృద్ధి ప్రణాళికలో మన డొల్లతనాన్ని నగ్నంగా నిలబెడుతున్నాయి.

హిమాలయ సానువుల్లోని పర్యాటక ప్రాంతాల్లో విద్యుత్కేంద్రాలే మునిగిపోయి, మట్టి పేరుకుపోవడంతో కరెంట్ లేదు. సాయం చేసే మనిషి లేడు. అనుకోకుండా వచ్చి ఇరుక్కుపోయిన వేల మంది పర్యటకులు ఎలాగోలా బయటపడదామంటే బస్సులు లేవు. విమాన సర్వీసులు లేవు. దోవ, ధైర్యం చెప్పే నాథుడు లేడు. కాసింత రోడ్డు దాటడానికి సైతం వేలకు వేలు దోపిడీ చేస్తున్న కొందరు దళారుల నడుమ ప్రభుత్వ యంత్రాంగం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కుల్లూ, మనాలీ లాంటి ప్రాంతాల్లో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది ధాటికి ఆపి ఉంచిన వాహనాలు సైతం లక్కపిడతల్లా కొట్టుకుపోయాయి. ఇరుకైన జనావాసాల మధ్య నుంచి భారీ వృక్షాలు, కొయ్య దుంగలు కొట్టుకుపోతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి.

పదేళ్ళ క్రితం 2013 జూన్ మధ్యలో ఉత్తరాఖండ్‌ను వణికించిన 'హిమాలయన్ సునామీ' లాంటి ప్రళయ భీకర దృశ్యాలనే తాజా సన్నివేశాలూ తలపిస్తున్నాయి. దృశ్యాలే కాదు... ఈ భారీ వర్షాలు, ఆకస్మిక వరదలకు కారణాలూ దాదాపు అప్పటి లాంటివేనని శాస్త్రవేత్తలు అనడం గమనార్హం. అప్పుడైనా, ఇప్పుడైనా ఒక పక్కన ఋతుపవనాలు, మరోపక్కన మధ్యధరా సముద్రంలో తలెత్తి, ఉత్తర భారతావనికి ఆకస్మిక వర్షాలు తెచ్చే తుపాను – రెండూ ఏకకాలంలో కలగలసి ఈ ముప్పు తెచ్చాయి. జూన్ చివరి వరకు వర్షపాతం 10 శాతం కొరవ పడితే, వారం రోజుల్లో ఈ వాతావరణ ఉత్పాతంతో 2 శాతం అధిక వర్షపాతం స్థాయికి చేరుకున్నామన్న లెక్క నివ్వెరపరుస్తోంది. అంతకన్నా కలవరమేమిటంటే, భూతాపం రోజురోజుకూ పెరుగుతున్నవేళ ఇలా ఉమ్మడిగా ముప్పు మీదపడడం పోనుపోనూ ఎక్కువవుతుందట! అలాగే, పర్యావరణ రీత్యా అతి సున్నిత హిమాలయ రాష్ట్రాలైన హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో ప్రాజెక్టుల పేరిట సాగిస్తున్న విధ్వంసకర అభివృద్ధి నమూనాను ఇకనైనా మార్చుకోకుంటే వినాశనం తప్పదనడానికి తాజా ఘటన మరో హెచ్చరిక.

తాజా ఘటనలు ఋతుపవనాలపై వాతావరణ మార్పుల ప్రభావానికీ అద్దం పడుతున్నాయి. వర్షం పడదు. పడితే కాసేపే భారీ వర్షం, ఆ వెంటే వరద. ఆకస్మిక వాన, వరదల్ని ముందుగా అంచనా వేయడం కష్టమే. వాతావరణ మార్పులను నిశితంగా గమనిస్తూ, ఆకస్మిక వరదలొచ్చే ప్రదేశాలను గుర్తించి హెచ్చరించాల్సి ఉంటుంది. ఈ ప్రమాదభరిత వాతావరణ ఘటనల్ని పసిగట్టాలంటే రాడార్ల వినియోగమే శరణ్యమని వాతావరణ శాస్త్రవేత్తల మాట. దానివల్ల 3 గంటల ముందే ముప్పును పసిగట్టవచ్చు. అయితే, ఇకపై హిమాలయాలు, పడమటి కనుమల లాంటి పర్వత ప్రాంతాల్లో భారీ వర్షాలు, భూపతనాలు పెరుగుతాయన్న హెచ్చరికను చెవికెక్కించుకోవాలి. నిరుడు జనవరి మొదటి నుంచి సెప్టెంబర్ 30 మధ్య మొత్తం 273 రోజుల్లో ఏకంగా 242 రోజుల్లో ఏదో ఒక ప్రకృతి విలయం తప్పలేదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కథనం. అంటే, తరచూ ఎదురయ్యే ముప్పు రీత్యా దీర్ఘకాలిక ప్రణాళికలే ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం.

ఇక, దేశ రాజధాని ఢిల్లీ సైతం మొన్నటి దాకా ఎర్రటి ఎండతో, ఆపైన ముంచెత్తిన వానతో చిగురుటాకులా వణికిపోయింది. వీవీఐపీలు తిరిగే ఇండియా గేట్, జనక్‌పురి సహా మూడు ప్రధానమైన చోట్ల గత వారంలో రహదారులు కుంగిపోయాయి. కొన్నిచోట్ల 8 అడుగుల లోతు గుంటలుపడ్డాయి. ఇవన్నీ మన పట్టణ ప్లానింగ్ వ్యవస్థ ఎంత అస్తవ్యస్తంగా ఉందో అద్దం పడుతున్నాయి. ఇప్పటికే ముంబయ్, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ సహా అనేక నగరాల్లో పదే పదే ఇలాంటి పరిస్థితులే చూస్తున్నాం. చెట్ల నరికివేత, చెరువులు – నదీతీరాల్ని ఆక్రమించేలా విచ్చలవిడి నిర్మాణాలకు అనుమతి వీటికి కారణం. కాసింత వానకే మురుగునీటి పారుదల వ్యవస్థ కుప్పకూలుతోంది.

ఇవన్నీ మన పాపాల ఫలితమే. ఇకనైనా, పాలకులు ఉష్ట్రపక్షి స్వభావాన్ని విడనాడాలి. విచ్చలవిడి అభివృద్ధితో వినాశనమే అని గ్రహించాలి. అంతకంతకూ పట్టణాలకు వలసలు పెరుగుతున్నందున పెరిగే అవసరాలకు తగ్గట్టు సరైన రీతిలో పట్టణాభివృద్ధి ప్రణాళిక చేయాలి. చెరువులు, కాలువలను మొత్తం పట్టణ స్వరూపంలో భాగమని గుర్తించాలి. వాటిని సవ్యంగా కాపాడి, నిర్వహిస్తేనే అర్బన్ ఫ్లడ్స్‌ను నివారించవచ్చు. అలాగే, ఇప్పటికే భారీ అప్పుల్లో పీకల లోతు కూరుకుపోయిన హిమాచల్ లాంటి రాష్ట్రాలు ఈ జలవిలయ నష్టాల నుంచి బయటపడాలంటే కష్టమైనా కొన్ని కఠిననిర్ణయాలు తీసుకోక తప్పదు. ప్రకృతిని మనం కాపాడితేనే అది మనల్ని కాపాడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, తిథి: బ. దశమి రా.8.57 వరకు, తదుపరి ఏకాదశి
నక్షత్రం: భరణి రా. 11.12 వరకు, తదుపరి కృత్తిక
వర్జ్యం: ఉ. 8.59 నుండి 10.34 వరకు
దుర్ముహూర్తం: ప.11.40 నుండి 12.32 వరకు
అమృతఘడియలు: సా.6.24 నుండి 8.04 వరకు.

సూర్యోదయం: 5.36
సూర్యాస్తమయం: 6.35
రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు

తెలుగుజాతి సారస్వత శిఖరం

కొమర్రాజు వెంకట లక్ష్మణరావు తెలుగు జాతి శాశ్వతంగా గుర్తుంచుకోవలసిన శిఖరాగ్ర సమానుడు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల మధ్య సౌహార్ద్ర సయోధ్యకి పాటుపడిన అపర మేధావి.

కృష్ణాజిల్లా పెనుగ్రంచిపోలులో 1876లో జన్మించిన ఆయన విద్యాభ్యాసం తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల్లో సాగింది. చిన్నతనంలోనే మరాఠీలో అనేక రచనలు చేశారు. విద్యార్థి దశలోనే 'సమాచార్', 'వివిధ విజ్ఞాన్ విస్తార్' వంటి మరాఠీ పత్రికలకి సంపాదకత్వం వహించడమే కాదు, 'కేసరి', 'మహారాష్ట్ర' వంటి పత్రికల్లో జరిగే చర్చలు, వాదోపవాదాల్లో కూడా చురుకుగా పాల్గొన్నారు. తెలుగులో 'జనరంజని' పత్రిక నడిపారు. విజయవాడలో పనిచేస్తూ స్త్రీ విద్యావ్యాప్తి కోసం అప్పట్లో రాయసం వెంకట శివుడు ఆధ్వర్యంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో లక్ష్మణరావు, ఆయన సోదరి అచ్చ మాంబ కూడా రాసేవారు. లక్ష్మణరావు ఉన్నతికి అక్క అచ్చమాంబ ఆదరణ ఎంత ఉన్నదో, తొలి కథా రచయిత్రిగా, స్త్రీవాదిగా, సంస్కర్తగా అచ్చమాంబ ఉన్నత వ్యక్తిత్వం సంతరించుకోవడంలో ఆయన ప్రోత్సాహం అంతే ఉంది.



కొమర్రాజు లక్ష్మణరావు

బ్రిటిష్ తత్వవేత్త హెర్బర్ట్ స్పెన్సర్ 'అజ్ఞాత వాదా'న్ని విశ్వశించిన లక్ష్మణరావు మతాతీత లౌకికవాద సిద్ధాంతాన్ని జీవితాంతం అనుసరించడమూ, ఏ ఇతర మార్గం పైనా కూడా కించిత్తు ద్వేష భావం లేకుండా ప్రవర్తించడం ఒకెత్తు. తెలుగు జాతి సాంస్కృతిక వికాసాన్ని కొత్త పుంతలు తొక్కించిన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి వంటి వారి అడుగుజాడల్లో నడిచిన సంస్కర్త లక్ష్మణరావు. హైదరాబాదులో ఈనాటికీ కొనసాగుతోన్న 'శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయా'న్ని స్థాపించడం మొదలు, 'విజ్ఞాన చంద్రికా మండలి', 'విజ్ఞాన చంద్రికా పరిషత్తు', 'ఆంధ్ర సారస్వత పరిషత్తు' వంటి సంస్థల్లో ఆయన నిర్వహించిన పాత్ర అమోఘం. గాడిచర్ల హరిసర్వోత్తమరావు విశిష్ట రచన 'అబ్రహం లింకన్' మొదలుకొని కందుకూరి వీరేశలింగం స్వీయచరిత్ర వరకూ తెలుగు వారికి విశిష్టమైన గ్రంథాల్ని అందించిన ఘనత కొమర్రాజు వారిదే.

కొమర్రాజుకి శాశ్వత కీర్తిని ఆర్జించింది మాత్రం 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ' నిర్మాణం. 'శివాజీ చరిత్ర' మొదలుకొని, 'హిందూ మహా యుగము', 'మహమ్మదీయ మహా యుగము' వంటి రచనలు ఆయన స్వయంగా చేశారు. 'జ్ఞానమొక భాష యొక్క యబ్బ సొమ్ము కాదు' అని ధైర్యంగా నినదించిన ఆయన వ్యవహారిక భాష విషయంలో మాత్రం విజ్ఞత ప్రదర్శించకుండా, సాంప్రదాయవాదిగా మిగిలిపోవడం బాధాకరం. ఆ ఒక్క అంశం మినహా, ఆయనలో వేలెత్తి చూపేందుకు ఏమీ లేదు. అయితే చిన్న (46 ఏళ్ల) వయసులోనే 1923 జూలై 12న ఉబ్బసం వ్యాధితో అకాల మరణం చెందడం తెలుగు జాతి సారస్వత స్రవంతికి తీరని లోటుగా మిగిలిపోయింది.

– గౌరవ్, సామాజిక కార్యకర్త
(నేడు కొమర్రాజు లక్ష్మణరావు శతవర్ధంతి)

మా వలంటీరు

కరోనా వైరస్ భయపెడుతున్నా... వరద వణికిస్తున్నా... ప్రతిపక్షాలు వెక్కిరిస్తున్నా... వలంటీర్లు వెన్నుచూపలేదు. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కరోనా కష్టకాలంలో అందరూ ఉన్నా ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నవారి వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు. వాన వచ్చినా... వరద వచ్చినా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారకముందే అవ్వాతాతల ఇంటి తలుపుతట్టి పింఛను అందిస్తున్నారు. అర్హత గల తల్లికి అమ్మఒడి... అక్కచెల్లెమ్మలకు ఆసరా... చేయూత... నిరుపేదలకు నివేశన స్థలం.. పక్కా ఇళ్లు... విద్యార్థులకు విద్యాదీవెన... ఇలా ఒకటేమిటీ సమస్త సంక్షేమ పథకాలను ప్రజల గడప వద్దకే చేరుస్తూ శభాష్ వలంటీర్ అని అందరి మన్ననలు పొందుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపారు.

వారి వల్లే వైఎస్సార్ బీమా



వలంటీర్ మహబూబ్‌బాషా వల్లే నా కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద రూ.4.50లక్షలు అందింది. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ధ్రువీకరణపత్రాలు అందజేసి వైఎస్సార్ బీమా దరఖాస్తు చేయించి డబ్బులు అందేలా చేశారు. వలంటీర్లు చేసిన సేవలను మరువలేం. కరోనా సమయంలో పాల ప్యాకెట్‌లు ఇంటికే తెచ్చి ఇచ్చారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు అందజేయడంతో ప్రాణాలు నిలుపుకున్నాం.

– ధనలక్ష్మి, 39వ వార్డు, నంద్యాల పట్టణం

మా కుటుంబాన్ని కాపాడిన వలంటీర్



రెండేళ్ల క్రితం మా కుటుంబంలోని మొత్తం ఆరుగురం కరోనా బారినపడ్డాం. మా వీధిని రెడ్‌జోన్‌గా ప్రకటించారు. అప్పుడు మేం ఇంట్లో నుంచి వెలుపలికి రాలేక అవస్థలు పడ్డాం. అప్పుడు వలంటీర్ అశోక్ వచ్చి మా కుటుంబానికి అండగా నిలిచాడు. 18 రోజులు పూర్తిగా మాకు సేవలందించాడు.. వంట సామాగ్రి తెచ్చిచ్చాడు. ప్రతి రోజు బిందెలతో తాగునీరు కూడా అందించాడు. ఎవరూ మమ్మల్ని చూడడానికి కూడా రాలేదు. అటువంటి సమయంలో మా ప్రాణాలను రక్షించింది మా గ్రామ వలంటీరే.

– నారాయణప్ప, తాళ్లపల్లి, గంగవరం మండలం, చిత్తూరు జిల్లా

నా బాధలు తీర్చారు..



నా వయసు 66 దాటింది. నాకు 62 ఏళ్ల వరకు రేషన్ కార్డు లేదు. పింఛన్ రాలేదు. నా కుటుంబ సభ్యులు ఆదరించకపోవడంతో ఒంటరిగా బతుకీడుస్తున్నా. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ వల్ల నాకు ఎంతో మేలు కలిగింది. మా వలంటీర్ నాసు శివశంకర్ నా సమస్యను తెలుసుకుని రేషన్ కార్డు వచ్చేలా చూశాడు. ఆ తర్వాత పింఛను కూడా పెట్టించాడు. ఆ పింఛనే ఇప్పుడు నాకు జీవనాధారం. ఇంత మంచి వ్యవస్థను అందించిన ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– పొన్నాన రామారావు, కుమ్మరిగుంట, సారవకోట మండలం, శ్రీకాకుళం జిల్లా

వలంటీర్ వల్లే ఇంటి స్థలం వచ్చింది



మాకు సొంత ఇల్లు లేక అద్దెకు ఉంటూ అవస్థలు పడుతున్నాం. గత ప్రభుత్వంలో ఇంటిస్థలం కోసం అనేకమార్లు అర్జీలు ఇచ్చినా ప్రయోజనం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వలంటీర్ ఆర్.మహేష్ మా ఇంటికి వచ్చి ఇంటిస్థలానికి దరఖాస్తు చేయించారు. అధికారులు ఇంటిస్థలం మంజూరు చేశారు. రేణిగుంట మండలంలోని ఎల్లమండ్యం సమీపంలోని అడుసుపాళెం జగనన్న కాలనీలో ఇప్పుడు మేం ఇల్లు నిర్మించుకుంటున్నాం. వలంటీర్ వ్యవస్థ వల్ల నేను ఏ నాయకుని చుట్టూ తిరగకపోయినా, అర్హతను బట్టి ఇంటిస్థలం ఇచ్చారు.

– లక్ష్మీపార్వతి, రేణిగుంట, తిరుపతి జిల్లా

ఆస్తులన్నీ కరిగిపోయినా...



నా పేరు మారంరెడ్డి సుబ్బారావు. నా కుడికాలు, కుడి చేతికి పక్షవాతం వచ్చింది. ప్రస్తుతం ఒంటరిగా కొండపిలో నలుగురిని యాచిస్తూ జీవిస్తున్నాను. మా గ్రామ వలంటీర్ మారంరెడ్డి గంగాధర్ సహకారంతో నాకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వచ్చింది. ప్రస్తుతం నాకు పింఛను వచ్చేటట్లు చేశాడు. ప్రతి నెలా కొండపి వచ్చి నాకు పింఛను అందిస్తున్నాడు. గ్రామ వలంటీర్ వ్యవస్థ వలన నాకు ఎంతో మేలు జరిగింది.

– మారంరెడ్డి సుబ్బారావు, పీరాపురం, జరుగుమల్లి మండలం, ప్రకాశం జిల్లా

కష్టకాలంలో కన్నబిడ్డలా చూసుకుంది



నాకు ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇద్దరికి పెళ్లి చేశాం. నేను, నా భర్త ఇద్దరమే ఉంటున్నాం. నాకు కరోనా సోకడంతో మాట్లాడేందుకు అందరూ భయపడ్డారు. మా వలంటీర్ తాడువాయి శ్వేత ధైర్యంగా మా ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకుంది. మందులు ఇచ్చింది. కరోనా సోకిన మూడు రోజుల తర్వాత నాకు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో నన్ను నరసరావుపేటలోని క్వారెంటైన్ సెంటర్‌కు పంపించింది. ఇంటి వద్ద ఉన్న నా భర్తకు కూరగాయలు, సరుకులు, పాలు వంటివి అందించింది. కోలుకుని ఇంటికి వచ్చే వరకు మమ్మల్ని కన్నబిడ్డ కన్నా ఎక్కువగా చూసుకున్న వలంటీర్ శ్వేత సేవలను ఎప్పటికీ మరిచిపోలేను. – ఊటా అచ్చమ్మ, ముప్పాళ్ల, పల్నాడు జిల్లా

డోలీ మోసి ప్రాణం నిలిపాడు



మాది మారుమూల గిరిజన గ్రామం. నేను గత ఏడాది డిసెంబర్‌లో చెట్టు నుంచి జారి కిందపడిపోయాను. తలకు తీవ్రగాయమై రక్తం అధికంగా పోయింది. బుడపనస గ్రామం నుంచి ప్రధాన రహదారి రంగబయలు వరకు సరైన రహదారి లేకపోవడంతో మా గ్రామ వలంటీర్ రాము మూడు కిలోమీటర్లు గ్రామస్తుల సాయంతో అడవి మార్గంలో మోసుకుని వచ్చాడు. అక్కడ నుంచి 108కి ఫోన్ చేసి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. సకాలంలో ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్య సేవలు అందించాడు. లేకుంటే నేను చనిపోయి ఉండేవాడిని. ఆ సమయంలో నాకు ఖర్చుల నిమిత్తం వలంటీర్ రాము రూ.5 వేలు ఆర్థికసాయం చేశాడు. ఆరోజు ఆస్పత్రికి సకాలంలో తరలించడం వల్ల ఈ ప్రాణాలతో ఉన్నాను.

– పాంగి అనుసు, బుడపనస, అల్లూరి సీతారామరాజు జిల్లా

శభాష్ వలంటీర్

నేనున్నానంటూ..


ప్రాణం పోసిన వలంటీర్ వ్యవస్థ

2021 మే నెలలో శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం జగరా జుపల్లిలో పేద దంపతులు నాగరాజు, నాగలక్ష్మమ్మ దంపతులకు కష్టమొచ్చింది. వీరి కుమార్తె సుమలత (9)కు తీవ్రజ్వరం 20 రోజులు తగ్గలేదు. హిమోగ్లోబిన్ 1.5కి పడిపోయింది. చనిపోతుందని భావించి ఇంటి బయట పడుకోబెట్టారు. ఈ విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రసాద్ అప్పటి ఎంపీడీవో నరేష్‌కృష్ణకు సమాచారం అందించారు. బాలికను సొంత ఆటోలో పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సుమారు 15 రోజుల పాటు ఇతరుల నుంచి రక్తం ఇప్పించి బాలికకు చికిత్సలో సహాయపడ్డారు. ఆ అమ్మాయి కోలుకుని ఇంటికి చేరుకుంది. అయితే.. ఐదునెలలకే ఆ బాలిక చనిపోయినప్పటికీ.. వలంటీర్ ప్రసాద్ అందించిన సేవలు మాత్రం గ్రామస్తులకు గుర్తుండిపోయాయి. ప్రసాద్ సేవలను ప్రశంసిస్తూ అప్పట్లో పత్రికల్లో వార్తలు కూడా ప్రచురితమయ్యాయి.

అంతిమంలోను అండగా..



కరోనా విపత్తులో ప్రాణాలు కోల్పోయినవారికి అంతిమ సంస్కారాలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఎండపల్లిలో వలంటీర్లు మోర్త రవి, స్వామిరెడ్డి శివకామేశ్వరరావు, విజ్జపురెడ్డి నాగేంద్ర. 2021 మే నెల 3వ తేదీ గ్రామంలో తలాటం కొండయ్య కరోనాతో మృతిచెందాడు. అతడి బంధువులకు కరోనా సోకడంతో.. కొండయ్య అంత్యక్రియలు నిర్వహించేందుకు వారు వచ్చే వీలు లేకపోయింది. ఇతరులు కూడా భయపడి ముందుకు రాలేదు. మృతదేహం ఉదయం నుంచి సాయంత్రం ఇంటి వద్దే ఉండిపోయింది. వలంటీర్లు వెంటనే పీపీఈ కిట్లు తెప్పించుకుని కొండయ్య మృతదేహాన్ని పంచాయతీ రిక్షాపై మరుభూమికి తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తిచేశారు.

సేవ చేసేందుకే మేము..



ఇతడి పేరు వల్లెపు వెంకటేశ్వరరావు. దివ్యాంగుడు. బాపట్ల జిల్లా అద్దంకి మౌలానగర్ నివాసి. 2021 ఆగస్టులో ఇంట్లో వారికి కరోనా పాజిటివ్ వచ్చింది. వెంకటేశ్వరరావుకు కూడా కోవిడ్ లక్షణాలు కనిపించడంతో మేదరమెట్ల వైద్యశాలలో చేరాడు. బజారులో తిరగడానికే భయపడుతున్న సమయంలో.. వారి వార్డు వలంటీరు సైదా మేదరమెట్ల వైద్యశాలకు వెళ్లి వెంకటేశ్వరరావుకు వికలాంగ పింఛన్ రూ.3 వేలు అందించాడు. దీంతో వెంకటేశ్వరరావు తండ్రి ఇలాంటి సమయంలో మా దగ్గరకు వచ్చి పింఛన్ ఇచ్చావని సంతోషిస్తూ అందులో సగం డబ్బు వలంటీరుకు ఇవ్వబోయాడు. 'మేము సేవ చేయడానికే ఉన్నాం. ఇది మాకు జగన్ ఇచ్చిన వరం. మాకు ఏమీ వద్దు..' అంటూ సైదా తిరస్కరించాడు. దీంతో అందరూ సైదాను అభినందించారు. మాస్కులు లేని వారికి ఉచితంగా మాస్కులు పంచడం వంటి సేవలు కూడా చేసిన సైదా అందరి ప్రశంసలు అందుకున్నాడు.

ప్రాణాలు కాపాడారు



ఈ ఫొటోలో కూరగాయలు ఇస్తున్న యువకులు వలంటీర్లు. కూరగాయలు అందుకుంటున్న వ్యక్తి విజయనగరం జిల్లా సంతకవిటి మండలం అప్పల అగ్రహారం గ్రామానికి చెందిన కొమనబల్లి సన్యాసిరావు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో సన్యాసిరావు, రమణమ్మ దంపతులు మాత్రమే ఇంటివద్ద ఉన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన కుమారుడు ఆ సమయంలో ఇంటికి రాలేకపోయాడు. తాము అసలు బతుకుతామా?లేదా? అనుకున్న సమయంలో వలంటీర్లు వీరికి వెన్నుదన్నుగా నిలిచారు. కూరగాయలు వంటివి ఇంటికే తీసుకెళ్లి ఇవ్వడంతోపాటు వారి కుమారుడిని రప్పించి, కోవిడ్ షెల్టర్‌లో ఉంచి అన్ని ఏర్పాట్లు చేశారు. కోవిడ్ కష్టకాలం నుంచి సన్యాసిరావును, అతడి కుటుంబాన్ని గట్టెక్కించారు.

సేవకు ప్రతిరూపం



కరోనా సమయంలోను భయపడకుండా కరోనా బాధితులకు ప్రభుత్వ సాయాన్ని పంపిణీ చేయడ మేగాక అవసరమైన నిత్యావసరాలను కూడా అందించిన ఈమె వలంటీరు రేణుకాదేవి. తిరుపతి అర్బన్ మండలం 47వ డివిజన్ ఎర్రమిట్ట ప్రాంతంలో నివసిస్తున్న లక్ష్మీదేవి భర్త, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నారు. 2020లో లక్ష్మీదేవికి కరోనా సోకడంతో ఇంట్లోనే వేరే గదిలో ఉండాల్సి వచ్చింది. ఆ సమయంలో వలంటీర్ రేణుకాదేవి ఏఎన్ఎం ద్వారా లక్ష్మీదేవి కుటుంబ సభ్యులకు ఇంటివద్దే కోవిడ్ పరీక్షలు చేయించారు. ప్రభుత్వం అందించినరూ.వెయ్యి సాయాన్ని ధైర్యంగా లక్ష్మీదేవి ఇంటికెళ్లి అందజేశారు. రోజు ఆమె ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. ఆ కుటుంబ సభ్యులకు అవసరమైన సరుకులను కూడా తీసుకెళ్లి అందజేశారు.

పరిశుభ్రతలో..



ఇక్కడ రిక్షా తొక్కుతూ బ్లీచింగ్ చల్లుతున్న వారు పారిశుద్ధ్య కార్మికులు కాదు.. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి గ్రామానికి చెందిన వలంటీర్లు దట్టి బాలకృష్ణ, సంతోష్‌కుమార్, యోగేశ్వరరావు, రాజరాజేశ్వరి. 2020 మే 26వ తేదీ నాటిది ఈ చిత్రం. కోవిడ్ కాలంలో ప్రజలు బయటకు రావడానికి వణికిపోయారు. శానిటేషన్ సిబ్బంది విధులు నిర్వర్తించడానికి భయపడటంతో ఆ పనుల్ని కూడా ఈ నలుగురు భుజానికెత్తుకున్నారు. స్వచ్ఛ భారత్ వాహనాన్ని తీసుకుని వీధుల్లో బ్లీచింగ్ చల్లి శుభ్రం చేశారు. దట్టి బాలకృష్ణ రిక్షా తొక్కగా సంతోష్‌కుమార్, యోగేశ్వరరావు, రాజరాజేశ్వరి బ్లీచింగ్ చేతపట్టుకుని వీధివీధిన చల్లారు.

వలంటీర్‌కు రుణపడి ఉంటా



ఈ ఫొటోలో బెడ్‌పై చికిత్స పొందుతున్న వ్యక్తి ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన దూసనపూడి వెంకటేశ్వరరావు. ప్రతి నెల ఒకటో తేదీన వలంటీర్ ద్వారా ఇంటివద్దే పింఛను సొమ్ము అందుకుంటున్న ఆయన ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురవడంతో విజయవాడ ఆస్పత్రిలో చేరారు. ఇక ఈ నెల పింఛను అందదేమో అనుకున్నారు. కానీ.. వలంటీర్ కత్తుల వెంకటశ్రీలక్ష్మి సేవాభావంతో ఆమె సొంత ఖర్చులతో విజయవాడ వెళ్లి వెంకటేశ్వరరావుకు పింఛను అందజేశారు. వలంటీర్లు లేకుంటే తనలాంటి వారి గతేమవుతుందని వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. దేవుళ్ల వంటి వలంటీర్లను గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు.

బెంగళూరు వెళ్లి.. ఈకేవైసీ



కరోనా విజృంభనకు ముందు కర్నూలు జిల్లా కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన 200 కుటుంబాలు కర్ణాటకలోని బెంగళూరుకు వలసవెళ్లాయి. కరోనా పెరిగిపోవడంతో రాకపోకలు స్తంభించాయి. ఆ కుటుంబాలు మూడునెలలు అక్కడే ఉండిపోవడంతో రైస్‌కార్డుల అప్‌డేట్‌కు ఈకేవైసీ అవసరమైంది. దీంతో వలంటీర్ శంకర్.. బెంగళూరు వెళ్లాడు. ఆంక్షలను అధిగమించి దాదాపు 400 కుటుంబాలకు అక్కడే ఈకేవైసీ పూర్తిచేసి శభాష్ అనిపించుకున్నాడు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, చిత్తూరు, ఆదోని, కోసిగి ప్రాంతాల వాళ్లను కలుసుకుని ఈకేవైసీ పూర్తిచేశాడు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను భుజాలపై వేసుకుని కొండలెక్కి..



అనకాపల్లి జిల్లా రావికమతం మండలంలోని చలిసింగం గ్రామం రెండు కొండల అవతల ఉంది. ఆ గ్రామంలో తాగునీటి సదుపాయం కోసం చీకాయపాడు బోరుబావి నుంచి కొండపైకి పైపులైన్ వేశారు. గత ఏడాది ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో దానికి అమర్చిన మోటారు పనిచేయక నీటి సరఫరా నిలిచిపోయి తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాన్స్‌కో సిబ్బంది ట్రాన్స్‌ఫార్మర్‌ను రహదారి ఉన్న చీకాయపాడు వరకు తేగలిగారు. అక్కడి నుంచి కొండపైకి చేర్చే మార్గం లేక అక్కడే వదిలేశారు. ఎవరూ రాకపోవడంతో రెండురోజులు అక్కడే ఉండిపోయింది. దీంతో గ్రామ వలంటీర్లు వంజరి రవీంద్ర, కూడ రవి, తుర్రె రవి, ఒంపురి రాజు, సబ్బారపు రమణ నడుం బిగించారు. బలమైన కర్రల సహాయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను భుజాలపైకి ఎత్తుకుని అతి కష్టంపై రెండు కొండలెక్కారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి తాగునీటి ఇబ్బందులు తొలగించారు.

కరోనా కష్టంలో అండగా..



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో కరోనా కాలంలో ఒక కుటుంబానికి అండగా నిలిచారు వలంటీరు తమ్మిశెట్టి యలమందరావు. ఆరోగ్యం ఎలా ఉందని అడగడానికి కూడా ఎవరూ సాహసించని సమయంలో చల్లా లక్ష్మి కుటుంబానికి ధైర్యం చెప్పి బతుకుపై ఆశ కలిగించారు. చల్లా లక్ష్మి.. డ్రైవర్‌గా పనిచేస్తున్న భర్త, ఇద్దరు పిల్లలతో సంతోషంగా జీవిస్తున్న సమయంలో.. 2019లో కరోనా బారిన పడింది. ఇరుగుపొరుగు వారు, బంధువులు, తోబుట్టువులు కూడా వారి ఇంటికి వెళ్లలేదు. మాట్లాడేందుకు కూడా ఎవరూ రాని ఆ సమయంలో లక్ష్మిని బతుకు భయం వెంటాడింది. ఆయాసంతో బాధపడుతున్న తనకు ఏమైనా అయితే పిల్లల భవిష్యత్తు ఏమిటనే ఆందోళనకు గురైంది. ఆ సమయంలో ఆ కుటుంబానికి వలంటీర్ తమ్మిశెట్టి యలమందరావు అండగా నిలిచారు. ధైర్యంగా వారి ఇంటికి వెళ్లి కరోనా గురించి ఆందోళన చెందవద్దని చెప్పి ప్రభుత్వం ఇచ్చిన మందుల కిట్లు, పౌష్టికాహారం అందజేశారు. రోజూ ఆమె ఆరోగ్యం గురించి కనుక్కున్నారు. క్రమంగా లక్ష్మి కోలుకుంది. తమ కుటుంబం ఇప్పుడు ఆనందంగా జీవిస్తోందంటే వలంటీరు సేవలే కారణమని ఆమె సంతోషంగా చెబుతోంది.

క్లుప్తంగా...

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయంలో శుద్ధి చేస్తోన్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: జూలై 17న సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని పురస్కరించుకుని మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఆనంద నిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో కడిగారు. ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. శ్రీవారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి పూజ, నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం సర్వదర్శనం ప్రారంభించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు రాం భూపాల్ రెడ్డి, మూరంశెట్టి రాములు, మారుతీ ప్రసాద్, మధుసూదన్ యాదవ్, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో వైభవంగా మలయప్ప కళ్యాణోత్సవం



సెయింట్ లూయిస్‌లో శ్రీవారి కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సాక్షి, అమరావతి: అమెరికాలోని సెయింట్ లూయిస్‌లోని ది హిందూ ఆలయంలో ఆదివారం రాత్రి శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవాలు టీటీడీ ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య కలియుగ దైవం భక్తులకు మలయప్ప స్వామిగా దర్శనమిచ్చారు. పండితులు వైఖానస ఆగమం ప్రకారం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి కళ్యాణాన్ని జరిపించారు. ఏపీఎన్‌ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి కళ్యాణోత్సవాలను టీటీడీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తానాలో జరిగిన వేంకటేశ్వర స్వామి కళ్యాణానికి సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ దంపతులు, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

ఏపీ జెన్‌కో బొగ్గు కన్వేయర్‌లో మంటలు

- 2వ యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేత



ముత్తుకూరు: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నేలటూరులోని శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుదుత్పత్తికి అవసరమైన బొగ్గు తరలించే కన్వేయర్ నుంచి మంటలు వ్యాపించాయి. బాయిలర్ సమీపంలో 50 అడుగుల ఎత్తులో ఈ ప్రమాదం జరిగింది. కన్వేయర్‌లో ఇరుక్కుపోయిన బొగ్గుపై రాపిడి జరిగి మంటలు రేగాయి. ప్రాజెక్ట్‌లోని 2 అగ్నిమాపక వాహనాలు, కృష్ణపట్నం పోర్టు, సెంబకార్ప్ పవర్ కాంప్లెక్స్ నుంచి 3 వాహనాలు వచ్చి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి. ఈ ప్రమాదంలో 50 మీటర్ల మేరకు కన్వేయర్ కాలిపోయింది. ఈ కన్వేయర్ ద్వారా బొగ్గు రవాణా నిలిచిపోవడంతో 2వ యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఈ ప్రమాదం వల్ల ఎంత నష్టం వాటిల్లిందనేది తెలియాల్సి ఉంది.

కోటి తలంబ్రాల పంటలో వానర సేవ



కోటి తలంబ్రాల పంటలో దుక్కిదున్నుతున్న వానర వేషధారణలోని భక్తులు

గోకవరం: భద్రాచలంలో శ్రీరాముని కళ్యాణానికి గోటితో ఒలిచి తలంబ్రాలు సిద్ధం చేసేందుకు కాకినాడ జిల్లా గోకవరం మండలం అచ్యుతాపురంలో మంగళవారం పంట పొలంలో వానర వేషధారణల్లో భక్తులు దుక్కిదున్ని విత్తనాలు చల్లారు. కోరుకొండ శ్రీకృష్ణచైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణం అప్పారావు ఆధ్వర్యంలో శ్రీరాముడు, ఆంజనేయుడు, అంగదుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు వేషధారణల్లో భక్తులు పొలంలో భక్తిగీతాలు ఆలపిస్తూ రామనామం జపిస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు. భద్రాచలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకువచ్చిన ధాన్యం విత్తనాలను పొలంలో చల్లారు. అంతకు ముందు ఈ విత్తనాలతో సీతారాముల విగ్రహాలకు అభిషేకం చేశారు. అప్పారావు మాట్లాడుతూ 13వ కోటితలంబ్రాల జ్ఞానయజ్ఞంలో భాగంగా విత్తనం నుంచి తలంబ్రాల వరకు అంతా రామమయం అనే భక్తిభావంతో ఈ యేడాది కూడా ఎకరం పొలంలో కోటితలంబ్రాల పంటను పండిస్తున్నట్లు చెప్పారు.

పెళ్లింట పెనువిషాదం

ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం..

- కాలువలో ఆర్టీసీ బస్సుపడి ఏడుగురు దుర్మరణం.. 17 మందికి గాయాలు



బస్సు ప్రమాదంలో మరణించిన వారి మృతదేహాలు

సాక్షి ప్రతినిధి ఒంగోలు/సాక్షి, అమరావతి: పెళ్లి బృందంతో వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు సోమవారం అర్ధరాత్రి ప్రకాశం జిల్లా దర్శి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో రోడ్డు పక్కనున్న దిమ్మెను ఢీకొని సాగర్ కాలువలోకి బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు దుర్మరణం చెందగా.. 17మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ చిన్నారి కూడా ఉంది. వివరాలిలా ఉన్నాయి..

పొదిలి పట్టణం ఎన్జీఓ కాలనీలో గౌస్ మొహిద్దీన్ కుటుంబం నివాసముంటోంది. ఆయన కుమారుడు సిరాజ్ తన కుటుంబంతో సౌదీలో ఉంటున్నాడు. బంధువులు, స్నేహితుల సమక్షంలో ఆదివారం కాకినాడకు చెందిన అక్బర్ షరీఫ్‌తో తన కుమార్తె వివాహాన్ని సిరాజ్ ఘనంగా నిర్వహించారు. అనంతరం.. రిసెప్షన్ నిమిత్తం కాకినాడ వెళ్లేందుకు ఆర్టీసీ బస్సును అద్దెకు తీసుకుని సోమవారం రాత్రి 12 గంటల సమయంలో 37 మందితో బయల్దేరారు. అరగంటలోపే దర్శి పట్టణ శివారులో బస్సు ప్రమాదానికి గురైంది. ఎదురుగా శరవేగంతో వస్తున్న జితిన్ ట్రావెల్స్‌కు చెందిన బస్సును తప్పించబోయి అదుపుతప్పి బ్రిడ్జి పక్కనున్న దిమ్మెను, వంతెన గోడను, కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి బ్రిడ్జి పైనుంచి సాగర్ కాలువలోకి బస్సు దూసుకుపోయింది. సుమారు 25 మీటర్ల లోతులోకి బస్సు పడిపోయింది. దీంతో బస్సులోని వారు ఒకరిపై ఒకరు పడిపోయి బస్సులోనే ఇరుక్కుపోయారు. ఫలితంగా ఏడుగురు మృతిచెందగా ఎనిమిది మందికి తీవ్రగాయాలు, మరో తొమ్మిది మందికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పొదిలి పట్టణానికి చెందిన అబ్దుల్ అజీజ్ (65), ఉమ్మేహనీ (60), షేక్ రమీజ్ (48), ముల్లా నూర్జహాన్ (58), ముల్లాజానీబేగం (65), షేక్ షాబీనా (35), షేక్ హీనా (6) అక్కడికక్కడే మృతిచెందారు. మృతుల్లో చెన్నై డీఎస్పీ రియాజుద్దీన్ భార్య రమీజ్ కూడా ఉన్నారు. వధూవరులు మాత్రం ముందుగానే కారులో వెళ్లారు. ఇక తీవ్రంగా గాయపడ్డ వారికి దర్శి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స చేశారు. అందులో ఇద్దరిని గుంటూరు అమరావతి ఆస్పత్రికి, నలుగురుని ఒంగోలు కిమ్స్‌కు, మరో ఇద్దరిని ఒంగోలు వెంకటరమణ ఆస్పత్రికి తరలించారు. ప్రమాద ఘటన జరిగిన వెంటనే దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డి, సీఐ జే. రామకోటయ్య, ఎస్సై రామకృష్ణ బస్సులో వారిని బయటకుతీసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఎస్పీ మలికాగర్గ్ హుటాహుటిన అక్కడకు చేరుకుని ట్రైనీ ఎస్పీలతో కలిసి సహాయక చర్యలు చేపట్టి బాధితులకు ధైర్యం చెప్పారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ క్షతగాత్రులను పరామర్శించారు. గాయపడిన వారందరికీ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. అలాగే, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆస్పత్రికి వెళ్లి మృతుల కుటుంబాలను పరామర్శించారు. మరోవైపు.. ప్రమాదానికి ఎదురుగా వస్తున్న జితిన్ ట్రావెల్స్ బస్సు కూడా కారణమని డీఎస్పీ అశోక్‌వర్ధన్ తెలిపారు. దానిపైనా కేసు నమోదు చేశారు.

సమాచారం అందించిన బస్సు డ్రైవర్..

ఇక అతికష్టం మీద బస్సు నుంచి బయటకు వచ్చిన డ్రైవర్ రమేష్ 100కి ప్రమాదంపై సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రేన్‌లు, అంబులెన్స్‌లను రప్పించారు. స్థానికుల సహకారంతో బస్సులో ప్రయాణికులను, మృతదేహాలను బయటకుతీశారు. కాలువలో నీళ్లు లేకపోవడంతో ప్రమాద తీవ్రత తగ్గిందని స్థానికులు చెప్పారు.

చిన్నారి కోసం మూడుగంటల పాటు..

ఇక ప్రమాదం గురించి తెలుసుకున్న స్థానికులు తెల్లవారుజామునే సహాయక చర్యలు చేసేందుకు భారీగా తరలివచ్చారు. ఈ తరుణంలో ఆరేళ్ల పాప హీనా తల బస్సు కింద వైపు కనిపించింది. దీంతో మూడుగంటలకు పైగా శ్రమించి బయటకు తీసినప్పటికీ ఆ చిన్నారి అప్పటికే మరణించడం అందరికీ కలచివేసింది. ఆమె కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

గవర్నర్ దిగ్భ్రాంతి..

ఈ ఘటనపై గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారని రాజ్‌భవన్ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

బాధితులకు సీఎం సానుభూతి.. ఎక్స్‌గ్రేషియా

ప్రమాద ఘటనను తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని ఆయన తెలిపారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని.. మృతుల కుటుంబాలకు తోడుగా నిలవాలని సీఎం అధికారులను ఆదేశించారు. అలాగే, మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించారు. మరోవైపు.. ఘటనపై హోంమంత్రి తానేటి వనిత కూడా ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. ఈ ఘటన ఎంతో దురదృష్టకరం, బాధకరమన్నారు.

కళ్ల ముందే ప్రమాదం జరిగింది

బస్సు దర్శి ప్రాంతం దగ్గరకు వస్తుండటంతో వెళ్లి డ్రైవర్ వద్ద నిలబడ్డాను. చిన్న వంతెన వంటిది వచ్చింది. అదే సమయంలో ఎదురుగా రాయచోటి బస్సు వస్తోంది. డ్రైవర్ బస్సును పక్కకు తిప్పడంతో ఒక్కసారిగా బస్సు కిందకు పడిపోయింది. నా అక్కలిద్దరూ చనిపోయారు. నా భార్య సలీమున్నీసాకు కూడా దెబ్బలు తగిలాయి.

– షేక్ యజ్దానీ, క్షతగాత్రుడు

అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే సీఎం ధ్యేయం

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని
- జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడు ప్రభుత్వ ఆస్పత్రుల ప్రారంభం



జగ్గయ్యపేటలో 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని, విప్ ఉదయభాను

జగ్గయ్యపేట: రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనేదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో నాబార్డు నిధులు రూ.3 కోట్లతో నిర్మించిన 50 పడకల నూతన ఆస్పత్రి భవనం, తొర్రగుంటపాలెంలో రూ.90 లక్షలతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం, బలుసుపాడు రోడ్డులోని జగనన్న లేఅవుట్‌లో రూ.90 లక్షలతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభానుతో కలిసి మంత్రి రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ వైద్య రంగంలో మౌలిక వసతుల కల్పనకు రూ.16,822 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 104, 108 వాహనాలు పెద్ద మొత్తంలో ఏర్పాటు చేయడంతోపాటు వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ పథకం పేరుతో గ్రామాల్లో ఇళ్ల వద్దే రోగులకు వైద్యం అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 17 కొత్త మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 150 పీహెచ్‌సీలు, 992 సీహెచ్‌సీలు ఆధునీకీకరించామని తెలిపారు. ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు వైద్యరంగానికి సీఎం వైఎస్ జగన్ అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని చెప్పారు. జగ్గయ్యపేట ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పట్టణానికి రెండు వైపులా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని, వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ పి.సరళమ్మ, డీసీహెచ్‌ఎస్ స్వప్న, కేడీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి పటిష్ట కార్యాచరణ

- అవసరమైన చోట కొత్త పీఏసీఎస్‌లు
- సహకార శాఖపై సమీక్షలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రైతులకు మరింత మెరుగైన సేవలందించేలా సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సహకార శాఖ పురోగతిపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నష్టాల్లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)ను లాభాల బాట పట్టించేందుకు చర్యలు తీసుకోవాలని, పునరుద్ధరణకు అవకాశం లేని సంఘాలను లిక్విడేట్ చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. అవసరమైన చోట నూతన పీఏసీఎస్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. కాకినాడ, ఏలూరు, కడప, కర్నూలు, అనంతపురం డీసీసీబీలు లాభాల బాట పట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. పీఏసీఎస్‌లు, డీసీసీబీలు, అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్‌లు, డీసీఎంఎస్‌లలో అవకతవకలు, నిధులు దుర్వినియోగానికి సంబంధించి నమోదైన కేసుల విచారణను వేగవంతం చేయాలన్నారు. నూరు శాతం నిధులను రికవరీ చేయడంతోపాటు నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రూ.79.72 కోట్లతో చేపట్టిన పీఏసీఎస్‌ల ఆధునికీకరణ ప్రాజెక్ట్ పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఐసీడీపీ) ఫేజ్–2 లో రూ.609.39 కోట్ల అంచనా వ్యయంతో తూర్పు గోదావరి, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో చేపట్టిన గోదాములు, కార్యాలయ భవనాల నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫేజ్–3లో మరికొన్ని జిల్లాల్లో గోదాములు, కార్యాలయ భవనాల నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. వ్యవసాయ మౌలిక సదుపాయాల కల్పనా నిధి (ఏఐఎఫ్) ప్రాజెక్ట్ ఫేజ్–1, 2లలో రూ.1,661.16 కోట్లతో చేపట్టిన 2,405 గోదాముల నిర్మాణ పనులను కూడా వేగవంతం చేయాలన్నారు. పీఏసీఎస్‌లకు అనుబంధంగా 106 ప్రాంతాల్లో పెట్రోల్ బంకులను సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. సహకార శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సహకార శాఖ కమిషనర్ అహ్మద్‌బాబు, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చార్జిషీటు వచ్చాక వివేకా హత్య కేసు విచారణ

- స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్ అందిన తర్వాత విచారణ చేపడతామని తెలంగాణ హైకోర్టు చెప్పింది. వివేకా హత్య కేసులో కిరాయి హంతకుడు షేక్ దస్తగిరి (ఏ–4)ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అప్రూవర్‌గా ప్రకటించి, అరెస్టు నుంచి మినహాయింపు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంవీ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.సురేందర్ మంగళవారం మరోసారి విచారణ జరిపారు. ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేశారు కదా అని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సాంకేతిక అంశాలు సరిగా లేవని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం చార్జిషీట్‌ను వెనక్కు ఇచ్చిందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు తెలిపారు. ఆ అంశాలను సరిచేసి మళ్లీ కోర్టుకు అందజేశామని సీబీఐ తెలిపింది. దీంతో చార్జిషీట్ అందిన తర్వాత విచారణ చేపడతామని న్యాయమూర్తి చెప్పారు. విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేశారు.

'అమరావతి' కేసు విచారణ డిసెంబరుకు వాయిదా

- ప్రతివాదులందరికీ నోటీసులు పంపాలని సుప్రీం కోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: అమరావతిలో నిర్మాణాలకు సంబంధించిన కేసు విచారణను సుప్రీం కోర్టు డిసెంబరుకు వాయిదా వేసింది. ఏపీ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం, కోర్టు ఆదేశాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లు మంగళవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. రిజిస్ట్రీ సమాచారం మేరకు ప్రతివాదులందరికీ నోటీసులు అందలేదని, ఈ దశలో కేసు విచారణ సాధ్యం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. ఇద్దరు ప్రతివాదులు మరణించారని, వారు మినహా మిగతా అందరికీ నోటీసులు పంపామని రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రతివాదులందరికీ నోటీసులు పంపాలని ధర్మాసనం ఆదేశించింది. కేసు విచారణ వేగవంతం చేయాలని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది కేకే వేణుగోపాల్ కోరారు. రాజ్యాంగ ధర్మాసనం కేసులు ఉన్న నేపథ్యంలో విచారణ సాధ్యం కాదని ధర్మాసనం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌ను లీడ్ మ్యాటర్‌గా పరిగణిస్తామని పేర్కొంది. డిసెంబరులో నాన్ మిసిలీనియస్ డే నాడు విచారణ చేపడతామని ధర్మాసనం తెలిపింది.

దుర్గమ్మకు దేవదాయ శాఖ మంత్రి సారె సమర్పణ



సారెతో దుర్గమ్మ సన్నిధికి వెళ్తున్న డిప్యూటీ సీఎం సత్యనారాయణ, కమిషనర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాలలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం సారె సమర్పించారు. విజయవాడ బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి వద్ద దేవతా మూర్తులకు, అమ్మవారి విగ్రహానికి మంత్రి సత్యనారాయణ, కమిషనర్ సత్యనారాయణ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపుగా దుర్గగుడికి చేరుకున్నారు. వీరితో పాటు సెంట్రల్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ మల్లాది విష్ణు, చిత్తూరు ఎమ్మెల్యే జె.శ్రీనివాస్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని మంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవారికి పట్టుచీర, పూలు, పసుపు, కుంకుమ, మిఠాయిలతో సారె సమర్పించి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలను అందించారు. అనంతరం మహా మండపం ఆరో అంతస్తుకు చేరుకున్న మంత్రి సత్యనారాయణ, దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ అమ్మవారికి సారె సమర్పించారు.

గంటపాటు 'కోలగట్ల' జలాసనాలు



నీటిలో యోగాసనం వేస్తున్న కోలగట్ల

సాక్షి ప్రతినిధి, విజయనగరం: గంట పాటు నీటిపై తేలియాడుతూ..పలు యోగాసనాలు వేసి రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి(64) అందరినీ ఆకట్టుకున్నారు. జాతీయ స్విమ్మింగ్ పూల్ డేను పురస్కరించుకుని క్రీడారంగ విశిష్టత, స్విమ్మింగ్ సాధన, యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించడానికి విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న ఆక్వా స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం ఆయన కార్యక్రమం చేపట్టారు. ఈ ప్రదర్శనను అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. వందలాది మంది సమక్షంలో నిర్విఘ్నంగా గంట పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం దేశ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తూ ముగించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని సత్కరించారు. మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యేలు శంబంగి చిన వెంకట అప్పలనాయుడు, బొత్స అప్పలనరసయ్య, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- విశాఖ ఎంపీ కుటుంబసభ్యుల కిడ్నాప్ కేసు

విశాఖ లీగల్: సంచలనం సృష్టించిన విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో నాలుగో ముద్దాయి బొమ్మిడి రాజేష్ వేసిన బెయిల్ పిటిషన్‌ను మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ఎస్.శ్రీదేవి డిస్మిస్ చేశారు. ముద్దాయి తరఫున సీనియర్ న్యాయవాది సాయిబాబా, ప్రభుత్వం తరఫున జిల్లా ప్రధాన న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాండ్రేగుల జగదీశ్వరరావు వాదనలు వినిపించారు.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరిట రూ.4 కోట్లు స్వాహా

- మోసపోయిన 19 మంది
- పత్తాలేని ఈక్విటీ నాక్స్ యజమాని రాహుల్ సింగ్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



ఈక్విటీ నాక్స్ కార్యాలయంలో రాహుల్ సింగ్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరిట విశాఖపట్నంలో చేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. రూ.4 కోట్ల వరకు పెట్టుబడి పెట్టిన 19 మంది పోలీసుల్ని ఆశ్రయించారు. జార్ఖండ్‌కు చెందిన రాహుల్ సింగ్ విశాఖలోని సత్యం కూడలి సమీపంలో ఈక్విటీ నాక్స్ పేరుతో స్టాక్ మార్కెట్ బిజినెస్ కార్యాలయాన్ని ప్రారంభించాడు. తాను షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి అత్యధిక లాభాలను ఆర్జిస్తున్నట్లు నగరానికి చెందిన పలువురి వద్ద నమ్మబలికాడు. విశాఖలోని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ గ్రూప్‌లో చేరి నగరంలో వేర్వేరు వ్యాపారరంగాల్లో ఉన్నవారితో పరిచయం చేసుకున్నాడు. తన కార్యాలయానికి ఆహ్వానించి లాభాలు వస్తాయని నమ్మించాడు. ఇలా 19 మందిని నమ్మించి షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట రూ.4 కోట్ల వరకు తీసుకున్నాడు. వారికి నూటికి రూ.3 వడ్డీ రేటుతో లాభాలను కొంతకాలం ఇచ్చాడు. కొన్ని నెలలుగా పెట్టుబడులు పెట్టిన వారికి నెలనెలా ఇవ్వాల్సిన లాభాలను ఇవ్వకపోవడంతో వారు ప్రశ్నించారు. తాను ముంబైలో ఉన్న చాయిస్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నానని, పెట్టుబడులు వారికి మళ్లించానని, అందువల్ల లాభాల కోసం కొంతకాలం వేచి చూడాలని చెప్పాడు. ఇలా కొంతకాలం వ్యవహారం నడిపిన రాహుల్ సింగ్ షేర్ మార్కెట్ పనిమీద కోల్‌కతా వెళుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాలేదు. గత నెల 16వ తేదీన అతడి భార్య ఈక్విటీ నాక్స్ కార్యాలయానికి తాళాలు వేసి జార్ఖండ్ వెళ్లిపోయింది. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించిన 19 మంది సోమవారం స్పందనలో నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీ సూచనతో క్రైమ్ డీసీపీ నాగన్న, ఎంవీపీ సీఐ మల్లేశ్వరరావుకు ఫిర్యాదులు అందజేశారు. ఫిర్యాదును పరిశీలిస్తున్నామని, కేసు నమోదుపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటున్నామని ఎంవీపీ పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ అవార్డులకు హైపవర్ కమిటీ

సాక్షి, అమరావతి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ జీవితకాల సాఫల్య పురస్కారం, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలకు అర్హులను ఎంపిక చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం హైపవర్ స్క్రీనింగ్ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. 2023 సంవత్సరానికి సంబంధించి.. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచిన వారిని ఈ పురస్కారాలకు ఎంపిక చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాల) సజ్జల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో తొమ్మిది మందితో ఈ కమిటీ ఏర్పాటైంది. కమిటీలో ప్రభుత్వ సలహాదారు (జాతీయ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాలు) దేవులపల్లి అమర్.. ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్) జీవీడీ కృష్ణమోహన్.. వ్యవసాయ శాఖ ప్రత్యేక సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది.. మహిళా శిశు, వికలాంగులు, సీనియర్ సిటిజన్స్ శాఖ ముఖ్యకార్యదర్శి జయలక్ష్మి.. పౌర సరఫరాల కమిషనర్ అరుణ్‌కుమార్.. సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి రేవు ముత్యాలరాజు .. సమాచార శాఖ కమిషనర్ టి. విజయకుమార్‌రెడ్డి.. సాధారణ పరిపాలన (ప్రొటోకాల్) శాఖ డిప్యూటీ సెక్రటరీ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఉన్నారు. అవార్డుల కోసం వచ్చిన నామినేషన్లను కమిటీ పరిశీలించి అర్హులతో కూడిన జాబితాను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ అవార్డులను రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న ఏటా బహూకరిస్తున్నారు.

తండాకు బాణామతి భయం!

తెలంగాణ

- గిరిజనులను వణికిస్తున్న 'నిమ్మకాయలు'

బషీరాబాద్: నేటి కంప్యూటర్ యుగంలోనూ మారుమూల గ్రామాల్లో మూఢ నమ్మకాలు రాజ్యమేలుతున్నాయి. నిమ్మకాయలతో బాణామతి చేశారనే అనుమానంతో ఓ తండా భయంతో వణికిపోతోంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నంద్యానాయక్ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. గత నెల 4వ తేదీ పౌర్ణమి రోజు నంద్యానాయక్ తండాలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు ఇళ్ల ముందు నిమ్మకాయలు కోసి పడేశారు. పున్నమి రోజు తమ ఇళ్లముందు నిమ్మకాయలు పడటాన్ని సీరియస్‌గా తీసుకున్న సదరు వ్యక్తులు ఓ మాజీ ప్రజాప్రతినిధి ద్వారా కర్ణాటకలోని మాంత్రికులను సంప్రదించారు. వారు తండాకు బాణామతి చేశారని, తాము తండాకు వచ్చి అమావాస్య రోజు పూజలు చేసి బాణామతి ఎవరు చేశారో తేలుస్తామని చెప్పారు. ఇదే విషయాన్ని సదరు నాయకుడు తండా వాసులకు చెప్పాడు. గురువులు వచ్చే నాటికి ప్రతి ఒక్కరూ తండాకు రావాలని చాటింపు వేయించాడు. అంతేకాకుండా ముంబై, పుణే, హైదరాబాద్‌లో ఉన్న తండా వాసులందరికీ ఫోన్లు చేసి రావాలని హుకుం జారీ చేశాడు. (జూన్ 18న) అమావాస్య రోజున గురువులు వస్తున్నారు.. అందరూ హాజరు కావాలని ఆదేశించాడు, దీంతో ఇతర ప్రాంతాల్లోని వారు తండాకు చేరుకున్నారు. అమావాస్య రోజు తండాకు వచ్చిన ఇద్దరు మాంత్రికులు మంత్రించిన నిమ్మకాయలను అందరూ తినాలని సూచించారు. ఒక్క నిమ్మకాయను రెండు భాగాలుగా చేసి భార్యాభర్తలకు తినిపించారు. అందులో ఓ మహిళకు పూనకం రావడంతో మంత్ర శక్తితో పూనకం నిలిపివేశారు. అయితే ఆమే తండాకు బాణామతి చేశారని అనుమానించేలా చేశారు. ఇదే విషయమై ప్రతిరోజూ తండాలో చర్చలు జరుగుతున్నాయి. తండా వాసులు నిమ్మకాయలు చూస్తేనే వణికి పోతున్నారు. ఆ రోజు నుంచి తండా వాసులు బాబాల దగ్గర బారులు తీరుతున్నారు. ఇదే విషయమై బుధవారం తండాలో పంచాయితీ పెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రతి పౌర్ణమికి అరుణాచలం బస్సులు

సాక్షి, హైదరాబాద్: తమిళనాడులోని అరుణాచలేశ్వరుడి గిరిప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రతి పౌర్ణమికి ప్రత్యేక బస్సులు నడపాలని టీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు సంస్థ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేశారు. జూలై 3వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదర్శనకు తొలిసారిగా సూపర్ లగ్జరీ బస్సులు నడిపిన సంగతి తెలిసిందే. ఈ బస్సులకు భక్తుల నుంచి మంచి స్పందన రావడంతో ప్రతి పౌర్ణమికి రద్దీని బట్టి హైదరాబాద్‌తోపాటు అన్ని జిల్లా కేంద్రాల నుంచి ప్రత్యేక సర్వీసులు నడిపేవిధంగా చర్యలు చేపట్టింది. అరుణాచలేశ్వరుడి గిరిప్రదర్శన ప్రారంభమయ్యే 4 గంటల ముందుగానే భక్తులను అక్కడికి చేర్చనుంది. ప్రతి పౌర్ణమికి 10 రోజుల ముందుగా ఆన్‌లైన్‌లో బస్సు టికెట్లు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆంధ్రప్రదేశ్ కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనానంతరం అరుణాచలానికి భక్తులను తరలించనుంది.

క్లుప్తంగా...

చంద్రయాన్-3 సన్నాహాలు

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) చంద్రయాన్-3 ప్రయోగ సన్నాహాలను ముగించింది. లాంచ్ రిహార్సల్ 24 గంటలపాటు జరిగినట్లు బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం మంగళవారం ట్విట్టర్‌లో వెల్లడించింది. ముందస్తు సన్నద్ధతలో భాగంగా ఈ రిహార్సల్ జరిగినట్లు తెలియజేసింది. చంద్రయాన్-2కు కొనసాగింపుగానే చంద్రయాన్-3 మిషన్‌ను ఇస్రో చేపట్టింది. ఎల్‌వీఎం రాకెట్ ద్వారా ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్‌ను చంద్రుడిపైకి పంపించనున్నారు.

ఎవరెస్ట్ సమీపంలో కూలిన హెలికాప్టర్

ఐదుగురు మెక్సికన్లు సహా ఆరుగురి దుర్మరణం



మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం

కఠ్మాండు: నేపాల్‌లోని ప్రఖ్యాత ఎవరెస్ట్ శిఖరం సమీపంలో హెలికాప్టర్ కూలిన ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ఐదుగురు మెక్సికోకు చెందిన పర్యాటకులు, ఒక పైలట్ ఉన్నారు. మనంగ్ ఎయిర్ సంస్థకు చెందిన ఒక ప్రైవేట్ హెలికాప్టర్ మంగళవారం ఉదయం సొలుఖుంబు జిల్లాలోని సుర్కీ ఎయిర్‌పోర్ట్ నుంచి ఖాఠ్మాండూకు బయల్దేరింది. బయల్దేరిన తొమ్మిది నిమిషాలకే దానికి భూమిపై అధీకృత సంస్థతో సిగ్నల్ సంబంధాలు తెగిపోయాయి. చివరిసారిగా లాంజూరా పాస్ ఏరియాలో సిగ్నల్ ట్రాక్ అయింది. అప్పుడు హెలికాప్టర్ 12,000 అడుగుల ఎత్తులో ప్రయాణిస్తోందని త్రిభువన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ మేనేజర్ జ్ఞానేంద్ర చెప్పారు. అలా అది కొద్దిసేపటికే లిఖుపికె గ్రామ మున్సిపాలిటీలోని లాంజూరా ప్రాంతంలో కుప్పకూలింది. భారీ శబ్దంతో పేలిపోయి హెలికాప్టర్ ధ్వంసమైన విషయాన్ని స్థానికులు చెప్పడంతో గాలింపు బృందం ఘటనాస్థలికి చేరుకుని అక్కడే పడి ఉన్న ఆరుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకుంది. మరణించిన పర్యాటకులు అంతా ఒకే కుటుంబానికి చెందిన వారని వెల్లడైంది. మరణించిన పైలట్ గురుంగ్‌కు హిమాలయాల్లో 7,000 గంటలకుపైగా హెలికాప్టర్ నడిపే అపార అనుభవం ఉంది. ప్రతికూల వాతావరణం కారణంగానే హెలికాప్టర్ కూలి ఉంటుందని భావిస్తున్నారు.

బాహుబలి రాకెట్

చంద్రయాన్ 3

ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను మోసుకెళ్లనున్న ఎల్‌వీఎం-3 వాహక నౌక


రాకెట్ ద్వారా ఇప్పటివరకు మూడు ప్రయోగాలు విజయవంతం

గగన్‌యాన్ మిషన్‌లో సైతం సేవలందించనున్న ఎల్‌వీఎం-3

ఇస్రో అమ్ములపొదిలో కీలక అస్త్రం

దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న చంద్రయాన్-3 ప్రయోగానికి సమయం దగ్గరపడుతోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 14వ తేదీన మధ్యాహ్నం 2.35 గంటలకు జియో సింక్రనస్ లాంచ్ వెహికల్ ఎంకే-3(ఎల్‌వీఎం-3) రాకెట్ శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇందుకోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సైంటిస్టులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రయోగం ఎట్టిపరిస్థితుల్లోనూ గురి తప్పకూడదన్న లక్ష్యంతో శ్రమిస్తున్నామని చెబుతున్నారు. ఇప్పుడు అందరి దృష్టి ఎల్‌వీఎం-3 రాకెట్‌పైనే కేంద్రీకృతమై ఉంది. చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను చందమామ వద్దకు మోసుకెళ్లే ఈ రాకెట్‌కు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. అవేమిటో తెలుసుకుందాం..

–సాక్షి, నేషనల్ డెస్క్





మూడు కీలక దశలు

ఇస్రో అభివృద్ధి చేసిన లాంచ్ వెహికల్స్‌లో అత్యంత శక్తివంతమైనది ఎల్‌వీఎం-3. నిజానికి ఇదొక బాహుబలి రాకెట్. భారీ పరిమాణంలో పేలోడ్‌ను అంతరిక్షంలోకి సులభంగా మోసుకెళ్లగలదు. ఇందులో రెండు ఘన ఇంధన బూస్టర్లు, ఒక ద్రవ ఇంధన కోర్ స్టేజ్‌తో కూడిన మూడు దశలు ఉన్నాయి. రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడానికి ప్రాథమిక దశలో ఘన ఇంధన బూస్టర్లు దోహదపడతాయి. రాకెట్ చంద్రుడి కక్ష్యలోకి చేరడానికి ఇక ద్రవ ఇంధన కోర్ స్టేజ్ సాయపడుతుంది.

ఎలా పనిచేస్తుంది?

దశల వారీగా ఇంధనాన్ని మండించడం ద్వారా రాకెట్‌ను నింగిలోకి పంపిస్తారు. ఘన, ద్రవ ఇంధన ఇంజిన్లు, స్ట్రాప్-ఆన్ బూస్టర్లు నిర్దేశిత సమయాల్లో పనిచేస్తాయి. ఎల్‌వీఎం-3లో విద్యుత్ సరఫరా కోసం రెండు వికాస్ ఇంజిన్లు ఉన్నాయి. ప్రాథమిక దశలో రెండు సాలిడ్ ప్రొపలెంట్ బూస్టర్లు అదనపు శక్తిని అందజేస్తాయి. పేలోడ్ నిర్దేశిత కక్ష్యలోకి చేరుకోవడానికి అవసరమైన శక్తిని దేశీయంగా అభివృద్ధి చేసిన క్రయోజెనిక్ ఇంజిన్ సీఈ-20 సమకూరుస్తుంది. మొదట రెండు బూస్టర్లను ఒకేసారి మండిస్తారు. దాంతో రాకెట్ టేకాఫ్ అవుతుంది. తర్వాత లిక్విడ్ కోర్ స్టేజ్‌ను 113 సెకండ్లపాటు, రెండు ఎస్200 బూస్టర్లను 134 సెకండ్లపాటు మండిస్తారు. టేకాఫ్ తర్వాత 217 సెకండ్లకు భూమికి 115 కిలోమీటర్ల ఎత్తున శాటిలైట్‌తో కూడిన పేలోడ్ రాకెట్ నుంచి విడిపోతుంది.

- ఎల్‌వీఎం-3 రాకెట్ బరువు 640 టన్నులు, పొడవు 43.5 మీటర్లు. 4,000 కిలోల పేలోడ్‌ను జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (జీటీఓ)లోకి మోసుకెళ్లగలదు.
- రాకెట్‌కు అవసరమైన శక్తిని సమకూర్చడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఇందులో రెండు సాలిడ్ స్ట్రాప్-ఆన్ మోటార్లు(ఎస్200), ఒక లిక్విడ్ కోర్ స్టేజ్(ఎల్110), 28 టన్నుల బరువైన ప్రొపలెంట్ లోడింగ్‌తో కూడిన ఒక హై-థ్రస్ట్ క్రయోజనిక్ అప్పర్ స్టేజ్(సీ25) ఉన్నాయి.
- ఈ రాకెట్‌ను మొదట 'జీఎస్ఎల్‌వీ-ఎంకే3'గా వ్యవహరించేవారు. ఇస్రో దీనికి ఎల్‌వీఎం-3గా నామకరణం చేసింది. దీనిద్వారా ఇప్పటివరకూ 3 ప్రయోగాలు విజయవంతమయ్యాయి. చంద్రయాన్-3 నాలుగో ప్రయోగం కానుంది.
- ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడానికి ఎల్‌వీఎం-3 వాహక నౌకను గతంలో ఉపయోగించారు. జీశాట్-19 కమ్యూనికేషన్ శాటిలైట్, ఆస్ట్రోశాట్ అస్ట్రానమీ శాటిలైట్, చంద్రయాన్-2 లూనార్ మిషన్‌ను ఇదే రాకెట్ ద్వారా ప్రయోగించారు. భారతదేశంలో తొలి మానవ సహిత స్పేస్ క్రాఫ్ట్ ప్రయోగమైన గగన్‌యాన్ మిషన్‌లో ఎల్‌వీఎం-3 వాహక నౌక తన సేవలను అందించనుంది.
- భారీ కమ్యూనికేషన్ శాటిలైట్ల ప్రయోగాల్లో ఎల్‌వీఎం-3 ద్వారా మనం స్వయం సమృద్ధి సాధించినట్లేనని ఇస్రో హర్షం వ్యక్తం చేసింది.



ఢిల్లీలో లోతట్టు ప్రాంతం నుంచి రిక్షాలో తరలిపోతున్న ఓ కుటుంబం

మహోగ్ర యమున

- ఢిల్లీలో వరద నీటితో ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న నది
- సురక్షిత ప్రాంతాలకు వేలాది మంది ముంపు ప్రాంతాల ప్రజల తరలింపు

న్యూఢిల్లీ: ఎగువ హరియాణా ప్రాంతాల నుంచి ప్రవహిస్తున్న వరదనీటితో ఢిల్లీలో యమునా నది మహోగ్రంగా మారింది. దీంతో నది ప్రవాహంలో నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. దీంతో ముంపు ప్రాంతాల్లోని వేలాది మంది ప్రజలను ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం హుటాహుటిన సురక్షిత ప్రాంతాలకు తరలిస్తోంది. సోమవారం రాత్రి నుంచే ఈ తరలింపు ప్రక్రియ మొదలుపెట్టారు. సంబంధిత వివరాలను ఢిల్లీ రాష్ట్ర జలశాఖ మంత్రి సౌరభ్ భరద్వాజ్ పత్రికా సమావేశంలో వెల్లడించారు. 'ముంపు ప్రాంతాల స్థానికుల కోసం వేలాది టెంట్‌లను ఈస్ట్, నార్త్, నార్త్‌ఈస్ట్, సౌత్‌ఈస్ట్, సెంట్రల్, షాదారా జిల్లాల్లో ఏర్పాటుచేశాం. హరియాణాలోని హత్నీ కుండ్ బ్యారేజ్ నుంచి వరదనీటిని దిగువకు వదలడం వల్లే ఢిల్లీలో ఈ అప్రమత్త పరిస్థితి దాపురించింది. అయితే ఢిల్లీకి వరదలు మాత్రం రాబోవు. నదీ పరివాహక ప్రాంతాల్లోని జనావాసాల్లోకి వరదనీరు చేరదు. శిబిరాల్లో ఇప్పటికే ఆహారం, తాగునీరు, ఇతర వసతులు సిద్ధంచేశాం' అని ఆయన చెప్పారు.

పేదరికంపై భారత్ విజయం!

- 15 ఏళ్లలో 41.4 కోట్ల మందికి విముక్తి
- ఐక్యరాజ్యసమితి నివేదిక



ఐక్యరాజ్యసమితి: ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశాల్లో ఒకటైన భారత్ పేదరికంపై విజయం సాధించడంలో ముందంజలో ఉందని ఐక్యరాజ్యసమితి ప్రశంసించింది. భారత్‌లో 2005/2006 నుంచి 2019/2021 దాకా.. 15 సంవత్సరాల్లో ఏకంగా 41.4 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని వెల్లడించింది. ఈ మేరకు యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(యూఎన్‌డీపీ) యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్‌తో కలిసి గ్లోబల్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్(ఎంపీఐ) నివేదికను తాజాగా విడుదల చేసింది. గత 15 ఏళ్లలో పేదరికాన్ని అంతం చేయడంలో భారత్ సహా 25 దేశాలు మెరుగైన ఫలితాలు సాధించాయని పేర్కొంది. ఈ జాబితాలో కాంబోడియా, చైనా, కాంగో, హోండూరస్, ఇండోనేసియా, మొరాకో, సెర్బియా, వియత్నాం తదితర దేశాలు ఉన్నాయని తెలియజేసింది. ఇండియాలో 2005/2006లో 55.1 శాతం మంది పేదలు ఉండగా, 2019/2021 నాటికి వారి సంఖ్య 16.4 శాతానికి తగ్గిపోయిందని ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొంది. దేశంలో 15 సంవత్సరాల క్రితం 64.5 కోట్ల మంది పేదలు ఉండగా, 2019/2021లో 23 కోట్ల మంది ఉన్నట్లు తేలిందని వివరించింది. ఇదే సమయంలో సరైన పౌష్టికాహారం అందుబాటులోని ప్రజల సంఖ్య 44.3 శాతం నుంచి 11.8 శాతానికి తగ్గిపోయిందని వెల్లడించింది. శిశు మరణాలు 4.5 శాతం నుంచి 1.5 శాతానికి తగ్గిపోయాయని పేర్కొంది. పారిశుధ్య సదుపాయాలు అందుబాటులో లేని వారి సంఖ్య 50.4 శాతం నుంచి 11.3 శాతానికి తగ్గిందని తెలియజేసింది. ఎక్కువ మందికి తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించడంలో భారత్ గణనీయమైన ప్రగతి సాధించిందని కొనియాడింది.

ఈడీ చీఫ్ పొడిగింపు చట్టవిరుద్ధమే

ఈ నెల 31లోగా ఎస్‌కే మిశ్రా పదవి నుంచి తప్పుకోవాలి: సుప్రీంకోర్టు





న్యూఢిల్లీ: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చీఫ్ సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం చట్ట విరుద్ధమేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ నెల 31వ తేదీ తర్వాత ఆయన పదవిలో కొనసాగరాదని తేల్చిచెప్పింది. ఈలోగా ఈడీకి కొత్త చీఫ్‌ను నియమించుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సంజయ్‌కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడాన్ని సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు రణదీప్ సూర్జే వాలా, జయా ఠాకూర్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహువా మొయిత్రా, సాకేత్ గోఖలేతోపాటు పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గావై, జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మిశ్రా పదవీ కాలాన్ని ఇక పొడిగించవద్దని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వును ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆక్షేపించింది. తక్షణమే ఈడీ అధిపతిగా మరొకరిని నియమించడం కష్టసాధ్యమని ప్రభుత్వ విజ్ఞప్తిని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈ నెల 31 దాకా గడువు ఇచ్చింది. మిశ్రా తొలిసారిగా 2018 నవంబర్ 19న ఈడీ అధిపతిగా నియమితుల య్యారు. 2020లో ఒకసారి, 2022లో మరోసారి ఆయన పదవీ కాలాన్ని కేంద్రం పొడిగించింది. వాస్తవానికి ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం మిశ్రా 2023 నవంబర్ 18 దాకా ఈడీ చీఫ్‌గా పదవిలో కొనసాగవచ్చు. కానీ, కోర్టు ఆదేశాలతో పదవి నుంచి వైదొలగడం తప్పనిసరిగా మారింది.

బెంగాల్ స్థానిక ఎన్నికల్లో టీఎంసీ ఆధిక్యం

30,391 పంచాయతీ సీట్లు గెలుచుకున్న అధికార టీఎంసీ



స్థానిక ఎన్నికల్లో టీఎంసీ గెలుపు వార్త తెలిసి పార్టీ మహిళా కార్యకర్తల సంబరాలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ స్థానిక ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ) ఘన విజయం దిశగా దూసుకెళ్తోంది. మంగళవారం రాత్రి 11:30కి ప్రకటించిన ఫలితాల్లో 30,391 సీట్లను కైవసం చేసుకుంది. ఓట్ల లెక్కింపులో మరో 1,767 పంచాయతీ స్థానాల్లో ముందంజలో కొనసాగు తోంది. టీఎంసీ ప్రధాన ప్రత్యర్థి అయిన బీజేపీ 8,239 పంచాయతీ సీట్లను తన ఖాతాలో వేసుకుంది. మరో 447 సీట్లలో ముందంజలో ఉంది. లెఫ్ట్ ఫ్రంట్ 2,534 స్థానాల్లో విజయ బావుటా ఎగురవేసింది. కాంగ్రెస్ పార్టీ 2,158 సీట్లను సొంతం చేసుకుంది. సీపీఎంకు 2,409 సీట్లు లభించాయి. ఇతర పార్టీలు 725 సీట్లు దక్కించుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు 1,656 స్థానాలు సాధించడం విశేషం. రాష్ట్రంలో మొత్తం 63,229 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇక 9,728 పంచాయతీ సమితి స్థానాలకు ఎన్నికలు జరగ్గా, టీఎంసీ 2,155 స్థానాలను గెలుచుకుంది. 493 సీట్లలో లీడింగ్‌లో ఉంది. బీజేపీ 214 స్థానాలను గెలిచింది. 113 చోట్ల లీడింగ్‌లో ఉంది. 928 జిల్లా పరిషత్ సీట్లకు టీఎంసీ ఇప్పటివరకు 77 స్థానాల్లో విజయం సొంతం చేసుకుంది. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. బెంగాల్‌లో శనివారం జరిగిన పంచాయతీ ఎన్నికల్లో భారీగా హింస చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ హింసాకాండలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 11 మంది అధికార టీఎంసీకి చెందినవారే ఉన్నారు.

ఆగస్టు 2 నుంచి పూర్తిస్థాయి విచారణ

'ఆర్టికల్ 370 రద్దు' పిటిషన్లపై సుప్రీంకోర్టు వెల్లడి

న్యూఢిల్లీ: రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఆగస్టు 2వ తేదీ నుంచి రోజువారీగా పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తున్న ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఈ రద్దును వ్యతిరేకిస్తూ వివిధ సంఘాలతోపాటు వ్యక్తులు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఆర్టికల్ 370 రద్దును కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్లను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం పరిశీలించింది. ఈ కేసులో ఏవైనా ఫైళ్లు గానీ, లిఖితపూర్వక వినతులు గానీ ఈ నెల 27లోగా సమర్పించవచ్చని సూచించింది. ఇందుకోసం ఇద్దరు లాయర్లను నియమించనున్నట్లు వెల్లడించింది. ఆగస్టు 2 నుంచి సోమవారం, శుక్రవారం మినహా రోజువారీగా పూర్తిస్థాయిలో విచారణ ప్రారంభిస్తామని పేర్కొంది. ఈ నెల 27 తర్వాత ఎలాంటి డాక్యుమెంట్లు స్వీకరించబోమని స్పష్టం చేసింది. ఆర్టికల్ 370 రద్దయ్యాక కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొందంటూ కేంద్ర ప్రభుత్వం సోమవారం సమర్పించిన అఫిడవిట్ ఈ కేసు విచారణపై ఎలాంటి ప్రభావం చూపబోదని ధర్మాసనం తేల్చిచెప్పింది. మరోవైపు ఆర్టికల్ 370 రద్దును సవాలు చేస్తూ కోర్టును ఆశ్రయించిన పిటిషన్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని ఐఏఎస్ అధికారి షా ఫైజల్, షెహలా రషీద్ విజ్ఞప్తి చేయగా, సుప్రీంకోర్టు ధర్మాసనం అందుకు అంగీకరించింది. ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత కేంద్ర ప్రభుత్వం జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించిన సంగతి తెలిసిందే.

మరో చీతా మృత్యువాత

భోపాల్: ఆఫ్రికా ఖండం నుంచి భారత్‌లో అడుగుపెట్టిన చీతాలు ఒక్కొక్కటిగా మృత్యుదేవత దిశగా అడుగులేస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయవనంలో ఉన్న మగ చీతా తేజస్ మంగళవారం కన్నుమూసిందని అధికారులు వెల్లడించారు. దీంతో గత నాలుగు నెలల్లో మరణించిన చీతాల సంఖ్య ఏడుకు పెరిగింది. నాలుగేళ్ల వయసు ఉన్న తేజస్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చారు. మరణించిన ఏడు చీతాల్లో నమీబియా చీతా జ్వాలకు జన్మించిన మూడు చీతా కూనలూ ఉన్నాయి. దీంతో గత ఏడాది సెప్టెంబర్‌లో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన చీతాల పునర్‌ఆగమన కార్యక్రమం నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. 'వాటిల్లో అవి ఆధిపత్యం కోసం చేసుకున్న ఘర్షణల్లో గాయపడటం వల్లే తేజస్ మరణించి ఉంటుంది. మరణించేనాటికి ఇది ఇంకా ఎన్‌క్లోజర్‌లోనే ఉంది' అని వైల్డ్‌లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ జేఎస్ చౌహాన్ అంచనావేశారు. రెండు మగ చీతాలను అడవిలోకి వదిలేసిన మరుసటి రోజే ఇలా ఒకటి మరణించడంపై వన్యప్రాణి ప్రేమికులు ఆవేదన వ్యక్తంచేశారు.

రాంగ్‌సైడ్‌లో వచ్చి ఢీకొట్టిన స్కూల్ బస్

కారులోని ఆరుగురి దుర్మరణం

ఘజియాబాద్(యూపీ): రాంగ్‌రూట్‌లో దూసుకొచ్చిన ఒక స్కూల్ బస్సు.. ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులోని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ సరిహద్దు వద్ద ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘజియాబాద్ అదనపు డీసీపీ రమానంద్ ప్రమాద వివరాలను ట్వీట్‌చేశారు. 'మీరట్ నుంచి ఎనిమిది మందితో బయల్దేరిన కారు గురుగ్రామ్ వైపుగా మంగళవారం ఉదయం ఆరింటపుడు ఢిల్లీ–మీరట్ ఎక్స్‌ప్రెస్‌వేపై వెళుతోంది. అదే సమయానికి రాంగ్‌సైడ్ సీఎన్‌జీ ఇంధనాన్ని నింపుకున్న పాఠశాల బస్సు ఒకటి అదే రూట్‌లో రాంగ్‌సైడ్ అలాగే వస్తోంది. దీంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో కారులోని ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. నుజ్జునుజ్జయిన కారులో ఇరుక్కున్న ఇద్దరినీ కష్టపడి బయటకు తీసి ఆస్పత్రిలో చేర్పించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. నోయిడాలోని ఒక స్కూల్‌కు చెందిన ఈ బస్సులో ప్రమాదం జరిగినపుడు విద్యార్థులు ఎవరూ లేరు. ఢిల్లీ నుంచి ఈ బస్సు తిరిగొస్తోంది. బస్సు డ్రైవర్‌ను అరెస్ట్‌చేశాం' అని ఆయన వెల్లడించారు.

పుట్టినరోజున అందుకున్న ప్రత్యేక కానుక ఏంటంటే..

థానే: పుట్టినరోజు అంటే సంబరం. అందులోనూ జన్మదిన వేడుకలో అందుకునే చిన్న చిన్న కానుకలు అంటే అపురూపంగా చూసుకుని మురిసిపోతారు. అలాంటిది ఒక మహిళ అనూహ్యంగా టమాటాలను గిఫ్ట్‌గా అందుకుని ఆశ్చర్యంలో మునిగింది. మహారాష్ట్రలోని థానే పట్టణంలో ఈ కొత్త రకం బహుమతి ఘటన జరిగింది. సంబంధిత వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. థానె జిల్లాలోని కళ్యాణ్ ప్రాంతంలోని కొచాడీలో ఉండే సోనల్ బోర్సే పుట్టినరోజు వేడుక ఆదివారం జరిగింది. ఆ ప్రాంతంలో కేజీ టమాటా ఏకంగా రూ.140 ధర పలుకుతోంది. అదే రోజు ఆమె నాలుగు కేజీలకుపైగా టమాటాలు ఉన్న బుట్టలను బహుమతిగా అందుకున్నారు. ఈసారి అకాల వర్షాలు, బిపర్‌జోయ్ తుపాను మిగిల్చిన విషాదం కారణంగా పంట నాశనమై దిగుబడి భారీగా తగ్గిపోయి టమాటా ధర రిటైల్ మార్కెట్లో చుక్కలనంటుతోంది. కొద్దిరోజులు గడిస్తే కొత్త పంట వచ్చి ధరలు తగ్గుముఖం పడతాయని మార్కెట్ వర్గాలు భరోసా ఇస్తున్నాయి.

కంపెనీ సీఈఓ, ఎండీ దారుణ హత్య

బనశంకరి: సిలికాన్ సిటీ బెంగళూరులో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఉద్యోగం తీసేశారని ఒక మాజీ ఉద్యోగి ఉన్మాదిగా మారి కంపెనీ సీఈఓ, ఎండీలను కత్తితో పొడిచి చంపాడు. అమృతహళ్లి పంపా లేఔట్‌లో ఈ ఘోరకృత్యం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. ఏరోనిక్స్ మీడియా ప్రైవేటు లిమిటెడ్ ఎండీ ఫణీంద్ర సుబ్రమణ్య, సీఈఓ వినుకుమార్‌లపై మంగళవారం సాయంత్రం ఆఫీసులోకి చొరబడిన జోకర్ ఫెలిక్స్ అనే మాజీ ఉద్యోగి కత్తితో దాడి చేశారు. విచ్చలవిడిగా పొడవడంతో ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. కొద్దిరోజుల క్రితం ఈ కంపెనీలో పనిచేసే నిందితుడు ఫెలిక్స్ ఇక్కడ ఉద్యోగం మానేసి సొంతంగా కంపెనీ ప్రారంభించాడు. తన వ్యాపారానికి ఫణీంద్ర, వినుకుమార్‌లు అడ్డు తగులుతున్నారని అనుమానించి ఆఫీస్‌కొచ్చి హత్యచేశాడు.

స్వీడన్‌కు సై.. ఉక్రెయిన్‌కు నై

నాటోలో సభ్యత్వంపై కూటమి శిఖరాగ్ర సదస్సులో నిర్ణయం

విల్నియస్: స్వీడన్‌ను తమ కూటమిలో 32వ సభ్యదేశంగా చేర్చుకునేందుకు నాటో అంగీకరించింది. లిథువేనియా దేశంలోని విల్నియస్ నగరంలో జరుగుతున్న నాటో శిఖరాగ్ర సదస్సు ఇందుకు వేదికగా నిలిచింది. అయితే ఉక్రెయిన్‌కు సభ్యత్వంపై 31 సభ్యదేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇప్పట్లో ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం దక్కకపోవచ్చు. యుద్ధంలో నిమగ్నమైన దేశానికి సభ్యత్వం ఇవ్వకూడదన్న నిబంధన కారణంగా ఇప్పుడే కూటమిలో చేర్చుకోలేమని, యుద్ధం ముగిశాక వెంటనే సభ్యత్వం ఇచ్చేలా పాత రెండంచెల పద్ధతిని సరళతరం చేశామని నాటో ప్రధాన కార్యదర్శి జీన్స్ స్టోల్టెన్‌బెర్గ్ మీడియాతో చెప్పారు. కాగా, తమ పట్ల నాటో వైఖరిని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా తప్పుబట్టారు.

న్యాయ సంస్కరణల బిల్లుకు

ఇజ్రాయెల్ పార్లమెంట్ ఆమోదం

జెరూసలేం: సుప్రీంకోర్టు అధికారాలను నియంత్రిస్తూ ఇజ్రాయెల్ ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంస్కరణల బిల్లుకు పార్లమెంట్ ప్రాథమికంగా ఆమోదం తెలియజేసింది. ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో 124 మంది సభ్యులుండగా, బిల్లుకు మద్దతుగా 64 మంది ఓటేశారు. బిల్లుపై ఇక నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో చర్చ జరగనుంది. వివిధ వర్గాలతో సంప్రదింపులు జరుపుతారు. మార్పులు చేర్పుల అనంతరం పార్లమెంట్‌లో తుది ఓటింగ్ జరుగుతుంది. న్యాయ సంస్కరణల బిల్లును ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ప్రక్రియగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ అభివర్ణించారు. న్యాయ వ్యవస్థను సంస్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని గుర్తుచేశారు. బిల్లు చట్టం రూపం దాలిస్తే.. ప్రభుత్వం, మంత్రులు, ప్రజాప్రతినిధులు తీసుకొనే నిర్ణయాలను రద్దు చేసే అధికారం ఇక సుప్రీంకోర్టుకు ఉండదు. ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలను వ్యతిరేకించే హక్కు జడ్జీలకు లేదని నెతన్యాహూ అనుచరులు వాదిస్తున్నారు. మరోవైపు న్యాయ సంస్కరణల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు మిన్నంటుతున్నాయి. ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం జెరూసలేం, హైఫా, టెల్ అవివ్ తదితర నగరాల్లో వేలాది మంది రోడ్లను దిగ్బంధించారు. దేశంలో బలంగా ఉన్న న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేయొద్దని నిరసనకారులు డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్ న్యాయ వ్యవస్థ సంస్కరణల బిల్లును అమెరికాతోసహా పలు దేశాలు తీవ్రంగా తప్పుపడుతున్నాయి.

విరాళాల సేకరణలో బీజేపీ టాప్

- ఆరేళ్లలో రూ.10 వేల కోట్ల విరాళాలు సేకరించిన బీజేపీ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ విరాళాల సేకరణలో అన్ని రాజకీయ పార్టీల కంటే చాలా ముందంజలో ఉంది. భారత రాజకీయాల్లో సంస్కరణల కోసం పోరాడుతున్న అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే సంస్థ చేసిన అధ్యయనంలో ఇలాంటి పలు అంశాలు వెల్లడయ్యాయి. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 2016–17 నుంచి 2021–22 మధ్య కాలంలో ఎలక్టోరల్ బాండ్లు, ప్రత్యక్ష కార్పొరేట్ విరాళాలు సహా ఇతర విరాళాల ద్వారా మొత్తంగా ఆరేళ్లలో రూ.10,122 కోట్లు బీజేపీకి వచ్చాయి. బీజేపీ ప్రకటించిన మొత్తం విరాళాలు ఇతర జాతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం విరాళాల కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటం గమనార్హం. బీజేపీ తర్వాత స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ విరాళాల రూపంలో రూ.1547.439 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ రూ.823.301 కోట్లు, సీపీఐ(ఎం) రూ.367.167 కోట్లు, ఎన్సీపీ రూ.231.614 కోట్లు సేకరించాయి.

ప్రాంతీయ పార్టీల్లో బీజేడీ

ప్రాంతీయ పార్టీల జాబితాలో బిజు జనతాదళ్ (బీజేడీ) అత్యధికంగా రూ.692.60 కోట్లు విరాళాలు సేకరించింది. ఇక తెలంగాణరాష్ట్రంలోని అధికార బీఆర్ఎస్ రూ.476.89 కోట్లతో రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత డీఎంకే పార్టీ రూ.475.73 కోట్లు, వైఎస్ఆర్‌సీపీ రూ.456.20 కోట్లు, శివసేన రూ.267.90 కోట్లు, ఆప్ రూ.169.70 కోట్లు, టీడీపీ రూ.168.67 కోట్ల విరాళాలు సేకరించాయి.

సహకార సంఘాల బలోపేతంపై

14న సమావేశం

వ్యవసాయ, రైతు సంక్షేమంపై మార్గనిర్దేశం చేయనున్న అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పీఓ)ల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) బలోపేతం చేసే మార్గాలపై మోదీ సర్కార్ దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా 14వ తేదీన ఢిల్లీలో సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశాన్ని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గతంలో నిర్దేశించిన 'సహకార్ సే సమృద్ధి' దార్శనికతను ప్రతిబింబించేలా షా ప్రసంగించనున్నారు. ఎఫ్‌పీఓల మద్దతుతో పీఏసీఎస్‌లను ఎలా బలపరచాలి, సహకార రంగాన్ని పటిష్టపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలను ఈ సందర్భంగా అమిత్ షా వివరిస్తారు.

పీఎంకే నేత ఇంటిపై పెట్రో దాడి

తిరువొత్తియూరు: చెన్నై చాకలిపేటకి చెందిన వన్నై సత్య అలియాస్ సత్యనారాయణ ఉత్తర చెన్నై జిల్లా పీఎంకే కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇతని కుమారుడు నిషాల్ (19) సోమవారం రాత్రి కాశీ మేడు వద్ద ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టుకోవడానికి తన బైక్‌ను తీసుకుని వెళ్లాడు. అతన్ని అడ్డుకున్న వ్యక్తులు కత్తితో దాడికి ప్రయత్నించారు. అక్కడి నుంచి తప్పించుకున్న నిషాల్ బైకును వదిలి పారిపోయాడు. తర్వాత విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీనిపై కాశిమేడు పోలీస్ స్టేషన్‌లో సత్యనారాయణ ఫిర్యాదు చేశాడు. అయితే గంట తర్వాత అదే ముఠా సోలయమ్మన్ వీధిలో ఉన్న సత్యనారాయణ ఇంటికి వచ్చి పెట్రోల్ బాంబు దాడి చేసి పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలిస్తున్నారు.

న్యూస్‌రీల్

బీజేపీ ఎమ్మెల్యేలను అరెస్టు చేయాలని నిరసన

తిరువొత్తియూరు: ఆలయ భూముల కుంభకోణానికి పాల్పడిన బీజేపీ ఎంఎల్‌ఏలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ పుదుచ్చేరికి చెందిన కమ్యూనిస్ట్ నాయకులు మంగళవారం కొత్త కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మార్క్సిస్టు పార్టీ రాజకీయ నాయకత్వ కమిటీ సభ్యుడు జి.రామకృష్ణన్ మాట్లాడుతూ.. పుదువై కామాక్షి అమ్మన్ ఆలయ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే అరెస్టు చేయాల్సిన 13 మంది పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితులకు సహరించిన బీజేపీ ఎమ్మెల్యేలపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర గవర్నర్లు రాజకీయాల్లో జోక్యం చేసుకోకూడదని, వారికి ప్రచారం చేసే అధికారం లేదన్నారు. కామాక్షి అమ్మన్ ఆలయ భూమిని మోసపూరితంగా విక్రయించిన, కొనుగోలు చేసిన వారందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎంపీ రవీంద్రనాథ్‌కి వ్యతిరేకంగా తంగం పిటిషన్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే ఎంపీ రవీంద్రనాథ్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థి, ప్రస్తుత డీఎంకే నేత తంగ తమిళ్ సెల్వన్ కెవియేట్ పిటిషన్‌ను మంగళవారం దాఖలు చేశారు. తేని లోక్‌సభ నుంచి రవీంద్రనాథ్ గెలుపు చెల్లదని హైకోర్టు గత వారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. సామాన్యుడైన మిలానీ జరిపిన న్యాయ పోరాటంతో రవీంద్రనాథ్ ఎంపీ పదవి ఊడే పరిస్థితి నెలకొంది. అయితే తీర్పు అమలును 30 రోజులు వాయిదా వేశారు. దీంతో అప్పీలు ప్రయత్నాల్లో రవీంద్రనాథ్ ఉన్నారు. ఈ పరిస్థితులలో మిలానీ ఇన్నాళ్లు న్యాయ పోరాటం చేస్తే, ఇక తన ప్రత్యర్థిని తాను ఢీ కొడుతానని అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం అభ్యర్థి, ప్రస్తుత డీఎంకే నేత తంగ తమిళ్ సెల్వన్ ప్రకటించారు. తాను ఆ నియోజకవర్గంలో 2019 ఎన్నికలలో పోటీ చేసి లక్ష 44 వేలకు పైగా ఓట్లను సాధించినట్టు తంగ తమిళ్ సెల్వన్ పేర్కొన్నారు. రవీంద్రనాథ్ దాఖలు చేసే అప్పీలు పిటిషన్‌పై ఏదేని ఉత్తర్వులు ఇవ్వదలిచిన పక్షంలో తన వాదన కూడా వినాలని కోరుతూ సుప్రీం కోర్టుకు కెవియట్ పిటిషన్ ద్వారా విన్నవించారు.

మహిళా ఎస్పీని వేధించిన కేసులో అప్పీల్ పిటిషన్ దాఖలు

–19 తేదీ నుంచి విచారణ ప్రారంభం

కొరుక్కుపేట: మహిళా ఎస్పీని లైంగికంగా వేధించిన కేసులో దోషిగా తేలిన మాజీ స్పెషల్ డీజీపీ, ఎస్పీ అప్పీల్‌ను స్వీకరించిన విల్లుపురం జిల్లా ప్రైమరీ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి 19వ తేదీ నుంచి విచారణ చేపట్టాలని ఆదేశించారు. వివరాలు.. ఫిబ్రవరి 2021లో, విల్లుపురం సీబీసీఐడీ పోలీసులు అప్పటి మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామికి సెక్యూరిటీ డ్యూటీలో ఉన్న మహిళా ఎస్పీని లైంగికంగా వేధించిన మాజీ లా అండ్ ఆర్డర్ స్పెషల్ డీజీపీ రాజేష్ దాస్, ఆయన సహచరుడు, చెంగల్పట్టు మాజీ ఎస్పీ కన్నన్‌పై కేసు నమోదు చేశారు. విల్లుపురం ప్రధాన క్రిమినల్ కోర్టులో విచారణ జరిగింది. 68 మంది సాక్షులను విచారణ ఆహ్వానించిన న్యాయమూర్తి పుష్పరాణి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించి రాజేష్ దాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష రూ.20,500 జరిమానా విధించారు. మాజీ ఎస్పీ కన్నన్‌కి రూ. 500 జరిమానా కూడా విధించారు. జైలు శిక్ష పడిన రాజేష్ దాస్ వెంటనే కోర్టులో బెయిల్ పొందాడు. దీంతో కింది కోర్టు విధించిన పెనాల్టీపై వారిద్దరూ వేర్వేరుగా విల్లుపురం జిల్లా ప్రాథమిక సెషన్స్ కోర్టులో అప్పీలు చేసుకున్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పూర్ణిమ ముందుకు విచారణకు వచ్చింది. ఇందులో రాజేష్ దాస్, కన్నన్ సంబంధించి విచారణ కోర్టులో వారి పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం ఈ నెల 19వ తేదీ నుంచి విచారణ చేపడతామని ప్రకటించి.. కేసును ఆ రోజుకు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

కాట్టుపల్లి పోర్టు కేంద్రంగా యుద్ధనౌకలకు మరమ్మతులు

కొరుక్కుపేట: యుద్ధనౌకల మరమ్మతులకు కాట్టుపల్లి పోర్టు కేంద్రంగా మారనుంది. చెన్నై పక్కనే ఉన్న కాట్టుపల్లి పోర్టులో ఎల్అండ్‌టీ షిప్‌యార్డ్ ఉంది. ఇక్కడ భారత తీర రక్షక దళానికి అవసరమైన గస్తీ నౌకలను నిర్మిస్తున్నారు. ఓడల మరమ్మతు కేంద్రం కూడా ఇది పనిచేస్తోంది. గత ఏడాది ఆగస్టులో యూఎస్ నేవీకి చెందిన చార్లెస్ డ్రూ అనే మిలిటరీ లాజిస్టిక్స్ షిప్‌కు మరమ్మతులు చేశారు. మెయింటెనెన్స్ కోసం తొలిసారిగా ఇది ఇండియా వచ్చింది. అయితే కాట్టుపల్లి ఓడరేవులో మరమ్మతులకు గురైంది. తర్వాత 10 రోజులకు సిద్ధమై అక్కడ నుంచి బయలుదేరింది. మార్చిలో అమెరికా నేవీకి చెందిన మాథ్యూ బెరర్ అనే యుద్ధనౌక మరమ్మతుల కోసం కాట్టుపల్లి ఓడరేవుకు వచ్చింది. మార్చి 29న సిద్ధమై బయలుదేరింది. ఈ సందర్భంలో యూఎస్ నేవీ, ఎల్ అండ్‌టీ మధ్య గత నెలలో సంతకం చేసిన 5 మాస్టర్ షిప్‌యార్డ్ ఒప్పందం ప్రకారం, యూఎస్ నేవీ యుద్ధనౌకలను కాట్టుపల్లి పోర్టులోని ఎల్అండ్‌టీ షిప్‌యార్డ్‌లో మరమ్మతులు చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో కాట్రుపల్లి కేంద్రం కొత్తరూపు సంతరించుకోనుంది.

నాయకుడొచ్చాడు..!



అనుమానాలు తొలగిపోయాయి.. ఉత్కంఠకు తెరపడింది. సుదీర్ఘ పోరాటం తర్వాత ఎట్టకేలకూ అన్నాడీఎంకే పూర్తిగా పళని స్వామి గుప్పెట్లోకి చేరింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆయనకి కేంద్ర ఎన్నికల కమిషన్ గుర్తింపు కల్పించింది. ఆయన నేతృత్వంలో 79 మంది రాష్ట్ర కమిటీ, 69 జిల్లాల కార్యదర్శులు, ఇతర రాష్ట్రాలలోని కార్యదర్శులకు ఆమోద ముద్ర వేస్తూ.. ఆ వివరాలను మంగళవారం కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ఇది అన్నాడీఎంకే శ్రేణుల్లో అమితానందాన్ని నింపింది.

- అన్నాడీఎంకేలో ఏక నాయకత్వం
- ప్రధాన కార్యదర్శిగా పళని ఎన్నికకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోదం
- కొత్త జంబో జట్టుకూ అంగీకారం
- 79 మందితో రాష్ట్ర కమిటీ
- 69 జిల్లాలకు కార్యదర్శుల నియామకం
- ఎన్డీఏ భేటీకీ దక్కిన ఆహ్వానం
- కార్యకర్తల హర్షాతిరేకాలు

సాక్షి, చెన్నై: అమ్మ జయలలిత మరణం తర్వాత అన్నాడీఎంకేలో చోటు చేసుకున్న అనూహ్య పరిణామాల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాలక్రమంలో ఆ పార్టీలోని ముఖ్య నేతలు నాలుగు శిబిరాలుగా విడిపోయి ముందుకెళ్తున్నారు. ఓ ఓ వైపు తానే ఆ పార్టీ ప్రధాన కార్యదర్శినంటూ జయలలిత నెచ్చెలి శశికళ, మరోవైపు పార్టీలో చీలిక కారణంగా ఏర్పడిన అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం గొడుగు నీడన దినకరన్, ఇంకో వైపు సమన్వయ కమిటీ కన్వీనర్ హోదాతో అంటూ పన్నీరు సెల్వం శిబిరం అన్నాడీఎంకేను కైవశం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తూ వస్తున్నాయి. అయితే, కేడర్ బలం, ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, ఎంపీల మద్దతుతో అన్నాడీఎంకే తనదే అని చాటే విధంగా పళని స్వామి నిత్యం వ్యూహాలకు పదును పెట్టి చివరికి సఫలీకృతులయ్యారు. అన్నాడీఎంకే వ్యవహారాలు అనేకం కోర్టుల్లో ఉన్నా, పార్టీకి కీలకం



పళనికి అన్నాడీఎంకే వర్గాల అభినందనలు

ఎవరు? అనే విషయాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్ తాజాగా మరోమారు తేల్చింది. సర్వ సభ్య సమావేశం, పార్టీ నిబంధనలకు అనుగుణంగా సంస్థాగత ఎన్నికలు, ఏకగ్రీవంగా పదవులకు ఆమోదం లభించడంతో పళనిస్వామి పై చేయి సాధించారు.

నూతనోత్సాహంతో..

సుప్రీంకోర్టు ఇటీవల వచ్చిన తీర్పు, అందుకు అనుగుణంగా కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఉత్తర్వులతో వ్యూహాలకు పదును పెట్టి అన్నాడీఎంకేలో ఏక నాయకత్వం దిశగా పళని స్వామి అడుగులు వేసి విజయం సాధించారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి పగ్గాలు చేపట్టి బలోపేతం దిశగా పరుగులు తీస్తున్నారు. ఆగస్టులో మదురై వేదికగా భారీ మహానాడు నిర్వహణకు సిద్ధమవున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రధాన కార్యదర్శిగా తన ఎంపికతో పాటుగా, రాష్ట్ర కమిటీ, జిల్లాల కమిటీ, ఇతర రాష్ట్రాల కమిటీల ఎంపిక వివరాలను కేంద్ర ఎన్నికల కమిషన్‌కు అన్నాడీఎంకే వర్గాలు పంపించాయి. ఇందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆమోద ముద్ర వేసింది. ఇక, అన్నాడీఎంకేను సొంతం చేసునే అవకాశం ఇతర గ్రూపులకు లేని విధంగా కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో పెట్టిన ఉత్తర్వులు మంగళవారం పళని స్వామికి అందాయి. ఇందులో అన్నాడీఎంకేలో ఇక ఏక నాయకత్వం అని చాటే విధంగా ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పళని స్వామికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అలాగే, 69 జిల్లాలకు కార్యదర్శులు, రాష్ట్ర కమిటీలో జంబో జట్టుగా 79 మంది నియామకానికి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి, ఢిల్లీ, తెలంగాణ, అండమాన్ తదితర ప్రాంతాలకు పార్టీ కార్యదర్శుల గుర్తింపునకు ఆమోదం లభించింది. దీంతో ఆపార్టీలో నూతనోత్సాహం కనిపిస్తోంది.



పళని స్వామితో రాష్ట్ర కమిటీ నేతలు

రాష్ట్ర కమిటీలో 79 మందికి చోటు

పార్టీ ప్రిసీడియం చైర్మన్‌గా తమిళ్ మగన్ హుస్సేన్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులుగా కేపీ మునుస్వామి, నత్తం ఆర్. విశ్వనాథన్, కోశాధికారిగా దిండుగల్ శ్రీనివాసన్, ఆల్ ఇండియా ఎంజీఆర్ మండ్రం కార్యదర్శిగా సి. పొన్నయ్యన్‌ను నియమించారు. పార్టీ సిద్ధాంతాల ప్రచార కార్యదర్శిగా సి. తంబి దురై, నిర్వాహక కార్యదర్శులుగా సెంగోట్టయన్, తంగమణి, జయకుమార్, సీవీ షణ్ముగం, సెమ్మలై, దళవాయి సుందరం, పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా ఎస్పీ వేలుమణి, పార్టీ ఎన్నికల విభాగం కార్యదర్శిగా పొల్లాచ్చి వి. జయరామన్, మహిళా విభాగం కార్యదర్శిగా వలర్మతికు పదవులు కల్పించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ తమకే అన్నాడీఎంకే అని స్పష్టం చేయడంతో పళని స్వామి మద్దతు దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇక, అన్నాడీఎంకే జెండాను గానీ,పార్టీ చిహ్నాన్ని గానీ మరెవరైనా ఉపయోగిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని జయకుమార్ హెచ్చరించారు. పళనిస్వామికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి గుర్తింపు వచ్చిందో లేదో వెంటనే ఎన్డీఏ కూటమి ఆహ్వానం కూడా దక్కింది. ఈనెల 18వ తేదీ ఢిల్లీలో జరగనున్న ఎన్డీఏ పార్టీల సమావేశానికి అన్నాడీఎంకే తరపున హాజరు కావాలంటూ పళనికి పిలుపు రావడం విశేషం. ఈ పరిణామాలతో అన్నాడీఎంకే వర్గాలు ఆనంద తాండవం చేస్తున్నాయి.

అంగీకరించే ప్రసక్తే లేదు..

కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను తాము అంగీకరించే ప్రసక్తే లేదని పన్నీరు సెల్వం స్పష్టం చేశారు. మంగళవారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. ఈ వ్యవహారం కోర్టులో ఉందని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. పళని సీఎంగా ఉన్నప్పుడు చోటు చేసుకున్న (దివంగత సీఎం జయలలితకు చెందిన ఎస్టేట్) కొడనాడు ఘటనను ఈసందర్భంగా పన్నీరు సెల్వం ప్రస్తావిస్తూ, ఈ కేసు విచారణను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేయాని కోరారు. ఈ విషయంపై ఆగస్టు 1వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని ప్రకటించారు. కాగా, ఎన్డీఏ కూటమి సమావేశానికి పళని స్వామికి, పీఎంకే తరపున అన్బుమణి రాందాసుకు, తమిళ మానిల కాంగ్రెస్ తరపున జీకే వాసన్‌కు ఆహ్వానాలు వచ్చినా తనకు మాత్రం ఎలాంటి ఆహ్వానం అందలేని పన్నీరు పేర్కొనడం గమనార్హం.



ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి సునీల్ నేతృత్వంలో అన్నాడీఎంకే వర్గాల సంబరాలు

టార్గెట్ సెంథిల్!

- వెంటాడుతున్న 'ఐటీ'
- కరూర్‌లో మళ్లీ సోదాలు
- కోర్టులో వాదనలు

సాక్షి, చెన్నై: మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధించిన వారిని ఆదాయ పన్ను శాఖ అధికారులు టార్గెట్ చేశారు. వివరాలు.. మంత్రి సెంథిల్ బాలాజీని టార్గెట్ చేసి మే 26వ తేదీన కరూర్, కోయంబత్తూరు, మదురై తదితర 40కు పైగా ప్రాంతాల్లో ఆదాయ పన్ను శాఖ సోదాల్లో నిమగ్నమైంది. కరూర్‌లో అయితే అధికారులకు డీఎంకే వర్గాలు ముచ్చెమటలు పట్టించాయి. ఈ సోదాలు 8 రోజుల పాటు జరిగాయి. ఆ తదుపరి పరిణామాలతో సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్టు చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయినా, ఐటీ అధికారులు మాత్రం సెంథిల్ బాలాజీ, ఆయనకు చెందిన వారిని వెంటాడుతున్నానే ఉన్నారు. జూన్ 13 నుంచి రెండు రోజులు, జూన్ 23వ తేదీ నుంచి మరో రెండు రోజులు కరూర్‌లో తనిఖీలు చేపట్టారు. కొన్ని చోట్ల కార్యాలయాలకు తాళం వేసి వెళ్లారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం కరూర్‌లో మళ్లీ ఐటీ అధికారులు 7 చోట్ల సోదాల్లో నిమగ్నమయ్యారు. ఇందులో సెంథిల్ బాలాజీ మిత్రుడు రామన్, సుబ్రమణ్యన్ నివాసాలు, కార్యాలయాలతోపాటు, శక్తి హోటల్, శ్రీరామ్ విలాస్ హోటల్, రమేష్ ఫైనాన్స్, వివిన్ ఫ్యాక్టరీ ఉన్నాయి. సీఆర్‌పీఎఫ్ భద్రత నీడలో తనిఖీలు సాగుతున్నాయి.



హోరాహోరీగా వాదనలు..

ఓవైపు ఐటీ దాడులు జరుగుతోంటే, మరో వైపు మంగళవారం హైకోర్టులో త్రిసభ్య బెంచ్ ముందు సెంథిల్ బాలాజీ సతీమణి మేఘల దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ప్రారంభమైంది. మేఘల తరపున వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. చట్ట విరుద్ధంగా అరెస్టులు జరిగినట్లు వాదించారు. ఆధారాలు సేకరించక ముందే అరెస్టు చేశారని వివరించారు. ఈ సందర్భంగా మూడో న్యాయమూర్తి కార్తికేయన్ పలుప్రశ్నలను సంధించినట్లు తెలిసింది. మధ్యాహ్నం సెంథిల్ బాలాజీ తరపున సీనియర్ న్యాయవాది ఎన్ఆర్ ఇళంగో వాదనలు వినిపించారు. అదే సమయంలో సుప్రీం కోర్టులో ఈడీ అధికారులు కేవియేట్ పిటిషన్ వేయడం చర్చకు దారి తీసింది. మేఘల దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌లో ఇది వరకు ఇచ్చిన ఉత్తర్వులలో మార్పుల కోసం సెంథిల్ తరపున ప్రయత్నాలు చేస్తున్నట్టు ఈడీకి సమాచారం అందింది. దీంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, శాఖ లేని మంత్రిగా ఉన్న సెంథిల్‌ను ఆ పదవి నుంచి తప్పించడమే లక్ష్యంగా గవర్నర్ ఆర్ఎన్ రవి ఢిల్లీలో గవర్నర్ పావులు కదుపుతున్నట్లు సమాచారం.

పుదుచ్చేరిలో భారీగా రుణాల పంపిణీ

కొరుక్కుపేట: పుదుచ్చేరిలో స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లబ్ధిదారులకు పెద్దఎత్తున రుణాలు అందజేశారు. కేంద్ర పాలిత ప్రాంతంలో పర్యాటకం, వ్యవసాయం, చేపలు పట్టడం, విద్య మొదలైన రంగాలపై దృష్టి సారించి వివిధ ఆర్థిక సేవలను సులభతరం చేయడమే లక్ష్యంగా ఎస్ఎల్‌బీసీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి కేంద్ర ఆర్థిక శాఖ, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించారు. ఇంకా పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి, స్పీకర్ ఆర్.సెల్వం, హోంమంత్రి ఎ.నమశ్శివాయం, పుదుచ్చేరి ఎస్ఎల్‌బీసీ చైర్మన్ రాజీవ్ వర్మ, ఇండియన్ బ్యాంక్ ఎండీ ఎస్ఎల్ జైన్, సీఎండీ శివసుబ్రమణియన్ రామన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఇండియన్ బ్యాంకు సీఎస్ఆర్ కార్యక్రమాల కింద పీఎం పోషన్ అభియాన్ పథకం (గతంలో మధ్యాహ్న భోజన పథకం) అమలుకు మద్దతుగా అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు ఫుడ్ డెలివరీ వాహనాన్ని, అలాగే పుదుచ్చేరిలోని డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ సర్వీసెస్‌కు 5 డిఫిబ్రిలేటర్లను అందజేసింది. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా మొబైల్ ఈటీఎం వ్యానును జెండా ఊపి ప్రారంభించారు. అలాగే పీఎంఈజీపీ, పీఎం స్వనిధి, పీఎంఎఫ్ఎంఈ, ముద్ర వంటి వివిధ ప్రభుత్వ పథకాల కింద పుదుచ్చేరి, కారైకల్, మహే, యానాం ప్రాంతాలకు చెందిన దాదాపు 1.42 లక్షల మంది లబ్ధిదారులకు రూ. 2,628 కోట్లు రుణాలు మంజూరు చేశారు. ఇందులో భాగంగా కొందరు లబ్ధిదారులకు మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో చెక్కులను అందజేశారు.



చెక్కులను అందజేస్తున్న కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్

ప్రశాంతంగా వీఆర్వోల బదిలీ కౌన్సెలింగ్

తిరుత్తణి: ఆర్డీఓ ఆధ్వర్యంలో మంగళవారం వీఆర్వోలకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉదయం తిరుత్తణి తాలుకాకు సంబంధించి, మధ్యాహ్నం నుంచి పళ్లిపట్టు, ఆర్కేపేట తాలూకాలకు సంబంధించిన వారికి స్థానచలనం కల్పించారు.



కౌన్సెలింగ్‌ను పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ దీప

హీరో విజయ్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు



తమిళసినిమా: విజయ్.. ఈ పేరు ఇప్పుడు ఆయన అభిమానులకు తారక మంత్రంగా మారింది. రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. వివరాలు.. విజయ్ అత్యధిక ప్రేక్షకాదరణ కలిగిన నటుడిగా ఎదిగారు. తన అభిమాన సంఘాలను విజయ్ ప్రజా సంఘాలుగా మార్చారు. తద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలోని 234 నియోజకవర్గాలకు చెందిన 10, ప్లస్-1, ప్లస్-2 తరగతుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించిన నియోజకవర్గం ముగ్గురు చొప్పున ఎంపిక చేసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పనైయూరులోని తన కార్యాలయానికి ఆహ్వానించి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు హిత వాక్యాలు చేశారు. ముఖ్యంగా ఓటుకు నోటు విధానం మంచిది కాదనే విషయాన్ని తనదైన శైలిలో స్పష్టం చేశారు. ఇది రాజకీయ వర్గాల్లోనూ, టీవీ ఛానల్లో పెద్ద డిబేట్ జరిగింది. అంతేకాకుండా విజయ్ రాజకీయ రంగ ప్రవేశం చేస్తారనే నమ్మకాన్ని ఆయన అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నటుడు విజయ్ మంగళవారం ఉదయం మరోసారి తన అభిమాన సంఘ నిర్వాహకులను, కార్యకర్తలను చెన్నైలోని తన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా తమిళనాడులోని అన్ని నియోజకవర్గాల్లోనూ జరుగుతున్న పరిణామాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించినట్లు సమాచారం. అదే విధంగా మరికొన్ని రాజకీయ పరమైన అంశాల గురించి తీవ్రంగా కార్యకర్తలతో చర్చించినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో 15 జిల్లాలకు చెందిన విజయ్ ప్రజా సంఘం నిర్వాహకులు పాల్గొన్నట్లు సమాచారం. దీంతో మారోసారి విజయ్ రాజకీయ ప్రవేశంపై ఊహాగానాలు జోరందుకున్నాయి.

శాంతి భద్రతల పరిరక్షణలో రాజీలేదు

- ఎంతటి వారైనా ఉపేక్షించకండి
- విచారణ సమయంలో జాగ్రత్తలు అవశ్యం
- పోలీసుల బాసులకు సీఎం సూచన

సాక్షి, చెన్నై: శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడే ప్రసక్తే లేదని, తప్పు చేసే వారు ఎంతటి వారైనా సరే ఉపేక్షించ వద్దు అని పోలీసు బాసులను సీఎం ఎంకే స్టాలిన్ ఆదేశించారు. కేసుల విచారణ సమయంలో జాగ్రత్తలు అవశ్యమని సూచించారు. సచివాలయంలో మంగళవారం పోలీసు అధికారులతో సీఎం స్టాలిన్ సమావేశమయ్యారు. డీజీపీగా శంకర్ జివ్వాల్ బాధ్యతలు స్వీకరించినానంతరం జరిగే తొలి సమావేశం కావడంతో సమగ్ర వివరాలను పోలీసు అధికారులు సీఎం ముందు ఉంచారు. ముందుగా ఈ సమావేశంలో ఆత్మహత్య చేసుకున్న డీఐజీ విజయకుమార్‌ను సేవలను స్మరిస్తూ సంతాపం తెలిపారు.

పరస్పర సహకారం తప్పనిసరి

ఈ సమావేశంలో సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, పోలీసు అధికారులు, ప్రభుత్వ కార్యదర్శులు సమష్టి సహకారంతో ముందుకెళ్లాలని సూచించారు. తమిళనాడులో శాంతిభద్రతల సమస్యలపై సమర్పించిన నివేదిక సంతృప్తికరంగా ఉన్నా, కొత్త రకం నేరాలు పుట్టుకొస్తుండడం ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఏళ్ల తరబడి రాష్ట్రాన్ని శాంతి వనంగా ఉంచడంలో పోలీసుల పాత్ర కీలకం అని అభినందించారు. నేరగాళ్లను గుర్తించి మొక్కలోనే తుంచి పడేయాలని సూచించారు. రాబోయే కాలంలో ప్రజల మీద ప్రభావాన్ని చూపించే ఘటనలు జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నాయని, మరింత జాగ్రత్తగా భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పుకార్లు సృష్టించ వారిని ఉపేక్షించ వద్దు అని సూచించారు. ఎవరైనా నిందితుడిని పోలీస్ స్టేషన్‌లో ఉంచి విచారించ దలచుకుంటే నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, కస్టడీ మరణాలను నిరోధించాలని హెచ్చరించారు. మహిళలు, బాలికల భద్రతకు మరింత భరోసా ఇవ్వాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలన్నారు. నకిలీ మద్యం, సారా తయారీదారులు, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారితో కఠినంగా వ్యవహరించాలన్నారు. వారంలో ఒక రోజు నేరాలు, కట్టడి దిశగా తీసుకున్న చర్యలపై జిల్లాల వారీగా సమీక్షించుకోవాలని సూచించారు.

సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా..

సామాజిక మాధ్యమాల ద్వారా కుల, మత ఘర్షణలకు ఎవరైనా ప్రయత్నించే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి వారిని ట్రాక్ చేస్తూ ఉండాలని, నిఘా ఉంచాలని ఆదేశించారు. కొందరి చర్యల కారణంగా అమాయకులు ఘర్షణలలో బలయ్యే ప్రమాదం ఉందని, విష పూరిత ఆలోచనలతో ముందుకెళ్లే వారిపై నిఘా ఉంచాలన్నారు. డీజీపీ, హోం కార్యదర్శి తన సూచనలు రాష్ట్రవ్యాప్తంగా అమలయ్యే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని, కమిషనర్లు, ఎస్పీలు, ఐజీ, డీఐజీలు సహా ప్రతి అధికారి ఆన్‌లైన్ ద్వారా సమీక్షలు, సమావేశాలు నిర్వహించి శాంతి భద్రతల పరిరక్షణలో దూసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అలాగే, మానసిక ఒత్తిడికి లోనైన వారిని గుర్తించి సరైన కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ఈసమావేశంలో ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, డీజీపీ శంకర్ జివ్వాల్, చెన్నై పోలీసు కమిషనర్ సందీప్ రాయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు ఆపరేటివ్ బ్యాంక్ కొత్త శాఖలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన సహకార బ్యాంకు తాంబరం తూర్పు, తాంబరం వెస్ట్, అంబత్తూరుతో పాటుగా మరో చోటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెరియకర్పున్ పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సీఎం స్టాలిన్ సమావేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కో- ఆపరేటివ్ బ్యాంక్‌లను ప్రారంభిస్తున్న సీఎం

చెన్నై బుధవారం । 12 । జూలై । 2023 సాక్షి

క్లుప్తంగా

8వ శతాబ్దానికి చెందిన విగ్రహం లభ్యం



అన్నానగర్: తిరుచ్చులీ సమీపంలో మంగళవారం 8వ శతాబ్దానికి చెందిన అమ్మవారి విగ్రహం లభ్యమైంది. విరుదునగర్ జిల్లా తిరుచ్చులీ తాలూకా ముక్కూళం సమీపంలోని సిరువనూరు గ్రామ అడవిలో పురాతన శిల్పాలున్నాయనే సమాచారం మేరకు పాండ్యనాడు సాంస్కృతిక కేంద్రం పురావస్తు క్షేత్ర పరిశోధకుడు చరిత్ర అధ్యాపకులైన తామరైకన్నన్, రాజపాండి, నటరాజన్, శ్రీధర్ సోమవారం అక్కడికి వెళ్లారు. అక్కడ ఉన్న శిల్పాలను పరిశీలించగా అవి 8వ శతాబ్దానికి చెందిన తొలి పాండ్య రాజ్య శిల్పాలని తేలింది.

పులల్ సెంట్రల్ జైలును పరిశీలించిన న్యాయమూర్తి

కొరుక్కుపేట: తిరువళ్లూరు జిల్లా హైకోర్టు న్యాయమూర్తి ఎస్.ఎం. సుబ్రమణ్యం పులల్ సెంట్రల్ జైలు, అంబత్తూరు కోర్టు, పులల్ మహిళా జైలును మంగళవారం పరిశీలించారు. అనంతరం పెండింగ్ కేసులకు సంబంధించి, ఖైదీల స్థితిగతులను న్యాయమూర్తులు, జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఆయన వెంట తిరువళ్లూరు జిల్లా ప్రధాన జిల్లా జడ్జి ఎస్ .సెల్వ సుందరితో పాటు, చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆర్.వేలరెస్, పుజల్ జైలు సూపరింటెండెంట్లు కృష్ణరాజ్, నిహిలా నాగేంద్రన్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



చికిత్స అందిస్తున్న వైద్యులు

అరక్కోణం: ఉలియంపాక్కంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో గ్రామీణులు పాల్గొని వైద్య పరీక్షలతో పాటు చికిత్స పొందారు. అరక్కోణం యూనియన్ ఉలియంపాక్కం పంచాయతీలో తిరుత్తని పీకాక్ హాస్పిటల్ ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300కు పైబడిన వారు పాల్గొని చికిత్స పొందారు. వైద్య శిబిరాన్ని పంచాయతీ సర్పంచ్ జీవరత్నం ప్రారంభించారు. శిబిరంలో పీకాక్ వైద్యుల బృందం చికిత్సలందించింది.

3,500 ఏళ్ల నాటి రాతి పనిముట్లు లభ్యం



బయల్పడిన రాతి పనిముట్లు

అన్నానగర్: తిరుపత్తూరు సమీపంలో మంగళవారం 3,500 సంవత్సరాల నాటి రాతి పనిముట్లను పురాతత్వ శాస్త్రవేత్తలు గుర్తించారు. వివరాలు.. తిరుపత్తూరు తూయ నెంజ కాలేజ్ ప్రొఫెసర్ ఎ. ప్రభు, ఆర్కియాలజిస్ట్, హిస్టరీ ప్రొఫెసర్ శేఖర్, పరిశోధక విద్యార్థి బి. ధరణీధరన్, సామాజిక కార్యకర్త రాధాకృష్ణన్ కందిలి సమీపంలోని సుడుకట్టూరులో సోమవారం క్షేత్రస్థాయి సర్వేలో సుమారు 3,500 సంవత్సరాల క్రితం నాటి రాతి పనిముట్లు కనుగొన్నారు. వీటి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రస్తుతం పరిశోధనలు చేస్తున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

సేలం, కేరళ, కర్ణాటకలో ప్రేమ వివాహాల పేరుతో మోసం

- పెళ్లిళ్ల రాణి కోసం పోలీసుల గాలింపు

తిరువొత్తియూరు: సేలంలో ఓ ఫైనాన్షియర్‌ను మోసం చేసిన ఇన్‌స్టాగ్రామ్ బ్యూటీ కేరళ, కర్ణాటకలోనూ ప్రేమ వివాహాల మోసాలకు పాల్పడిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. సేలం జిల్లా ధర్మంగళం సమీపంలోని తోలసంబట్టి ప్రాంతానికి చెందిన మూర్తి ఫైనాన్షియర్ (30) కొద్ది రోజుల క్రితం తొలసంబట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో తాను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైన నీలగిరి జిల్లా కూడలూరుకు చెందిన రషీత అనే బ్యూటీతో ప్రేమలో పడ్డాను. గత మార్చిలో ఓమలూరు ఈశ్వరన్ దేవాలయంలో పెళ్లి చేసుకున్నాం. 3 నెలల పాటు కాపురం చేసిన ఆమె గత నెల 4వ తేదీ ఉదయం కనిపించకుండా పోయింది. ఇంట్లో ఉన్న 4 తులాల నగలు, రూ.1.50 లక్షల డబ్బు తీసుకుని మాయమైంది. ఆమెను పట్టుకొని అరెస్ట్ చేయాలి౯౯ అని తెలిపాడు. ఈ ఫిర్యాదుపై పోలీసులు సీరియస్‌గా విచారణ చేపట్టారు. ఈ సందర్భంలో రషీత ఇన్‌స్టాగామ్‌లో మోడల్‌గా వివిధ రూపాల్లో ఉన్న చిత్రాలను పోస్ట్ చేయడం, డబ్బున్న పురుషులను ప్రలోభపెట్టడం ద్వారా వివాహ మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది. ఫైనాన్షియర్ మూర్తిని వివాహం చేసుకునేందుకు ముందే గతంలో కోయంబత్తూరు, కేరళ, కర్ణాటకలో కొందరిని మోసం చేసి పెళ్లి చేసుకున్న విషయం వెల్లడైంది. ఈ కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం పరారీలో ఉన్న రషీత కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఆమె బంధువులు సేలం, నీలగిరిలో ఉన్నారని వారిని కూడా ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

మహావీరుడికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్



పుష్పాంజలి ఘటిస్తున్న అన్నాడీఎంకే నాయకులు

సాక్షి, చెన్నై: స్వాతంత్ర్య సమరయోధుడు మహావీరుడు అళగు ముత్తు కోన్‌కు మంగళవారం ఘన నివాళులర్పించారు. అళగు ముత్తు కోన్ 266వ జయంతిని పురస్కరించుకుని అన్ని పార్టీల నేతలు మహావీరుడికి అంజలి ఘటించారు. ఎగ్మూర్ రైల్వే స్టేషన్ సమీపంలోని అళగు ముత్తు విగ్రహం పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఉయాన్నే సీఎం ఎంకే స్టాలిన్, మంత్రులు ఎం. సుబ్రమణియన్, రాజకన్నప్పన్, పెరియకరుప్పన్, గీతా జీవన్, స్వామినాధన్, పొన్ముడి, నెహ్రూ, ఏవీవేలు, మేయర్ ప్రియ తదితరులతో పాటు అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అక్కడ ఉంచిన అళగు ముత్తు చిత్రపటానికి సీఎం స్టాలిన్ పుష్పాంజలి ఘటించారు. అనంతరం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామినేతృత్వంలో ఆ పార్టీ వర్గాలు అంజలి ఘటించాయి. మాజీ మంత్రులు గోకుల ఇందిర, సి. విజయ భాస్కర్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అలాగే, అన్నాడీఎంకే నేతృత్వంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వయంగా పళనిస్వామి అందరికి తన చేతుల మీదుగా అన్నదానం చేశారు. ఆ తర్వాత మాజీ సీఎం పన్నీరుసెల్వంతో పాటు పలు పార్టీల నేతలు అళగు ముత్తుకు నివాళులర్పించారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్, ఎండీఎంకే నేత వైగో , కాంగ్రెస్ ఎంపి విజయ్ వసంత్‌తో పాటు పలు పార్టీల నాయకులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

• విద్యార్థుల రాస్తారోకో



ప్రభుత్వ బస్సును అడ్డుకుంటున్న విద్యార్థులు, గ్రామీణులు

తిరుత్తణి: గ్రామీణ ప్రాంతాలకు అదనపు బస్సు సర్వీసులు నడపాలంటూ విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి మంగళవారం ఉదయం రాస్తారోకో చేపట్టారు. వివరాలు.. తిరువలంగాడు యూనియన్ తాళవేడు, నల్లాట్టూరు, తుంబికులం, పూనిమాంగాడు, వెంకటాపురం సహా 20కు పైగా గ్రామాలకు చెందిన పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు, మహిళలు సహా తమ పనుల నిమిత్తం తిరుత్తణికి చేరుకుని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంది. అయితే తాళవేడు ప్రాంతానికి సక్రమంగా బస్సులు లేకపోవడంతో పాటు ప్రధానంగా ఉదయం, సాయంత్రం, రాత్రి సమయాల్లో బస్సులు లేక గ్రామీణులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈక్రమంలో మంగళవారం విద్యార్థులు అధికారుల తీరుని నిరసిస్తూ బస్సును అడ్డుకుని నినాదాలు చేశారు. డిపో మేనేజర్ హరిబాబు సంఘటన ప్రాంతం చేరుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణలో..

కృత్రిమ మేధా వినియోగం

- చెన్నై కార్పొరేషన్ అధికారులకు ఐఐఎంలలో శిక్షణ
- ఉత్తమ ఫలితాలు సాధిస్తామంటున్న అధికారులు
- 24వ తేదీన లోక్నో వెళ్లనున్న మరో బృందం



కొరుక్కుపేట: ప్రాజెక్టు నిర్వహణలో కృత్రిమ మేధస్సు వినియోగంపై చెన్నై కార్పొరేషన్ అధికారులకు ఐఐఎంలలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రాజెక్ట్ ద్వారా చారిత్రక పరిశోధన, డేటా సేకరణ, ప్రాజెక్ట్ సక్సెస్ రేటు, ప్రయోజనాలు, వనరుల వృధా వంటి ప్రాజెక్ట్ నిర్వహణ పనులలో ఆటోమేషన్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఉత్పన్నమయ్యే ఫలితాలను ఎలా ఉపయోగించాలో ఇందులో తెలియజేస్తాని అధికారులు తెలిపారు. ఇక ఆటోమేటెడ్ రెస్పాన్స్ సిస్టమ్స్, వర్చువల్ అసిస్టెంట్, మెషిన్ లెర్నింగ్‌లో కార్పొరేషన్ దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా కృత్రిమ మేధస్సును ఉపయోగించి పనుల పురోగతి, పూర్తి అయిన సమయం, టెక్స్ట్ లేదా వాయిస్ ద్వారా యాక్సెస్ చేయవచ్చునని తెలిపారు. ఈ శిక్షణ కోసం చీఫ్ ఇంజినీర్ రాజేంద్రన్, సూపరింటెండెంట్ ఇంజినీర్ బాలమురళి సహా ముగ్గురు అధికారులు ఎంపికయ్యారన్నారు. మరో ముగ్గురు అధికారులు శిక్షణ కోసం ఐఐఎం లక్నోకు వెళ్తారని పేర్కొన్నారు. ఇక ఇప్పటికే షిల్లాంగ్‌కు వెళ్లిన అధికారులు మరో ఐదు రోజుల్లో శిక్షణ ముగించుకుని ఈ నెల 14న తిరిగి రానున్నారు. అలాగే 24న లక్నో వెళ్లనున్న అధికారులు ఈ నెల 28న తిరిగి వస్తారని తెలిపారు. బడ్జెట్‌ల తయారీ, అంచనాలు, ప్రాజెక్ట్ వ్యయాల నియంత్రణ, ప్రాజెక్ట్‌లను విజయవంతంగా అమలు చేయడం వంటి మంచి వ్యాపార నిర్వహణను అర్థం చేసుకోవడానికి ఈ శిక్షణ అధికారులకు సహాయపడుతుందని కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తెలిపారు. ఈ రోజుల్లో అన్ని రంగాల్లోనూ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారని, ఈనేరఢ్‌సో కార్పొరేషన్ అధికారులకు నైపుణ్యాలు, సాంకేతికతపై శిక్షణ ఇవ్వడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎంలో 'స్కూల్ ఆఫ్ డిజైన్ కాన్వకేషన్'



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న అతిథులు

సాక్షి, చెన్నై: ఎస్‌ఆర్‌ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో స్కూల్ ఆఫ్ డిజైన్ థింకింగ్ ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ కాన్వకేషన్ మంగళవారం జరిగింది. ఇందులో 165 మందికి పైగా అధ్యాపకులు గ్రాడ్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించి మాస్టర్ ట్రైనర్ హోదాను దక్కించుకున్నారు. 2019లో కుదుర్చుకున్న ఒప్పంద భాగస్వామ్యం మేరకు ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్‌లను డిజైన్ ది థింకింగ్ పేరిట నిర్వహిస్తూ వస్తున్నారు. ఉత్తీర్ణులైన వారికి స్కూల్ ఆఫ్‌డిజైన్ వ్యవస్థాపకుడు అరుణ్ జైన్, కో ఫౌండర్ అన్బు రత్న వేల్, ఎస్ఆర్ఎం వీసీ ముత్తమిళ్ సెల్వన్‌లు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈసందర్భంగా అరుణ్ జైన్ మాట్లాడుతూ, డిజైన్ థింకింగ్‌లో కొత్త పరిష్కారాలను రూపొందించడానికి , సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా గుర్తింపు పొందిన అధ్యాపకుల ద్వారా విద్యార్థుల ఆలోచనలలోసరికొత్త మార్పులు తీసుకు వచ్చేందుకు వీలుందన్నారు. ముత్తమిళ్ సెల్వన్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో అధ్యాపకులు, విద్యార్థులలో మార్పులకు ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదకరంగా ఉంటాయన్నారు.

నీటి శుద్ధీకరణపై అవగాహన



వివరాలను తెలుసుకుంటున్న విద్యార్థులు

సాక్షి, చెన్నై: ఇండియన్ మారిటైమ్ విశ్వవిద్యాలయంలో ప్రతిష్టాత్మకంగా ఉన్న ఎస్ఐఎంఏటీఎస్ బయో ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్ నేతృత్వంలో విద్యార్థులకు నీటి శుద్ధీకరణపై అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక యాత్రను మంగళవారం నిర్వహించారు. చెన్నై శివారులోని రెడ్ హిల్స్ ఉద్దండి లే అవుట్‌లోని నీటి శుద్ధీకరణ కేంద్రంలో జరుగుతున్న ప్రక్రియలను విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. ఎక్స్‌నోరా ఫౌండేషన్ ప్రతినిధులు విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ట్యాంక్‌లు, సెటిల్లింగ్ బేషిన్‌లు, వివిధ పద్ధతులలో నీటిశుద్ధీకరణ, స్వచ్ఛమైన నీటిని వెలికి తీయడం గురించి తెలియజేశారు. పర్యావరణ శాస్త్రం గురించి మక్కువను పెంపొందించడానికి విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు దోహదకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

టాస్మాక్ దుకాణం మూసివేయాలని ధర్నా



గొల్లకుప్పంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తిరుత్తణి: టాస్మాక్ దుకాణం మూసివేయాలని మహిళలు మంగళవారం ధర్నా చేశారు. తిరుత్తణి శివారులోని చెన్నై- తిరుపతి జాతీయ రహదారి పొన్పాడి చెక్‌పోస్టు వద్ద గత ఐదేళ్ల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణం వుంది. ఇందులో మద్యం కొనుగోలు చేసే మందుబాబులు అక్కడికి పక్కనే వున్న గొల్లకుప్పంలోని ఇళ్లకు సమీపంలో, పంట పొలాల్లో బాటిళ్లు, చెత్తను వేస్తున్నారు. పైగా కొన్నిసార్లు ఘర్షణలకు దిగుతున్నారు. దీంతో మద్యం దుకాణం తొలగించాలని స్థానిక మహిళలు ధర్నాకు దిగారు. వారికి పోలీసులు సర్దిచెప్పి పంపించి వేశారు.

జీవించే హక్కు అందరికీ ఉంది



పుదువేదం చిత్ర ఆడియో ఆవిష్కరణలో యూనిట్ సభ్యులు

తమిళసినిమా: విట్టల్ మూవీస్ సంస్థ నిర్మించిన చిత్రం పుదువేదం. రాసా విక్రమ్ దర్శకత్వం వహించిన ఇందులో కాక్కా ముట్టై చిత్రం ఫేమ్ విఘ్నేష్, రమేష్, నటి సంజనా, ఇమాన్ అన్నాచ్చి, సిజర్ మనోహర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. వీరితోపాటు రెండు రూపాయల డాక్టర్ జయచంద్రన్ ముఖ్యపాత్రను పోషించారు. రూబీ దేవేంద్రన్ సంగీతం అందించారు. దీనికి మంజునాథ్ పుగళ్ సహా నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో నటుడు ఇమాన్ అన్నాచ్చి ఒక పాట పాడటం విశేషం. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక ప్రసాద్ ల్యాబ్‌లో చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో విడుదలై చిరుతైగళ్ పార్టీ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు తోల్ తిరుమావళవన్ ముఖ్యఅతిథిగా దర్శకుడు కేఎస్ రవికుమార్, వి.శేఖర్, అరవింద్ రాజ్ తదితరులు అతిథులుగా ఇచ్చేశారు. ఈ సందర్భంగా తోల్ తిరుమావళవన్ మాట్లాడుతూ పుదువేదం చిత్రాన్ని దర్శకుడు రాస విక్రమ్ తనకు ప్రత్యేకంగా ప్రదర్శించి చూపించారన్నారు. పుట్టిన ప్రతి వారికీ జీవించే హక్కు ఉందనే విషయాన్ని దృఢపరిచే ఇతివృత్తంతో ఆయన ఈ చిత్రాన్ని రూపొందించారన్నారు. ఈ వేదికపై నటుడు ఇమాన్ అన్నాచ్చి మాట్లాడుతూ ఇప్పుడు ఉన్నత వర్గం, దళిత వర్గం ఇతివృత్తంతో ఎక్కువగా చిత్రాలను రూపొందిస్తున్నారనే ఆవేదనను వ్యక్తం చేశారన్నారు. అలాంటి ఈ సినీ పరిశ్రమలో జీవించడానికి అందరికీ హక్కు ఉందని సందేశంతో కూడిన చిత్రాలను నిర్మించే దర్శకులు ఉన్నారని నిరూపించడానికి రాసా విక్రమ్ వంటి దర్శకులు ఉన్నారన్నారు.కులం వద్దు మతం వద్దు అందరినీ సమానంగా భావిద్దాం అన్న తిరువళ్లువర్ విప్లవాత్మక భావాలను కలిగిన వారూ చిత్ర పరిశ్రమలో ఉన్నారన్నారు.

విజయ్ ఆంటోనినే ముఖ్య కారణం



వేదికపై విజయ్ ఆంటోని, ఫాతిమాను సత్కరిస్తున్న చిత్ర యూనిట్

తమిళసినిమా: పిచ్చైక్కారన్ -2 చిత్ర విజయాన్ని ఆస్వాదిస్తున్న విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం కొలై. బాలాజీ కుమార్ దర్శకత్వంలో ఇన్ఫినిటీ ఫిలిం వెంచర్స్, లోటస్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఇందులో నటి రిత్వికా సింగ్, మీనాక్షి చౌదరి నాయకిలుగా నటించారు. గిరీష్ సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈనెల 21వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సోమవారం చెన్నైలోని సత్యం థియేటర్లో చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో నిర్మాతల మండలి అధ్యక్షుడు మురళి, కలైపులి ఎస్. ధాను, సత్య జ్యోతి త్యాగరాజన్ ,అమ్మ క్రియేషన్స్ శివ ,దర్శకుడు విజయ్, లింగుసామి, మిష్కిన్, నటుడు జాన్ విజయ్, నటి మీనాక్షి చౌదరి, ఈ చిత్రాన్ని తమిళనాడులో విడుదల చేస్తున్న శక్తి ఫిలిమ్స్ ఫ్యాక్టరీ శక్తి వెల్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ వేదికపై నిర్మాత ధనుంజయన్ మాట్లాడుతూ ఇన్ఫినిటీ ఫిలిం వెంచర్స్ సంస్థను ప్రారంభించడానికి ముఖ్య కారణం నటుడు విజయ్ ఆంటోనీ పేర్కొన్నారు. ఈ సంస్థలో వరుసగా మూడు చిత్రాలు చేద్దామని ఆయనే తమను ప్రోత్సహించారని తెలిపారు ఆ విధంగా కొలై చిత్రం, తర్వాత రత్తం, ఆ తర్వాత మలై పిడిక్కాద మనిదన్ చిత్రాలు తమ సంస్థ నుంచి వరుసగా విడుదల కానున్నాయని చెప్పారు. ఇలా విజయ్ ఆంటోనితో వరుసగా చిత్రాలు చేయడం సంతోషంగా ఉందన్నారు దర్శకుడు బాలాజీ కుమార్ దీన్ని ఉత్తమ చిత్రంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. సమీప కాలంలో విడుదలైన బడ్జెట్ చిత్రాలు మంచి విజయాన్ని సాధించినట్లు ఈ చిత్రం కూడా సక్సెస్ అవుతుందని నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో చాలా ఎమోషనల్ విషయాలు చోటుచేసుకుంటాయని ధనుంజయన్ తెలిపారు.

కోలీవుడ్ టాక్స్

మీరెన్ని పెళ్లిళ్లు చేసుకున్నా ఇంట్లో..



ఆడియో వేడుకలో భార్య సాక్షితో ధోని

తమిళసినిమా: ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు ఎంఎస్ ధోని సోమవారం సాయంత్రం చెన్నైలో తన సతీమణి సాక్షి ధోనితో కలిసి సందడి చేశారు. ఈయన తాజాగా చిత్ర నిర్మాణం రంగంలోకి కూడా ప్రవేశించిన విషయం తెలిసిందే. ధోని ఎంటర్ టైన్‌మెంట్ పతాకంపై సాక్షి ధోని నిర్మాతగా తొలి ప్రయత్నంగా తమిళంలో ఎల్‌జీఎం (లెట్స్ గెట్ మ్యారీ)అనే చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హరీష్ కల్యాణ్, నటి ఇవాన జంటగా నటించిన ఇందులో నదియా, యోగిబాబు తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. ఈ చిత్రం ద్వారా రమేష్ తమిళమణి సంగీతాన్ని అందిస్తూ, దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం త్వరలో విడుదలకు ముస్తాబవుతోంది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని చెన్నైలోని ఓ స్టార్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ధోని తమిళంలో చిత్రాన్ని నిర్మించడం గురించి మాట్లాడుతూ మీరు ఎన్ని పెళ్లిళ్లు చేసుకున్న ఇంట్లో బాస్ ఎవరన్నది అందరికీ తెలిసిందేనన్నారు. తన భార్య చిత్రాన్ని నిర్మిస్తానని చెప్పారన్నారు. తాను క్రికెట్ క్రీడాకారుడిగా పరిచయం అయ్యింది చెన్నైలోనేననీ, అదే విధంగా తాను టెస్ట్ హైహెస్ట్ స్కోర్ చేసింది కూడా చెన్నైలోనేని చెప్పారు. తాము నిర్మించిన తొలి చిత్రం కూడా తమిళంలోనే గాని కాబట్టి తనకు చెన్నై చాలా ప్రత్యేకమని పేర్కొన్నారు. ఇంకా చెప్పాలంటే తాను 2008లోనే ఐపీఎల్ క్రికెట్ ఆడినప్పుడే చెన్నైతో ఎడాప్ట్ అయినట్లు చెప్పారు. అలా తనకు చెన్నైకు పరస్పర ప్రేమ కారణంగానే తొలిచిత్రాన్ని తమిళంలో నిర్మించినట్లు వివరించారు. చాలా త్వరగా షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం ఎల్‌జీఎం అని చెప్పారు. చిత్ర షూటింగ్‌కు ముందు యూనిట్ సభ్యులందరూ హ్యాపీగా ఉండాలని భావించానన్నారు. అందుకే యూనిట్ సభ్యులకు రోజూ మంచి ఆహారం అందించాలని, అదేవిధంగా ఏ విషయంలోనైనా ఒకసారి నిర్ణయం తీసుకుంటే దానిపై పునరాలోచన ఉండరాదని నిర్వాహకులకు చెప్పానన్నారు. తల్లి, కాబోయే భార్య మధ్య ఓ యువకుడి ఎదుర్కొనే ఘటనల కథే ఈ చిత్రం అని ధోని చెప్పారు. చిత్రాన్ని నేను తన కూతురితో కలిసి చూసానని చాలా బాగా ఉందని ఆయన పేర్కొన్నారు.

వేలన్ చిత్ర కాంబో రిపీట్



నూతన చిత్ర ప్రారంభోత్సవంలో అతిథులు

తమిళసినిమా: జి మణికంఠన్ ఇంతకుముందు నిర్మించిన చిత్రం వేలన్. నటుడు ముగెన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి కవిన్ దర్శకత్వం వహించారు. ఇది మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఇదే కాంబినేషన్లో మరో కొత్త సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం చెన్నైలో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఇందులో ముగెన్‌కు జంటగా ఇద్దరు కథానాయకలు నటించనున్నట్లు దర్శకుడు తెలిపారు. అదే విధంగా గోల్డెన్ రెడ్వీర్ అనే జాతికి చెందిన ఓ కుక్క ముఖ్యపాత్రను పోషించనున్నట్లు తెలిపారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్ర పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లు చెప్పారు. చిత్ర రెగ్యులర్ షూటింగును వచ్చేవారం నుంచి ప్రారంభించి చెన్నై, తిరునల్వేలి, నాగర్ కోయిల్, మార్తాండం మొదలగు ప్రాంతాల్లో ఒకే షెడ్యూల్ లో పూర్తి చేయడానికి ప్రణాళికను రచించినట్లు చెప్పారు. క్రైమ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కథ, కథనాలు కొత్తగా ఉంటాయన్నారు. దీనికి పార్కింగ్ ఫేమ్ జిజూ ఛాయాగ్రహణం, డాడా చిత్రం ఫేమ్ జెన్ మార్టిన్ సంగీతాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

తమన్నా పాటపై

ప్రియుడి కామెంట్ ఇదే



జైలర్ చిత్రంలో తమన్న

తమిళసినిమా: నటి తమన్నా భాటియా వయసు పెరుగుతున్నా, అందం మాత్రం తగ్గేదేలే అన్నట్టుగా ఉంటోంది. ఒకపక్క ఈమె హద్దులు మీరిన నటనపై రకరకాల విమర్శలు వెల్లువెత్తుతున్నా, ఆమె పట్టించుకోవడం లేదు. అదేవిధంగా ఒక పక్క బాయ్ ఫ్రెండ్ ప్రేమలో మునిగితేలుతున్నా, అతగాడు ఏమనుకుంటాడో అనే ఆలోచన కూడా తమన్నకు లేకపోవడం గమనార్హం. ఆమె బాయ్ ఫ్రెండ్ విజయ్ వర్మ భావాలు కూడా ఇంచుమించు అలాగే ఉండడం గమనార్హం. తమన్నా తాజాగా తమిళంలో నటించిన చిత్రం జైలర్. సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడు. దాదాపు రెండు దశాబ్దాల పాటు తమిళం, తెలుగు, హిందీ అంటూ బహుభాషా నటిగా రాణిస్తున్న తమన్న రజనీకాంత్ సరసన నటించిన తొలి చిత్రం ఇదే కావడం విశేషం. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహించిన ఇందులో బాలీవుడ్ స్టార్ నటుడు జాకీ ష్రాఫ్, మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్ లాల్, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, టాలీవుడ్ ప్రముఖ నటుడు సునీల్, నటి రమ్యకృష్ణ వంటి ప్రముఖ నటీనటులు నటించిన ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్ కథా చిత్రం ఆగస్టు 10న తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. దీంతో చిత్ర ప్రమోషన్ జోరును పెంచేసింది. అందులో భాగంగా ఇటీవల రజనీకాంత్‌తో కలిసి నటి తమన్నా ఆడి పాడిన కావాలా అనే పాటను విడుదల చేశారు. ఇందులో నటి తమన్నా డాన్స్ మామూలుగా లేదు. అందాలారబోత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఈ పాట ఇప్పుడు కుర్రకారులో పూనకాలు లోడింగ్ చేస్తోంది. ఈ పాట విడుదలైన మూడు రోజుల్లోనే రెండు మిలియన్ ఫాలోవర్స్ ను అలరిస్డడం విశేషం. ఇంత సంతోషంగా పాటపై నటి తమన్న బాయ్‌ఫ్రెండ్ విజయ్ వర్మ స్పందిస్తూ దిస్ సాంగ్ ఈజ్ ఫైర్. తమన్నా గాడ్సెస్ అని ట్వీట్ చేశారు.

క్లుప్తంగా

బీరకుప్పం సర్పంచ్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సుబ్రహ్మణ్యంరాజు

తిరుత్తణి: ఉత్తమ సేవలకు గుర్తింపుగా బీరకుప్పం పంచాయతీ సర్పంచ్ పీసీ.సుబ్రహ్మణ్యంరాజుకు అమెరికన్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. ది అమెరికన్ విశ్వవిద్యాలయం ద్వారా వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ, సేవలందిస్తున్న వ్యక్తులను గుర్తించి సత్కరిస్తుంటారు. ఈ క్రమంలో చెన్నైలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో తిరుత్తణి యూనియన్ బీరకుప్పం పంచాయతీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు పంచాయతీలో తాగునీరు, విద్యుత్ దీపాలు, రోడ్లు, ఉపాధి హామీ పనుల ద్వారా కాలువలు, చెరువులు పూడికతీతలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు ఆయన సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ అందజేశారు.

మేడపై నుంచి పడి యువకుడి మృతి

తిరువొత్తియూరు: తిరుపూర్‌లో మంగళవారం ఉదయం మిద్దె పైనుంచి పడి యువకుడు మృతి చెందాడు. లక్ష్మీనగర్‌లో మంగళవారం తెల్లవారుజామున మిద్దెపైన యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండడం చూసిన అక్కడ డ్యూటీ చేస్తున్న సెక్యూరిటీ కేకలు వేశాడు. దీంతో ఇరుగు పొరుగు వారు ఇంటి నుంచి బయటకు వచ్చారు. ఆ వ్యక్తి కోసం గాలించారు. యువకుడు అక్కడి నుంచి ఒక్కో ఇంటి మిద్దెపై దూకుతూ తప్పించుకోవడానికి ప్రయత్నించాడు. ఆ సమయంలో ప్రజలు అతన్ని వెంటాడడంతో మిద్దెపై నుంచి అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని తిరుపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం అందుకున్న తిరుపూర్ పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతి చెందిన యువకుడి వివరాలు తెలియరాలేదు.


ఆలయ కొలనులో వృద్ధురాలి మృతదేహం

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పరిధిలోని బడాశెట్టి కొలనులో మంగళవారం వృద్ధురాలి మృత దేహాన్ని భక్తులు గుర్తించారు. ఆలయ అధికారులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ సిబ్బంది కొలను నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరుత్తణి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల కాలంగా బడాశెట్టి కొలనులో పడి భక్తులు ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్న క్రమంలో కొలను చుట్టూ ప్రహరీ గోడ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

బాలికను గర్భవతిని చేసిన వ్యక్తి అరెస్ట్

తిరువొత్తియూరు: కన్యాకుమారి జిల్లాలో పాఠశాల విద్యార్థినిపై బలాత్కారం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కన్యాకుమారి జిల్లా బూతపాండి ప్రాంతానికి చెందిన బాలిక (15) సోమవారం ఎప్పటిలాగే పాఠశాలకు వెళ్లింది. హఠాత్తుగా తల తిరుగుతుందని చెప్పి స్పృహ కోల్పోయింది. వెంటనే ఆమెను ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆమె నాలుగు నెలల గర్భవతి అని తెలిపారు. దీంతో ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు, శిశుసంక్షేమ అధికారులకు సమాచారం అందించారు. మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికకు ఆచారిపల్లం ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో మరోసారి పరీక్షలు చేశారు. విచారణలో అదే గ్రామానికి చెందిన బంధువు, వరుసకు చిన్నాన్న అయిన శివకుమార్ (53) లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. నాగర్‌కోయిల్‌లోని టీ దుకాణంలో మాస్టర్‌గా పనిచేస్తున్న శివకుమార్‌ను సోమవారం సాయంత్రం పోలీసులు అరెస్టు చేశారు.

5 రూపాయల నాణెం మింగిన బాలిక



అన్నానగర్: రామనాథపురంలో ఓ బాలిక 5 రూపాయల నాణేన్ని మింగేసింది. తిరుత్తరకోస మంగై సమీపంలోని మలంగుడికి చెందిన తామరైకన్నన్ కుమార్తె యాసిని (8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి రాగానే అమ్మను స్నాక్స్ అడిగింది. ఐదు రూపాయలు ఇవ్వాలని, దుకాణంలో చిరుతిళ్లు కొనుక్కోవాలని తల్లిని కోరింది. బాలిక తన నోట్లో రూ.5 నాణెం పెట్టుకుని వెళ్లింది. ఈ క్రమంలో నాణేన్ని మింగేసింది. ఊపిరాడక పరుగున అమ్మ దగ్గరకు వెళ్లి నాణెం మింగేశాను అని తెలిపింది. దీంతో భయాందోళనకు గురైన బాలిక తల్లి ఇరుగుపొరుగు వారి సహాయంతో నాణేన్ని తీసేందుకు ప్రయత్నించింది. కానీ గొంతులో ఇరుక్కున్న నాణెం లోపలికి వెళ్లిపోయింది. దీంతో బాలికను అంబులెన్స్‌లో రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు బాలికకు ఎక్స్‌రే తీయగా కడుపులో నాణెం కనిపించింది. నాణేన్ని బయటకు తీసేందుకు వైద్యులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు.

28 నుంచి అన్నామలై పాదయాత్ర

• సిద్ధమైన రూట్ మ్యాప్



అన్నామలై

సాక్షి, చెన్నై: పార్టీ బలోపేతమే లక్ష్యంగా, రానున్న లోక్‌సభ ఎన్నికలలో సత్తా చాటడమే ధ్యేయంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పాదయాత్రకు సిద్ధమయ్యారు. ఈనెల 28వ తేది నుంచి వచ్చే ఏడాది జనవరి 11వ తేదీ వరకు ఈ యాత్ర సాగనుంది. ఇందుకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను మంగళవారం సిద్ధం చేశారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలలో గెలుపొందడమే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 11 లోక్ సభ నియోజకవర్గాలను ఎంపిక చేసి, పార్టీ, కేంద్ర ప్రభుత్వ పరంగా కార్యక్రమాలను విస్తృతం చేసి ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా నియోజకవర్గాలను కలుపుతూ రాష్ట్ర పర్యటనకు సంబంధించిన రూట్ మ్యాప్‌ను అన్నామలై సిద్ధం చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను, ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ ఫలాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించే విధంగా పాదయాత్రకు కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. ఈ పాదయాత్ర రామనాథపురం నుంచి ఈనెల 28వతేదీ ప్రారంభం కానుంది. ఇదే నియోజకవర్గంలో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేయవచ్చనే ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఇక్కడి నుంచే అన్నామలై పాదయాత్రకు శ్రీకారం చుట్టడం గమనార్హం. జూలై 30వ తేదీ ముదుగళత్తూరు, తిరువాడనై, పరమకుడి, శివగంగై, ఆగస్టు 1న మానా మదురై, 2న ఆలంకుడి, 5న మదురై, 9న తిరుచ్చిట్రంబలం, 13న తూత్తుకుడి, 14 తిరుచెందూరు, 15న కన్యాకుమారి, 20న తిరునల్వేలి , 31న తెన్‌కాశి, మీదుగా యాత్ర సాగనున్నది. సెప్టెంబరు 1న శంకరన్ కోయిల్, 9న పళణి, 13న కోయంబత్తూరు, ఈరోడ్, 21న కరూర్, అక్టోబరు 9న తిరుచ్చి, నవంబరు 1న మైలాడుతురై, 27న సేలం, డిసెంబరు 28న ధర్మపురి, 31న తిరుత్తణి, అరక్కోణం, జనవరి 2న తిరువళ్లూరు, చెంగల్పట్టు , కాంచీపురం మీదుగా సాగి 7,8,9,11 తేదీలలో చెన్నైలో అన్నామలై పాదయాత్ర సాగనుంది.

కామరాజ్ మెడకు అక్రమాస్తుల ఉచ్చు

• కోర్టులో ఏసీబీ చార్జ్‌షీట్ దాఖలు



కామరాజ్

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి కామరాజ్ మెడకు అక్రమాస్తుల కేసు ఉచ్చుగా మారనుంది. ఆయన తన ఇద్దరు కుమారులు, మరో ముగ్గురు స్నేహితులతో కలిసి రూ. 127 కోట్లు అక్రమంగా ఆర్జించినట్టు ఏసీబీ విచారణలో తేలింది. ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలతో తిరువారూర్ కోర్టులో మంగళవారం చార్జ్ షీట్ దాఖలైంది. వివరాలు.. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినానంతరం అన్నాడీఎంకే మాజీలను టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు అందిన సమాచారాలు, వచ్చిన ఫిర్యాదులు, సేకరించిన ఆధారాల మేరకు మాజీ మంత్రులపై డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్ అండ్ యాంటీ కరెప్షన్, అవినీతి నిరోధక శాఖ (డీవీఏసీ-ఏసీబీ) ద్వారా దాడులు చేయించారు. సోదాలలో లభించిన ఆధారాల మేరకు అనేక మంది మాజీ మంత్రులపై ఏసీబీ కేసు నమోదు చేసి ఉంది. ఇందులో పౌర సరఫరాల మంత్రిగా గతంలో పనిచేసిన కామరాజ్ కూడా ఉన్నారు. ప్రజలకు పంచాల్సిన నిత్యావసర వస్తువుల్ని తన కుమారులు, స్నేహితుల ద్వారా ఆయన స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆయన అక్రమార్జనకు పాల్పడినట్లు గత ఏడాది జూలైలో ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆయనకు సంబంధించిన 51 ప్రాంతాలలో సోదాలు నిర్వహించింది. ఇందులో లభించిన ఆధారాలు, సమాచారం మేరకు అక్రమార్జనతో హోటళ్లు, ఫామ్ హౌస్‌లు తదితర వాటిని కొనుగోలు చేసినట్లు తేలింది. దీంతో కేసుకు సంబంధించిన సమగ్ర వివరాలు, ఆధారాలతో ఏసీబీ అధికారులు తిరువారూర్ కోర్టులో 210 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. రూ. 127.5 కోట్లు అక్రమార్జన చేసినట్టు పేర్కొంటూ, ఈ కేసులో కామరాజర్, ఆయన కుమారులు ఇనియన్, ఇన్బన్, మంత్రులు చంద్రహాసన్, కృష్ణమూర్తి, ఉదయకుమార్‌ల పేర్లను కూడా కోర్టు ముందు ఉంచారు.

ప్రభుత్వాస్పత్రిలో గర్భిణి మృతి



ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న బంధువులు

వేలూరు: తిరువణ్ణామలై జిల్లా సెంగం సమీపంలోని తెక్కవాడి గ్రామానికి చెందిన జయమోహన్ తిరుప్పూరులోని ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. భార్య సెవ్వంతి(25). వీరిక ఐదేళ్ల కుమారుడు ఉన్నాడు. సెవ్వంతి రెండోసారి గర్భం దాలిృంది. సోమవారం ఉదయం ప్రసవ నొప్పులు రావడంతో బంధువులు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఆమెకు ఆపరేషన్ చేసి ఆడ శిశువును బయటకు తీశారు. అదే సమయంలో ఆమె గర్భ సంచిని తీయాల్సి ఉందని వైద్యులు బంధువులకు తెలపడంతో వారు అంగీకరించారు. దీంతో సెవ్వంతి గర్భ సంచిని తొలగించారు. చికిత్స పొందుతున్న సెవ్వంతి మంగళవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న బంధువులు తిరువణ్ణామలై ప్రభుత్వాసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆసుపత్రి ముందు రాస్తారోకో చేపట్టి నినాదాలు చేశారు. డాక్టర్‌లు సరైన చికిత్స చేయకపోవడంతోనే తమ కుమార్తె మృతి చెందిందని.. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు బంధువులతో చర్చలు జరిపి రాస్తారోకోను విరమింపజేశారు.

కత్తితో దాడి.. ముగ్గురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై పెరంబూర్‌లోని వ్యాసార్‌పాడిలో షేర్ ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన ముల్లైనగర్ ప్రాంతానికి చెందిన గౌతమ్ (21) సహా ముగ్గురిని వ్యాసార్‌పాడి పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సోమవారం రాత్రి చెన్నై వ్యాసార్‌పాడి కళ్యాణపురం ప్రాంతంలో ముసుగు ధరించిన వ్యక్తి బైక్‌పై వచ్చాడు. అతని వెనుక కూర్చున్న వ్యక్తి సి.కళ్యాణపురం వద్ద నిలిపి ఉంచిన 2 బైక్‌లను, కారు అద్దాలు పగలగొట్టి అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్తున్న మెగిసినప్పురం సెల్వనాయకర్ కోయిల్ వీధికి చెందిన విక్కీ విఘ్నేశ్వరన్ (30) పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి చేరిన అతన్ని స్టాన్లీ ఆస్పత్రిలో చేర్పించారు. తన స్నేహితుడైన 17 ఏళ్ల యువకుడిని తీసుకుని గత రాత్రి కత్తితో సి కళ్యాణపురం ప్రాంతానికి వెళ్లి వాహనాలు ధ్వంసం చేసి, ఓ వ్యక్తి పై దాడి చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ముల్లైనగర్ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల బాలుడు, వ్యాసార్‌పాడి ఎం.జీ.ఆర్. నగర్‌కు చెందిన రౌడీ గౌతమ్, ఆమె 16 ఏళ్ల ప్రియురాలిని అరెస్ట్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌పై యువకుడి హల్‌చల్



ట్రాన్స్‌ఫార్మర్‌పై యువకుడు

వేలూరు: తిరుపత్తూరు జిల్లా వానియంబాడి సమీపంలోని మేల్‌కుప్పం గ్రామంలోని పాలారు నుంచి ప్రతి రోజూ ఎద్దుల బండిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. దీంతో మంగళవారం వేకువజామున పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఎద్దుల బండిలో ఇసుక తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన జ్యోతిని పోలీసులు అదుపులోకి తీసుకుని తాలుకా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో జ్యోతి ఎద్దుల బండిని నిలిపి వేసి గ్రామ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేసి వెంటనే దానిపై ఎక్కాడు. అరెస్ట్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్‌పై నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. దీంతో పోలీసులు అతనికి నచ్చజెప్పి కిందకు రప్పించారు. కిందకు వచ్చిన జ్యోతి ఎద్దుల బండిని అక్కడే వదిలి పెట్టి పరారయ్యాడు. పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు.

డీజిల్ చోరీ చేసిన వ్యక్తి అరెస్టు



స్వాధీనం చేసుకున్న డీజిల్, నిందితుడు కుప్పన్

అన్నానగర్: దిండివనంలో మంగళవారం వేకువజామున లారీ డీజిల్ ట్యాంక్ పగులగొట్టి 100 లీటర్ల డీజిల్ చోరీ చేసిన కంటైనర్ లారీ డ్రైవర్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. తూత్తుక్కుడి నుంచి చెన్నై వైపు కెమికల్ లోడుతో వచ్చిన లారీని రామనాథపురం జిల్లా ఎయిర్‌వాడీకి చెందిన రామచంద్రన్ నడిపాడు. విల్లుపురం జిల్లా దిండివనం పక్కన సారం ప్రాంతంలో సోమవారం రాత్రి రోడ్డు పక్కన ట్రక్కును ఆపి రామచంద్రన్ నిద్రిస్తున్నాడు. ఆపై ఓ గుర్తు తెలియని వ్యక్తి ట్రక్కులోని డీజిల్ ట్యాంక్‌ను పగులగొట్టి 20 లీటర్ల సామర్థ్యం గల 5 క్యాన్లలో 100 లీటర్ల డీజిల్ ను దొంగిలించాడు. అనంతరం తాను తెచ్చిన కంటైనర్ ట్రక్కులో 5 డబ్బాల డీజిల్‌ను ఎక్కించుకుని దిండివనం-చెన్నై హైవేపై పరారయ్యాడు. దీని గురించి రామచంద్రన్ ఒలకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. దీంతో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆనందరాసన్ నిందితుడిని సుమారు 20 కిలోమీటర్ల మేర వెంబడించి విల్లుపురం జిల్లా సరిహద్దులోని కరసంగల్ రైల్వేగేట్ దగ్గర పట్టుకున్నారు. లారీని ఒలకూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి డ్రైవర్‌ను విచారించారు. విచారణలో తిరుకోవిలూర్ కండాచీపురం వీరబండి ప్రాంతానికి చెందిన కుప్పన్ (56) అని తేలింది. కంటైనర్‌తో పాటు 100 లీటర్ల డీజిల్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

210 సవర్ల నగలు స్వాధీనం

అన్నానగర్: చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో రూ.5 కోట్లు మోసం చేసిన పరమకుడి యువకుడి ఇల్లు, బంధువుల ఇళ్లల్లో 210 సవర్ల నగలు, రూ.2.5 లక్షలను యూనియన్ క్రైం బ్రాంచ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రామనాథపురం పరమకుడి సమీపం ముత్తు చెల్లపురం గ్రామానికి చెందిన అగస్టీన్ (35) చెన్నైలోని ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. అప్పట్లో అగస్టీన్ ప్రైవేటు కంపెనీలో రూ.5 కోట్ల వరకు మోసం చేసినట్లు తెలిసింది. ఆ ప్రైవేటు సంస్థ ఫిర్యాదు మేరకు యూనియన్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అగస్టీన్ కార్యకలాపాలపై నిఘా పెట్టారు. అగస్టిన్ మదురై, రామనాథపురంలోని జ్యువెలరీ షాపులో నగలు కొనుగోలు చేసినట్లు తెలిసింది. పరమకుడి కామరాజర్ వీధిలోని అగస్టిన్ ఇంటిపై యూనియన్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సోమవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు దాడులు చేశారు. ఇందులో రూ.2.50 లక్షలు, 10 సవర్ల నగలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మొలక్కావనూరు గ్రామంలోని అగస్టీన్ అత్త జయరాణి ఇంటిపై యూనియన్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడులు చేశారు. అక్కడ 200 సవర్ల నగలు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు అగస్టిన్ తల్లి సెబాస్టియమ్మాళ్, అతని తమ్ముడు, అత్తగారిని విచారిస్తున్నారు. ఈ విషయం అగస్టీన్‌కు తెలియంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

జనాభా నియంత్రణతోనే అభివృద్ధి సాధ్యం



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: జనాభా నియంత్రణలో ఉంటేనే అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేలూరు గాంధీ విగ్రహం నుంచి విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రపంచ జనాభా 743 కోట్లుగా ఉందని.. ప్రపంచ విస్తీర్ణంలో 2.5 శాతం ఉండగా వీటిలో ఇండియాలో మాత్రం 17 శాతం జనాభా మాత్రం ఉన్నారన్నారు. ప్రపంచంలోనే ఆరుగురిలో ఒకరు ఇండియన్‌లుగా ఉన్నారన్నారు. ఇండియా జనాభా ప్రస్తుతం 132 కోట్లుగా ఉందన్నారు. తమిళనాడులో 7.7 కోట్ల మంది ఉన్నారని తెలిపారు. వేలూరు జిల్లాలో 40 లక్షల మంది ఉన్నారని.. ఏటా జిల్లాలో 55 వేల మంది జన్మిస్తున్నారన్నారు. వీటి శాతాన్ని తగ్గించేందుకు ప్రజలకు అవగాహన అవసరమన్నారు. విద్యావేత్తలు, విద్యార్థులు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు. జనాభా నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలను జిల్లాలో చేస్తున్నామని తెలిపారు. అయినా అనేక మంది పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం జనాభా నియంత్రణపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృ పో టీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్ కుమార్, ప్రభుత్వాస్పత్రి డీన్ పాపాత్తి పాల్గొన్నారు.

హామీల అమలేది



మాట్లాడుతున్న నైనా మాసిలామణి

అరక్కోణం: రైలు ప్రయాణికుల సంఘం సమావేశాల్లో అధికారుల హామీలు అమలుకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్లు అరక్కోణం రైలు ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు నైనా మాసిలామణి ఆరోపించారు. రైలు ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం రైల్వే శాఖ ద్వారా రైల్వే గ్రీవెన్స్ నిర్వహించడం పరిపాటి. అందులో రైలు ప్రయాణికుల సంఘం సభ్యులు పాల్గొని తమ సమస్యలు వివరించి పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగేది. అయితే అరక్కోణం రైలు ప్రయాణికుల సమస్యలు వింటున్న అధికారులు కార్యరూపం దాల్చేందుకు ఏ మాత్రం చర్యలు చేపట్టడం లేదని సంఘం అధ్యక్షుడు మాసిలామణి ఆరోపించారు. రైల్వే స్టేషన్ ఆధునీకరించాలని, ప్రతి రైలు జంక్షన్ స్టేషన్‌లో నిలిచి వెళ్లాలని పదేపదే కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కేటాయించిన రూ.10 కోట్లు ఇంత వరకు వినియోగించుకుకోకపోవడం దారుణమన్నారు.

కార్పొరేషన్ ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు

కొరుక్కుపేట: కాంచీపురం, తాంబరం, ఆవడి సహా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు సహా 27 మందిని బదిలీ చేశారు. సేలం మున్సిపల్ కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నిత్యను కోయంబత్తూర్ కార్పొరేషన్‌కు, మదురై కార్పొరేషన్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాజీలీ నాగర్‌కోయిల్‌కు, అర్బన్ ప్లానింగ్‌లో పనిచేస్తున్న గురు అరుళ్ సెల్వన్‌ను బదిలీ చేశారు. కడలూరు కార్పొరేషన్‌లోని ఇన్‌స్పెక్టర్‌ను కుంభకోణంకు బదిలీ చేశారు. వెయిటింగ్‌లో ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్ చంద్ర బోస్ కుంభకోణం మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

మద్యం మత్తులో కారుతో యువకుల వీరంగం



• పదికి పైగా ద్విచక్ర వాహనాలు ధ్వంసం
• టైర్ పేలినా 7 కి. మీ దూసుకెళ్లిన వైనం
• నిందితులకు దేహశుద్ధి చేసిన స్థానికులు

సాక్షి, చెన్నై: పుదుచ్చేరిలో పలు మార్గాల్లో మంగళవారం మధ్యాహ్నం ఐదుగురు యువకులు వీరంగం సృష్టించారు. అతివేగంగా కారును నడుపుతూ పదికి పైగా ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టారు. తమకారు టైర్ పేలినా ఏడు కిలోమీటర్లు దూరం దూసుకెళ్లి చివరకు ప్రజల చేతికి చిక్కారు. వివరాలు.. పుదుచ్చేరి నెహ్రూ వీధి ఒన్ వే మార్గం. ఈ మార్గంలోకి ఓ నల్ల రంగు ఇష్టారాజ్యంగా కారు దూసుకెళ్లింది. ఇందులోని యువకులు ఎదురుగా వచ్చిన వాహనాలను ఢీ కొడుతూ, ఆ మార్గంలో వెళ్తున్న వారిని భయాందోళనకు గురి చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు, అటువైపుగా వెళ్తున్న వాహన దారులు ఆకారులో వెళ్తున్న వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. అయినా, ఏ మాత్రం తగ్గని కారులోని యువకులు ముత్యాల పేట, ఏయిర్‌పోర్టు మార్గంలో వీరంగం సృష్టించారు. ఈసీఆర్ మార్గంలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నంలో కారు టైర్ పేలినా బండిని ఆపలేదు. అదే వేగంతో 7 కి.మీ దూరం దూసుకెళ్లి, ఏయిర్ పోర్టు ప్రవేశ మార్గం పిట్టగోడను ఢీకొట్టారు. వీరిని సినీఫక్కీలో పోలీసులు, ప్రజలు ఛేజింగ్ చేసి పట్టుకున్నారు. తర్వాత చితకొట్టేశారు. ఈ ఐదుగురు మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించారు. ప్రజల దాడిలో ఆ యువకులు తీవ్రంగానే గాయపడ్డారు. వీరి కారణంగా పదికి పైగా ద్విచ్రక వాహనాలు దెబ్బతిన్నాయి. విచారణలో ఈ యువకులు చెన్నై మేడవాక్కం సమీపంలోని పళ్లికరనై‌కు చెందిన సునీల్, శ్రీనాథ్, ఆషీఫ్, ఎబినేషన్, ప్రదీప్‌గా గుర్తించారు. వీరిని అరెస్టు చేసి విచారిస్తున్నారు. ఆయా మార్గంలో ద్విచక్ర వాహనాల నుంచి కింద పడ్డ పలువురు స్వల్పంగా గాయపడ్డారు.

ధర్మపురి కలెక్టరేట్ ఎదుట వృద్ధుడి నిరసన



నిరసన తెలుపుతున్న మురుగన్

అన్నానగర్: ధర్మపురి కలెక్టరేట్ ఆవరణలో మంగళవారం ఓ వృద్ధుడు ఆందోళనకు దిగాడు. పోలీసులు అతడిని విచారించారు. అతడు చిట్లక్కరం పట్టికి చెందిన మురుగన్ అని తేలింది. ఈ సందర్భంగా అతను మాట్లాడుతూ..''మా ఊరిలో ఇటీవల పండుగ చేసుకున్నారు. అన్నదాన కార్యక్రమంలో భోజనం చేసేందుకు వెళ్లిన నాపై ఆ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి దాడి చేశాడు. రాత్రి మా ఇంటికి వచ్చిన ఆ వ్యక్తి ఊరు బయట ఉన్న నువ్వు అన్నదానంలో ఎలా తింటావు అంటూ మళ్లీ దాడి చేశాడు. పాపరపట్టి పోలీసులు నన్ను రక్షించి ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. నాపై దాడి చేసి చంపేస్తానని బెదిరించిన వ్యక్తిపైనా, అతనికి సహకరించిన వారిపైనా తగిన చర్యలు తీసుకోవాలని'' అన్నారు. దీని గురించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల పాము కాటుకు ఇద్దరి మృతి

అన్నానగర్: పాము కాటుతో రైతు మృతచెందాడు. కృష్ణగిరి జిల్లా అంజెట్టి సమీపంలోని నాట్రంపాళయం పంచాయతీ ఎస్.పూదూరు గ్రామానికి చెందిన తంగవేల్ (63) రైతు. మంగళవారం తన వ్యవసాయ పొలంలో మేకలకు ఆకులు కోసేందుకు వెళ్లాడు. చెట్టుకింద ఉన్న పామును చూసుకోకుండా తొక్కడంతో కాటేసింది. బంధువులు వెంటనే అతడిని అంజెట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం సేలం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తంగవేల్ మృతి చెందాడు. అంజెట్టి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతి

పాలమేడులో సోమవారం సాయంత్రం పాము కాటుకి విద్యార్థి మృతి చెందాడు. మదురై జిల్లా పాలమేడు సమీపంలోని వి.పుదూరు గ్రామానికి చెందిన రాసుకాలై, మణిమేగలై కుమారుడు బాలమురుగన్ (8) అక్కడి ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం తన ఇంటి దగ్గర నడుచుకుంటూ వెళ్తుండగా పాము కాటేసింది. హుటాహుటిన మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. పాలమేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



తిరుత్తణి-అరక్కోణం రోడ్డులో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలం



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ విజయసత్య

తిరుత్తణి: తిరుత్తణి పట్టణంలో రూ. 3 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. దీనిపై మున్సిపల్ కౌన్సిలర్ ఆర్డీఓకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి పట్టణంలోని అరక్కోణం రోడ్డు జేజే రవి నగర్ పీకాక్ ఆసుపత్రి వెనుక భాగంలో ఒకటిన్నర ఎకరా పోరంబోకు స్థలం ఉంది. రిజిస్ట్రేషన్ శాఖ లెక్కల ప్రకారం ఈ ప్రాంతంలో అడుగు రూ. 1260గా నిర్ణయించగా, మార్కెట్ విలువ రూ. 2500కుపైగా పలుకుతోంది. ఈ క్రమంలో కొందరు రాజకీయ నాయకుల ముసుగులో పోరంబోకు స్థలం ఆక్రమించారు. ఇటీవల ఆలయం నిర్మాణం పేరిట ప్రభుత్వ స్థలాన్ని జేసీబీతో చదును చేసి ప్లాట్లుగా వేచి విక్రయించేందుకు ప్రయత్నించడం వివాదానికి దారితీసింది. మున్సిపల్ కౌన్సిలర్ విజయసత్య ఆర్డీఓ దీపను కలిసి ఫిర్యాదు చేశారు. ఆక్రమణను అడ్డుకోవాలని కోరారు. స్పందించిన ఆమె చర్యలు తీసకుంటామని హామీ ఇచ్చారు.

బాలుడిని కావేరి నదిలో పడేసిన వ్యక్తి అరెస్ట్

తిరువొత్తియూరు: సేలం జిల్లా ఎడప్పాడి సమీపంలోని కోనేరిపట్టికి చెందిన లోగనాథన్ (28) భవన నిర్మాణ కార్మికుడు. ఇతనికి అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణన్ (43) మధ్య విరోధం ఉంది. ఈ క్రమంలో లోకనాథన్ 4 ఏళ్ల కుమారుడు శివకార్తీక్ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. ఇంటి దగ్గర ఆడుకుంటున్న బాలుడు కనిపించకుండాపోవడంతో లక్ష్మణన్‌పై అనుమానంతో దేవూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అర్ధరాత్రి లక్ష్మణన్‌ను పట్టుకుని, విచారణ కోసం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణలో బాలుడిని కిడ్నాప్ చేసి వెల్లాలపాళయం సమీపంలోని కావేరి నదిలోకి విసిరినట్లు లక్ష్మణన్ తెలిపాడు. దీంతో పోలీసులు, చిన్నారి తల్లిదండ్రులు కావేరి నది ఒడ్డున వెతికారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం వెల్లాలపాళయం సమీపంలోని కావేరి నది ఒడ్డున బాగుడై అరటి తోట దగ్గర శివకార్తికేయన్ అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. చిన్నారికి ప్రథమ చికిత్స అందించారు. బిడ్డను కిడ్నాప్ చేసి, కావేరి నది ఒడ్డున పడవేసిన వ్యక్తిని అరెస్టు చేశారు.

దేవదాయశాఖ నిర్ణయంపై ఆందోళన

వేలూరు: వేలూరు జిల్లా కాట్పాడి తాలుకా పుదూరు గ్రామంలో మురుగన్ ఆలయం ఉంది. గ్రామస్తులతో నడుస్తున్న ఈ ఆలయాన్ని దేవదాయశాఖ స్వాధీనం చేసుకోనున్నట్లు అధికారులు గ్రామంలో ప్రకటించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు హిందూ మున్నని నాయకులతో కలిసి వేలూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ముందుగా సత్‌వచ్చారి జాతీయ రహదారి నుంచి ర్యాలీగా కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. గ్రామస్తులను సంప్రదించకుండానే దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకునేలా చేస్తున్న ప్రయత్నాన్ని విరమించుకోవాలని కోరారు. గ్రామస్తులతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని, ఆలయ హుండీ కానుకలను ఆలయ అభివృద్ధికి ఉపయోగించేలా విధంగా చేయాలని కోరారు. అనంతరం దేవదాయశాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

అళగు ముత్తుకోన్ గురుపూజోత్సవం

తిరుత్తణి: భారత స్వాతంత్ర్య తొలి సమరయోధుడు అళగు ముత్తుకోన్ 266వ గురుపూజోత్సవం తిరుత్తణిలో కోలాహలంగా నిర్వహించారు. యాదవ మహాసంఘం వ్యవస్థాపకుడు దేవనాథన్ యాదవ్ ఆదేశాల మేరకు తిరుత్తణిలో అళగు ముత్తుకోన్ గురుపూజోత్సవాన్ని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకే.సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ సంఖ్యలో యాదవులు లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వీధి నుంచి పాల బిందెలతో ఊరేగింపుగా అరక్కోణం జంక్షన్ వద్దకు చేరుకుని ముత్తుకోన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నివాళులర్పించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో యదవ మహాసభ తిరువళ్లూరు జిల్లా అధ్యక్షుడు గజేంద్రన్ యాదవ్, మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, పళ్లిపట్టు అంకయ్య మండడి, న్యాయవాదులు భాస్కర్, రాజేశ్వరబాబు, ఎస్.అగ్రహారం సర్పంచ్ ఎల్.నారాయణన్, యూనియన్ కౌన్సిలర్ కలైసెల్వి ఏలుమలై, శ్రీరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శిగా ఒమర్ జలీల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ కార్యదర్శి, కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి సయ్యద్ ఒమర్ జలీల్‌ను రాష్ట్ర ప్రభుత్వం పునర్నియమించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గరిష్టంగా రెండేళ్ల వరకు లేదా తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొంది. మైనారిటీల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్‌ను కార్మిక శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఆయనకు ఉపాధి కల్పన, శిక్షణ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది.

వ్యవసాయంలో అసమానతలు రూపుమాపేలా..

సీజీఐఏఆర్, మేనేజ్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా వ్యవసాయ రంగంలో స్త్రీ పురుష అసమానతలను రూపుమాపేందుకు ది కన్సార్టియం ఆఫ్ ఇంటర్నేషనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సెంటర్స్ (సీజీఐఏఆర్), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లు ముందుకొచ్చాయి. ఈ మేరకు సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫారమ్, మేనేజ్‌లు హైదరాబాద్‌లో మంగళవారం ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ అంతరాన్ని రూపుమాపేందుకు అవసరమైన అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశాయి. హైదరాబాద్‌లోని మేనేజ్‌లో జరిగిన కార్యక్రమంలో సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫారమ్ డైరెక్టర్ డాక్టర్ నికోలిన్ డి హాన్, మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. లింగ సమానత్వాన్ని మెరుగుపరచడానికి, వ్యవసాయరంగంలో యువతకు అవకాశాలను కల్పించడానికి కృషి చేయడం తోపాటు మహిళా రైతులతో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తారు. మేనేజ్‌తో ఒప్పందం చేసుకోవడం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద వ్యవసాయ విస్తరణ వ్యవస్థలో నిమగ్నం కావడానికి తోడ్పడుతుందని సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫారమ్ డైరెక్టర్ నికోలిన్ డి హాన్ అన్నారు. వ్యవసాయంలో స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని మేనేజ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీజీఐఏఆర్ జెండర్ ఇంపాక్ట్ ప్లాట్‌ఫారమ్ వచ్చే అక్టోబర్‌లో ఢిల్లీలో వ్యవసాయంలో అంతర్జాతీయ స్త్రీ పురుష అసమానతపై సమావేశాన్ని ఏర్పాటు చేస్తోంది.

ఎమ్మెల్యే టికెట్‌ను తిరస్కరించా: జాజుల



ఆదిలాబాద్ రూరల్: 'గతంలో ఓ పార్టీ నాకు అంబర్‌పేట్ నుంచి ఎమ్మెల్యే టికెట్ ఇస్తానంటే.. అది నా కాలి గోటితో సమానమని చెప్పి తిరస్కరించాను'అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీసీలు తలదించుకునే మేకల్లాగాక గర్జించే సింహాలుగా మారాలని, పదవులు ఆశించే స్థాయి నుంచి రాజకీయాలను శాసించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బీసీల రాజకీయ ప్లీనరీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా రిమ్స్ ఆసుపత్రి ఎదుట ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటైనా బీసీలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధు మాదిరిగా బీసీబంధు రూ.10 లక్షలు ఇవ్వాలని కోరితే.. సీఎం కేసీఆర్ 136 బీసీ కులాల్లోని కొన్ని కులాలకు మాత్రమే రూ.లక్ష వరకు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. సీఎం ఇచ్చే రూ.లక్ష వద్దని, తమకు సీఎం పీఠం ఇస్తే కేసీఆర్‌కు తామే రూ.10 లక్షలు ఇస్తామని తెలిపారు. ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే బీసీల రాజకీయ ప్లీనరీకి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో రావాలని కోరారు.. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కూతురిపై కేసు!

హైకోర్టు ఉత్తర్వులపై జనగామ పోలీసుల స్పందన?

జనగామ: నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాలకు తన కూతురు తుల్జా భవానీరెడ్డి, అల్లుడు రాహుల్‌రెడ్డి అడ్డు తగులుతున్నారని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి వేసిన పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. ఈ మేరకు పిటిషన్‌లో పేర్కొన్న ప్రతివాదులకు షోకాజ్ నోటీసులను జారీ చేసింది. పిటిషన్‌లోని మొదటి ఆరుగురికి (పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులు) అందించిన షోకాజ్ నోటీసులను ప్రభుత్వ న్యాయవాది అందుకోగా, ఎమ్మెల్యే కూతురు, అల్లుడికి రిజిస్టర్ పోస్టు చేశారు. ఎమ్మెల్యే పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకుని, ఆయన అధికారిక కార్యక్రమాలకు విఘాతం కలగకుండా, కూతురు, అల్లుడిపై చర్యలు తీసుకోవాలని జనగామ, చేర్యాల ఎస్‌హెచ్‌వోలను హైకోర్టు ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు ఎమ్మెల్యే కూతురుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా సమాధానం చెప్పలేదు.

కొత్త ట్రిబ్యునల్‌పై మాట నిలబెట్టుకోండి

- కృష్ణా నదీ జలాల వివాదం తేలే వరకు 50:50 నిష్పత్తిలో నీటిని పంచండి
- కాళేశ్వరం మూడో టీఎంసీ సహా సీతారామ, సమ్మక్క బ్యారేజీలను ఆమోదించండి
- కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరిన మంత్రి హరీశ్‌రావు
- ఏపీ చేపడుతున్న పోలవరం ప్రాజెక్టు విస్తరణ పనులు అడ్డుకోవాలని వినతి



ఢిల్లీలో షెకావత్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న హరీశ్‌రావు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా నదీ జలాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల మధ్య పునఃపంపకాలకు సంబంధించి గత అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఇచ్చిన హామీ మేరకు కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను తెలంగాణ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు కోరారు. కృష్ణా జలాల్లో ప్రస్తుతం ఉన్న వాటాలను సవరించి రెండు తెలుగు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిన తాత్కాలిక కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన మంత్రి హరీశ్‌రావు మంగళవారం రాత్రి కేంద్రమంత్రి షెకావత్‌ను కలిశారు. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ భేటీలో కేంద్ర జలశక్తి శాఖ సలహాదారు వెదిరె శ్రీరాం, ఇరిగేషన్ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ కుమార్ కూడా పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి విన్నవించిన అంశాలు ఇలా....

1) తెలంగాణలో గోదావరి బేసిన్‌లోని సీతారామ ఎత్తిపోతల పథకం, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు, కాళేశ్వరం అదనపు టీఎంసీ, డా.బీఆర్ అంబేడ్కర్ వార్ధా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు ఆమోదముద్ర వేయాలి.
2) 2021 గెజిట్ నోటిఫికేషన్ అనంతరం పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి 2022లో తెలంగాణ ప్రభుత్వం డీపీఆర్‌ను అందించింది. సీడబ్ల్యూసీ క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని వినతి.
3) గోదావరి వరద జలాలను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా పోలవరం ప్రాజెక్టులో భాగమైన కుడి, ఎడమ మెయిన్ కాలువలను అనుమతించిన దాని కంటే ఎక్కువగా విస్తరిస్తోంది. కుడి, ఎడమ మెయిన్ కెనాల్ విస్తరణ ద్వారా 493 టీఎంసీల కేటాయింపులకు వ్యతిరేకంగా ఏపీ దాదాపు 1500 టీఎంసీల సామర్థ్యాన్ని సృష్టిస్తోంది. ఇది గోదావరి మిగులు జలాల్లో తెలంగాణ వాటాపై ప్రభావం చూపుతుంది. అంతేగాక ఆమోదం లేని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, వెంకటనగరం ప్రాజెక్టులను ఎడమ కాలువపై, చింతలపూడి ఎత్తిపోతల పథకం (మొదటి దశ - రెండవ దశ), గోదావరి-పెన్నార్ లింక్ వంటి అనేక ప్రాజెక్టులను కుడి కాలువపై నిర్మిస్తోంది. కుడి, ఎడమ కాలువ అక్రమ విస్తరణను, ఈ అనుమతులు లేని అక్రమ ప్రాజెక్టుల నిర్మాణం విషయంలో జోక్యం చేసుకొని నిర్మాణం చేయకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.
4) కృష్ణా జలాల్లో సమానమైన కేటాయింపుల కోసం కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అనేకసార్లు అభ్యర్థించింది. ట్రిబ్యునల్ నిర్ణయం పెండింగ్‌లో ఉన్నందున తెలంగాణ, ఏపీ మధ్య ప్రస్తుత నీటి సంవత్సరం నుంచి ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకునే వరకు నీటి భాగస్వామ్య నిష్పత్తిని 50:50కి సవరించాలి.

ట్రిబ్యునల్‌పై త్వరలోనే నిర్ణయం చేస్తామన్నారు : మంత్రి హరీశ్‌రావు

కేంద్రమంత్రి షెకావత్‌తో భేటీ అనంతరం మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటుపై ఇచ్చిన మాట వాస్తవమేనని కేంద్రమంత్రి వెల్లడించారన్నారు. ఈ అంశంపై అధికారులతో సంప్రదించి నిర్ణయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. వీటితో పాటు ఏపీ చేపట్టిన పోలవరం కుడి, ఎడమ కాలువల అక్రమ విస్తరణ, డెడ్ స్టోరేజీ నుంచి నీటిని తీసుకొనేలా చేపట్టిన పనులతో గోదావరి జలాల్లో రాష్ట్రానికి ఉన్న హక్కులను తెలంగాణ కోల్పోతున్న అంశాన్ని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

కాలు నరికి.. కడియాలు దోచి.. మహిళ దారుణ హత్య

ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

షాద్‌నగర్ రూరల్: కాలు నరికి కడియాలను దోచుకొని ఓ మహిళను దారుణంగా హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ సీఐ ప్రతాప్‌లింగం కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం బంగంపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, గంగమ్మ(40) దంపతులు. బతుకుదెరువుకోసం రెండేళ్ల క్రితం పట్టణానికి వచ్చిన దంపతులు పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో గుడిసె వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. వెంకటయ్య డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంవద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా గంగమ్మ ఇళ్లలో పని చేస్తోంది. కాగా, గంగమ్మ ఈ నెల 8న సొంత ఊరు బంగంపల్లికి వెళుతున్నానని భర్తకు చెప్పి బయలుదేరింది. అదేరోజు గుర్తు తెలియని వ్యక్తులు గంగమ్మ ఒంటిపై ఉన్న నగలకోసం మాయమాటలు చెప్పి పట్టణ శివారు ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ దారుణంగా హత్య చేసి మృతురాలి ఒంటిపై ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలను తీసుకున్నారు. 40 తులాల కాళ్ల వెండి కడియాలు తీసుకునేందుకు ప్రయత్నించగా కడియాలు రాలేదు. దీంతో గంగమ్మ కాలు నరికి కడియాలను దోచుకొని పరారయ్యారు.

అదృశ్యం కేసు నమోదైన రోజే హత్య వెలుగులోకి..

నాలుగు రోజులైనా భార్య తిరిగి రాకపోవడం, ఇంటికి వెళ్లలేదని తెలియడంతో వెంకటయ్య మంగళవారం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా, పట్టణ శివారులోని హాజిపల్లి రోడ్డు సమీపంలోని ముళ్ల పొదల్లో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు 100కు డయల్ చేసి సమాచారాన్ని అందించారు. పోలీసులు వెంకటయ్యను ఘటనా స్థలానికి తీసుకువెళ్లడంతో మృతి చెందిన మహిళ గంగమ్మగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితమే మహిళ దారుణ హత్యకు గురికావడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వచ్చింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు.

నకిలీలను అరికట్టేందుకు సమగ్ర చట్టం రావాలి

రాష్ట్ర వ్యవసాయరంగంలో అద్భుత పురోగతి: మంత్రి నిరంజన్‌రెడ్డి



మొబైల్ వ్యాన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి

ఏజీ వర్సిటీ: వ్యవసాయంలో నకిలీలను అరికట్టేందుకు దేశవ్యాప్తంగా సమగ్ర చట్టం రావాల్సి ఉందని, పెస్టిసైడ్స్, బయోపెస్టిసైడ్స్ నాణ్యతా ప్రమాణాలు గుర్తించడానికి రాష్ట్రంలో ఓ వ్యవస్థ తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రో కెమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'నాణ్యమైన దిగుబడి, రైతుల ఆదాయాన్ని పెంచడానికి నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల పాత్ర' అనే అంశంపై వర్సిటీ విద్యాసంస్థ రూపొందించిన 10 మొబైల్ వ్యాన్‌లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వ్యవసాయ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించామని ఆయన చెప్పారు. గ్రామాలలో రైతు వేదిక కేంద్రాలు, నీటిపారుదల సౌకర్యాల విస్తరణ, చెరువుల పునరుద్ధరణతో వ్యవసాయంలో గణనీయమైన పెరుగుదల సాధ్యపడిందని, రైతుల సంపాదన కూడా పెరిగిందన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన ఈ మొబైల్ వ్యాన్‌లు రైతులకు కీలకమైన సమాచారాన్ని అందజేస్తాయని అన్నారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా అభివృద్ధి చెందుతోందని, రైస్ మిల్లింగ్‌లో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం ఆధునిక రైస్ మిల్లులను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతు, పరిశోధన సంచాలకులు రఘురామిరెడ్డి, ఏసీఎఫ్ఐ సెక్రటరీ డాక్టర్ కళ్యాణ్ గోస్వామి, ఐసీఎఫ్ఐ చైర్మన్ ఆర్‌జీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో బంగారు మైసమ్మ బోనాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసన సభ ప్రాంగణంలో మంగళవారం బంగారు మైసమ్మ బోనాల పండుగ ఘనంగా జరిగింది. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పండుగకు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రం పచ్చగా ఉండాలని, రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. కేసీఆర్‌ని మూడోసారి కూడా ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మండలిలో ప్రభుత్వ విప్ ఎంఎస్ ప్రభాకర్‌రావు, ఎమ్మెల్యేలు పద్మా దేవేందర్‌రెడ్డి, రేఖా నాయక్, కె.ప్రభాకర్‌రెడ్డి, కాలె యాదయ్య, సుంకే రవిశంకర్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, వాణీదేవి, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులు, బీఆర్ఎస్ ఎల్పీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, ఉభయ సభల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందించిన ఫైర్ సిబ్బందికి పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలందించిన అగ్నిమాపక శాఖ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వ అవార్డులు దక్కాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఇస్తున్న పోలీస్ సేవాపతకాల్లో భాగంగా శౌర్యపతకం, మహోన్నత సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, కఠినసేవా పతకం, సేవా పతకం కేటగిరీల్లో ఉత్తమ పనితీరు ప్రదర్శించిన సిబ్బంది జాబితాను రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్ విడుదల చేశారు. డెక్కన్ మాల్‌లో అగ్నిప్రమాద సమయంలో ధైర్యసాహసాలతో పనిచేసిన ఫైర్ సిబ్బందిలో హైదరాబాద్ రీజినల్ ఫైర్ ఆఫీసర్ వి.పాపయ్య, సికింద్రాబాద్ ఫైర్‌స్టేషన్ లీడింగ్ ఫైర్‌మేన్ కె.సత్యనారాయణ, డ్రైవర్ ఆపరేటర్లు జె.నర్సింగ్‌రావు, పి.శ్రీధర్‌కు శౌర్యపతకాలు దక్కాయి. కాగా, పోలీస్ శాఖలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బందికి సైతం అవార్డులు దక్కాయి. అయితే ఆ జాబితాను వెల్లడించలేదు.

థాంక్యూ సీఎం గారూ..

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్‌కు సంజయ్ ధన్యవాదాలు

సాక్షి, హైదరాబాద్: తన పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ బండి సంజయ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం సంజయ్ ట్వీట్ చేశారు. సంజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ సీఎం లేఖ పంపించారు. ప్రజా సంక్షేమానికి శ్రమిస్తున్న సంజయ్ ఆయురారోగ్యాలతో నిండునూరేళ్లు ప్రజలకు సేవలు అందించాలని మనస్ఫూర్తిగా భగవంతుడిని కోరుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు.

ఆ స్కీములన్నీ స్కాములే: వైఎస్ షర్మిల

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ పాలనలో స్కామ్ లేని స్కీమ్‌లేదని వైఎస్సార్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. 'ప్రజల సొమ్ము దోచుకో.. ఫామ్ హౌస్‌లో దాచుకో..'ఇదే కేసీఆర్ పాలనా సిద్ధాంతమని పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ మేనిఫెస్టోకు విలువ లేదు.. వాగ్దానానికి దిక్కులేదు'అని ఆరోపించారు. 'మస్త్ చెప్తం తియ్'ఇదే కేసీఆర్ హామీల సారాంశమని అన్నారు. మంగళవారం ట్విట్టర్ వేదికగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ఆమె ప్రపంచ జనాభా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మంచి చేస్తారని నమ్మి, అధికారమిస్తే.. 10 ఏళ్ల పాలనలో కనీ సం 10 పథకాలు కూడా అమలు చేయని కేసీఆర్ దేశానికి దార్శనికుడట అని ఎద్దేవా చేశారు. 'సున్నా వడ్డీ పేరిట 60 లక్షల మంది మహిళలను మోసం చేశారు.. రూ.లక్ష రుణమాఫీ చేస్తామని 30 లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టారు.. కేజీ టు పీజీ అని చెప్పి 2 వేల సర్కారీ బడులనే బంద్ చేశారు.రూ.5 వేల రైతు బంధు చూపించి, రూ.35 వేల సబ్సిడీ పథకాలను ఆపారు' అని ఆరోపించారు.

బీఆర్ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలోకి మహారాష్ట్ర నుంచి చేరికలు కొనసాగుతున్నాయి. మంగళవారం మహారాష్ట్రలోని వేర్వేరు పార్టీలకు చెందిన నేతలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. అధినేత వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో చంద్రపూర్ జిల్లా సీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్, జిల్లా సహకార బోర్డ్ ఉపాధ్యక్షుడు, ఎన్సీపీ వరోరా పూర్వ అధ్యక్షుడు వసంత్ మరోట్‌రావ్ విధాతే, దివంగత మాజీ మంత్రి వామన్‌రావు గదంవార్ సోదరుడు, చంద్రపూర్ జెడ్పీ సభ్యులు సతీశ్ గదంవార్, ఆమ్‌ఆద్మీ పార్టీ మాజీనేత ఆశీష్ ఘూమే, చంద్రపూర్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల నేత అమిత్ దేవ్ రావ్ కంకే, భద్రావతి నగర్ పరిషత్ సేవక్ రాహూల్ సొంటక్కె తదితరులున్నారు. చేరికల కార్యక్రమంలో బాల్క సుమన్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అధిక పెన్షన్ గడువు

- మరికొంత సమయం ఇవ్వాలని చందాదారులు, యాజమాన్యాల వినతి
- పలుమార్లు పొడిగింపు నేపథ్యంలో మరో అవకాశం లేదన్న ఈపీఎఫ్ఓ

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్‌కు సంబంధించి ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) తలపెట్టిన జాయింట్ ఆప్షన్ నమోదు ప్రక్రియ గడువు ముగిసింది. ఇప్పటికే పలుమార్లు గడువును పొడిగిస్తూ... దాదాపు నాలుగున్నర నెలల పాటు కొనసాగిన అధిక పెన్షన్ ఆప్షన్ ప్రక్రియకు ఈనెల 11వ తేదీ అర్ధరాత్రితో తెరపడింది. దేశవ్యాప్తంగా దాదాపు 19 లక్షల మంది అధిక పెన్షన్ కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చినట్లు ఈపీఎఫ్ఓ అధికారుల అంచనా. వీటికి సంబంధించిన పూర్తి గణాంకాలను ఈపీఎఫ్ఓ ఇంకా వెల్లడించలేదు. కాగా, గడువు ఇంకా పొడిగించాలంటూ చందాదారులు, యాజమాన్యాలు ఈపీఎఫ్ఓను కోరినప్పటికీ.. పొడిగింపుపై ఈపీఎఫ్ఓ ఎలాంటి ప్రకటన చేయలేదు.

అంతా గందరగోళం..: ఈపీఎఫ్ఓ తలపెట్టిన అధిక పెన్షన్ విధానంపై గందరగోళం చందాదారులను వీడలేదు. ఎంప్లాయీ పెన్షన్ పథకంలో భాగంగా అమలు చేయనున్న అధిక పెన్షన్ ఆప్షన్ చందాదారులందరికీ ఆసక్తి కలిగించింది. 2014 కంటే ముందు సర్వీసులో చేరి ఈపీఎస్ పథకం పరిధిలో ఉన్నవారికి మాత్రమే ఈ అధిక పెన్షన్ వర్తిస్తుంది. అయితే.. అధిక పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునే క్రమంలో నిబంధనలన్నీ ఈపీఎఫ్ఓ కోడ్ భాషలో పేర్కొంటూ ఇచ్చిన సర్క్యులర్లు చందాదారుల దిమ్మతిరిగేలా చేశాయి. ఈ నిబంధనలపై అవగాహన కలిగించడంలో ఈపీఎఫ్ఓ అధికారులు విఫలమయ్యారనే వాదనలొచ్చాయి. ఈపీఎఫ్ఓ కార్యాలయానికి ఎన్నిసార్లు వెళ్లినా దీనిపై సరైన సమాచారం ఇవ్వలేదంటూ చందాదారులు మండిపడ్డ దాఖలాలు అనేకం. దీంతో చాలామంది ఆప్షన్ ఇవ్వడానికి వేచిచూశారు. మరికొందరు ఆప్షన్ ఇవ్వడానికి వెబ్ లింకు తెరిస్తే.. అప్‌లోడ్ చేయాల్సిన డాక్యుమెంట్లు, వివరాలను చూసి జడుసుకునే పరిస్థితి వచ్చింది. యాజమాన్యాలు సైతం ఉద్యోగులకు ఎలాంటి సూచనలు చేయలేదనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఈపీఎఫ్ఓ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖల్లాలేవు. దీంతో గడువు తేదీ పొడిగింపు కోసం ఈపీఎఫ్ఓకు వినతులు వెల్లువెత్తాయి. కానీ ఇప్పటికే పలుమార్లు అవకాశం కల్పించామంటున్న అధికారులు... ఇక గడువును పొడిగించే అవకాశం లేదని సంకేతాలిచ్చారు.

నిల్వచేసిన సిలిండర్లతోనే ప్రమాదాలు!

- గడువు ముగిసిన సిలిండర్లను తిరస్కరించాలి..
- లేకుంటే ప్రమాదాలకు ఆస్కారం
- ఎప్పటికప్పుడు సిలిండర్ల పరిశీలన తప్పనిసరి



సాక్షి, హైదరాబాద్: గ్యాస్ సిలిండర్ పేలుడు.. సిలిండర్ లీకై అగ్ని ప్రమాదం వంటి ఘటనలు నిత్యం వినిపించడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో ప్రధానంగా నిల్వ చేసిన సిలిండర్లతోనే అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కేవలం అవగాహన లోపం..నిర్లక్ష్యం ఈ ప్రమాదాలకు కారణంగా చెబుతున్నారు. చిన్న చిన్న జాగ్రత్తలు, గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా వ్యవహరించడం వంటి వాటితో పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

నిండా నిర్లక్ష్యమే...

ఎల్పీజీ సిలిండర్ల విషయంలో కొన్ని చమురు సంస్థలు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగదారులకు అంటగడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయి. వినియోగంలో దెబ్బతిన్న సిలిండర్లను మార్చడం లేదా, వాటికి మరమ్మతులు చేయడంలో కంపెనీలు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలు వినవస్తున్నాయి. సిలిండర్ల కాల పరిమితి పూర్తి కాగానే వాటిని రీ-క్యాలిబ్రేషన్ పరీక్షకు పంపాల్సి ఉంటుంది.

మూడు దశల్లో...

గ్యాస్ సిలిండర్ల నాణ్యతకు సంబంధించి నిర్వహించే రీ-క్యాలిబ్రేషన్ పరీక్ష మూడు దశల్లో ఉంటుంది. ముందుగా విజువల్ తనిఖీ చేస్తారు. ఇందులో సిలిండర్ పనికి రాదని తేలితే దాన్ని ధ్వంసం చేయాల్సి ఉంటుంది. లేకపోతే హైడ్రాలిక్ పరీక్షలకు పంపుతారు. అక్కడ సిలిండర్లలో నీటిని నింపి ఐదుసార్లు ప్రెషర్ ద్వారా లీకేజీలను గుర్తిస్తారు. ఆ తర్వాత వాల్వు పరిస్థితిని గమనించి మరోసారి ప్రెషర్ పరీక్ష చేస్తారు. సిలిండర్లలో గాలి నింపి ఒత్తిడిని పెంచుతారు. అన్ని పరీక్షల్లో సిలిండర్ మంచిదని తేలితే దానిని ప్రజా వినియోగానికి అనుమతిస్తారు. అంతా ఓకే అనుకుంటేనే దానిని మరో ఐదు సంవత్సరాల పాటు వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

కాలపరిమితి ఇలా...

సిలిండర్‌పై ఉన్న రింగ్ కింది భాగంలో మూడు ఇనుప పట్టీలు ఉంటాయి. వాటిలో ఒక దానిపై లోపలి వైపు సిలిండర్ గడువు తేదీ ముద్రించి ఉంటుంది. అయితే సిలిండర్‌కు వేసి ఉన్న అంకెలు, తేదీలను చాలా మంది పెద్దగా పట్టించుకోరు. కానీ రింగు కింద భాగంలో లోపలి వైపు ముద్రించి ఉన్న తేదీలో 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ప్రతి మూడు నెలలకు ఒక ఆంగ్ల అక్షరం చొప్పున రాసి ఉంటుంది. సంవత్సరంలో నాలుగు భాగాలుగా విభజించి వాటికి ఆంగ్ల భాషల్లోని మొదటి నాలుగు అక్షరాలు ఏ,బీ,సీ,డీగా వేస్తారు. అందులో ఏ అక్షరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ అక్షరం ఏప్రిల్, మే, జూన్‌నెలలకు, సీ అక్షరం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు, డీ అక్షరం అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలను సూచిస్తాయి. సిలిండర్ పై ఏ,బీ,సీ, డీ కేటగిరీల వారీగా కాలపరిమితి తేదీలు ఉంటాయి. ఆ నెల ఆధారంగా సిలిండర్ గడువు ముగిసిందని గుర్తించాలి. గ్యాస్ సిలిండర్‌ను ఎప్పటికప్పుడు వినియోగిస్తే నాణ్యమైన గ్యాస్ అందడంతో పాటు ప్రమాదం జరిగే అవకాశం ఉండదు.

జీవిత కాలం ఏడేళ్లు..

ఖాళీ సిలిండర్లకూ కాల పరిమితి ఏడేళ్లుగా ఉంటుంది. అయితే ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని గ్యాస్ నంబర్ల ప్రకారం ఏడేండ్లు దాటిన సిలిండర్లను డీలర్ల నుంచి వెనక్కి తెప్పించుకుని పరీక్షిస్తారు. ఏ మాత్రం వినియోగ యోగ్యం కాని, నాణ్యత లేని సిలిండర్లను తయారీదారులు పక్కనపెడతారు. కొందరు సిలిండర్లను కొనుగోలు చేసిన తర్వాత నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. ఇది కూడా మంచిది కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వినియోగదారులు అవసరాన్ని బట్టి గ్యాస్‌ను బుక్‌చేసుకని వారం కంటే ఎక్కువ నిల్వలేకుండా చూసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆర్టీఐ అస్త్రం!

- రాష్ట్రంలో దూకుడు పెంచుతున్న కాషాయదళం
- పార్టీ నేతలు, కేడర్‌లో ఉత్సాహం నింపే దిశగా వ్యూహం
- ఆర్టీఐ ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆస్తుల వివరాల సేకరణకు నిర్ణయం
- 2018 ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తులపైనా దృష్టి
- ప్రజలకు వివరించడం ద్వారా పార్టీకి మద్దతు కూడగట్టే యత్నం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో కాషాయదళం దూకుడు పెంచుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడంలో భాగంగా రాష్ట్ర నాయకులు, కేడర్‌లో పూర్తి ఉత్సాహాన్ని, చైతన్యాన్ని నింపే చర్యలు చేపడుతోంది. వచ్చే మూడు, నాలుగు నెలలు యావత్ పార్టీ యంత్రాంగం పూర్తిగా ఎన్నికల యుద్ధంలో నిమగ్నమయ్యేలా వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికలకు తుదిరూపునిస్తోంది. ఇందులో భాగంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలను సేకరించి..గతంలో వారికి ఎన్ని ఆస్తులుండేవి, ఇప్పుడు ఎంత ఉన్నాయనే వివరాలు, ఇతర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించింది. 2018 ఎన్నికలకు ముందు ఈసీకి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో పొందుపరిచిన ఆస్తులు, ఇప్పుడున్న ఆస్తుల వివరాలు కూడా ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. తద్వారా క్షేత్రస్థాయి నుంచి పార్టీకి మద్దతు కూడగట్టాలని భావిస్తోంది. సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం మంగళవారం కూడా కొనసాగింది. మంగళవారం నాటి భేటీలో ఎంపీలు డా.కె.లక్ష్మణ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, పార్టీ నేతలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఇంద్రసేనారెడ్డి, పొంగులేటి సుధాకరరెడ్డి, అర్వింద్ మీనన్,, ఏపీ జితేందర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ముఖ్య నేతలు కూడా పాల్గొన్నారు. పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాబోయే వందరోజుల్లో పార్టీ చేపట్టబోయే కార్యాచరణను ఖరారు చేశారు.

మరింత జోష్ నింపేలా..

గత శనివారం వరంగల్‌లో జరిగిన బహిరంగ సభలో కేసీఆర్ సర్కార్‌పై ప్రధాని మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు సంధించారు. ఆ మరునాడే 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల భేటీకి వచ్చిన సందర్భంగా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఇదే క్రమంలో పార్టీలో మరింత జోష్‌ను నింపేందుకు ఈ నెల 29న ఖమ్మం పట్టణంలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సభ నిర్వహణకు పార్టీ సిద్ధమౌతున్నట్టు సమాచారం. గత నెలలో ఖమ్మంలో జరగాల్సిన అమిత్‌షా సభ వాయిదా పడడంతో తాజాగా మరో తేదీని జాతీయ నాయకత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అమిత్‌షా పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఒకటి, రెండురోజుల్లోనే ఖరారు కానున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇక రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలుగా వివిధ రాష్ట్రాలకు చెందిన 119 మంది బీజేపీ ఎమ్మెల్యేలు రానున్నారు. ఆగస్టు 16 నుంచి వారం రోజుల పాటు వారికి కేటాయించిన నియోజక వర్గాల్లోనే మకాం వేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులు, సమస్యలు పరిశీలించనున్నారు.

మోదీ విజయాలపై హోర్డింగులు!

వంద రోజుల కార్యాచరణలో భాగంగా రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై...ముఖ్యంగా డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు రుణ మాఫీ, ధరణి సమస్యలు వంటి వాటిపై ప్రజల ముందుకు వెళ్లాలని రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. ప్రతిరోజూ రాష్ట్రంలోని దళితవాడలు, బస్తీల్లో పర్యటించడం ద్వారా తొమ్మిదేళ్లలో వివిధ రంగాల్లో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించడంతో పాటు, కేసీఆర్ సర్కార్ వైఫల్యాలను, హామీలు నిలబెట్టుకోకపోవడాన్ని ఎండగట్టాలని నిర్ణయించింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటి ద్వారా ప్రజలకు చేకూరిన ప్రయోజనాలను వివరిస్తూ రాష్ట్రంలో పలుచోట్ల హోర్డింగ్‌లు పెట్టాలని నిర్ణయించినట్టు పార్టీ నేతల సమాచారం. దీంతో పాటు వచ్చేనెల 15వ తేదీలోగా మరో 85 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహించనున్నారు. ఇప్పటికే 17 స్థానాల్లో సభలు నిర్వహించారు.

షాడో సీఎంలా కేటీఆర్: కిషన్‌రెడ్డి

తెలంగాణలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీనే అనే విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పార్టీ పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీఆర్ఎస్‌పై పోరాటానికి హైకమాండ్ పలు మార్గదర్శకాలు ఇచ్చింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు నేతలంతా శ్రమించాలి. అందరూ బాధ్యతగా వ్యవహరించాలి. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించింది బీఆర్ఎస్‌పై పోరాటానికే..' అని చెప్పారు. బీజేపీపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న విమర్శలను నేతలంతా దీటుగా ఎదుర్కోవాలని సూచించారు. 'రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో అవినీతికి పాల్పడింది. బీఆర్ఎస్ పార్టీ వేల కోట్లు దోచుకుంది. ప్రజాధనాన్ని మొత్తం దుర్వినియోగం చేస్తున్నారు. ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేస్తున్నారు.

* నిఖిల గోవతి పరిశోధనను సేవబాట పట్టించింది

డిగ్రీలు చేసి, ఉద్యోగాలు చూసుకొని స్థిరపడిపోవడం గురించి ఆలోచిస్తుంటారు చాలా మంది. తమ చదువు పేదలకు ఉపయోగపడితే ఎంతో మేలు అని ఆశిస్తుంటారు కొంతమంది. అలాంటి కోవకి చెందుతుంది కర్పూరం గోవతి నిఖిల. సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో ఉండే నిఖిల గుర్గావ్ మేదాంత ది మెడిసిటీ హాస్పిటల్‌లో డిస్‌ఫేజియా స్పెషలిస్ట్‌గా పరిశోధనలు చేస్తోంది. గోవతి పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు 5వేల మంది పేదవారికి కంటి, గుండె, క్యాన్సర్ చికిత్సలలో సహాయసహకారాలు అందించింది. ఈ యేడాది యంగెస్ట్ రీసెర్చర్ ఇన్ డిస్‌ఫేజియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, భారత్ గౌరవరత్న, శ్రీ సమ్మాన్ కౌన్సిల్ అవార్డులు పొందింది. ఈ సందర్భంగా మాట్లాడినప్పుడు ఎన్నో విషయాలను ఇలా పంచుకుంది.

''తెలియని తపన నన్ను ఓ కొత్త మార్గంవైపు నడిపించింది. పరిశోధనల వైపుగా అడుగులు వేయించింది. ఈ మూడేళ్లలో 5 వేల మందికి సాయం చేసేలా మార్చింది. బీఎస్సీ ఆడియాలజీ పూర్తయ్యాక ఎమ్మెస్సీలో చేరాను. ఫైనల్ ఇయర్ ఎగ్జామ్ పూర్తవగానే మేదాంత హాస్పిటల్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది తమ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరమని. కాలేజీలో కండక్ట్ చేసిన ఎగ్జామ్స్ నుంచి వచ్చిన అవకాశమని తెలిసి చాలా ఆనందించాను.

పరిశోధనలో..

అనేక ఆరోగ్య సమస్యలలో ముఖ్యంగా నిమోనియా, గుండెకు సంబంధించిన చికిత్సలు జరిగినప్పుడు కొన్నాళ్ల వరకు ఆహారాన్ని మింగడంలో కలిగే ఇబ్బందుల కారణంగా మరణాల రేటు పెరుగుతోందని మా పరిశోధనలో తేలింది. న్యూరో పేషంట్స్‌లో 80 శాతం డిస్‌ఫేజియా సమస్య ఉంటుంది. ఆహారాన్ని మింగే పద్ధతిలో తేడా ఉంటే ఆ ఆహారం నేరుగా లంగ్స్‌లోకి చేరి, ప్రమాదం కలుగుతుంది. అందుకని ఈ పేషెంట్స్‌కు, వీళ్లను చూసుకునేవారికి ఏ విధంగా ఆహారాన్ని తీసుకోవాలనే విషయాల మీద గైడెన్స్ ఇస్తుంటాను. ఈ వైపుగా మన దగ్గర ఇంకా ఆలోచన పెరగలేదు. అమెరికాలో ఈ విషయాలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. దీంతో ఈ విభాగంలో నాకు ఆసక్తి కలిగింది. లోతుగా పరిశోధనలు చేయడం మొదలు పెట్టాను. నాకు అడ్వైజ్ చేసే డాక్టర్లు, ప్రొఫెసర్ల సలహాలు మరెన్నో విషయాలను పరిచయం చేసింది. ఢిల్లీ సమీపంలోని హాస్పిటల్ కావడంతో వచ్చే పేషెంట్స్ సంఖ్య కూడా ఎక్కువే. ప్రతి ఒక్క పేషెంట్ నుంచి వారి ఆరోగ్యసమస్యల ద్వారా తెలుసుకునే విషయాలు ఎన్నో ఉంటాయి. అలా నా పరిశోధనకు సంబంధించి 31 ఆర్టికల్స్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. జైపూర్, రాజస్థాన్, యూపీ నుంచి వచ్చే స్టూడెంట్స్‌కు సెషన్స్ కండక్ట్ చేస్తుంటాను.

కరోనా నుంచి..

అవసరమైన వారికి సాధ్యమైనంత వరకు నా స్నేహబృందంతో సాయం అందిస్తూ వచ్చాను. అప్పటి నుంచి కంటి, గుండె చికిత్సలు, నిమోనియా, పార్కిన్‌సన్స్, నీ రీప్లేస్‌మెంట్, న్యూరో డిజార్డర్స్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి డాక్టర్లతో మాట్లాడి ఫీజు తగ్గింపులో సాయం చేస్తుండేదాన్ని. కోవిడ్ పేషెంట్స్‌పైన రీసెర్చ్ చేసినప్పుడు మరణాలు పెరగడానికి అందరికీ ఒకే విధమైన చికిత్స అందించడం సరికాదని తెలుసుకున్నాను. ప్రతి ఒక్కరూ భిన్నంగా చికిత్స చేయాలనే అంశాల మీద చేసిన రీసెర్చ్ పేపర్స్‌కి మంచి ప్రశంసలు అందాయి. ఈ సమయంలోనే ఫౌండేషన్‌గా సేవలను ఒక గ్రూప్‌కిందకు తీసుకురావాలనిపించింది. అందుకు, మా ప్రొఫెసర్లు, కుటుంబసభ్యుల సపోర్ట్ ఉంది.

అభ్యర్థన మేరకు

ప్రభుత్వ, కార్పొరేట్ హాస్పిటల్స్‌లోని డాక్టర్స్ నెట్‌వర్క్ నుంచి పరిచయాలు ఉన్నాయి. వారిని అభ్యర్థించి పేదవాళ్లలో ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు సూచించడం, వారి చేత హెల్త్ క్యాంపులు నిర్వహించడం చేస్తుంటాను. ఏయే సమయాల్లో క్యాంపులను నిర్వహించాలో ముందే ప్లానింగ్ ఉంటుంది కాబట్టి, దానిని అనుసరించి డాక్టర్లను అభ్యర్థిస్తుంటాను. మా నాన్న హరిరాజ్ కుమార్ రేషన్ షాప్ నిర్వహిస్తుంటారు. అక్కడకు వచ్చేవాళ్లలో దాదాపు పేదవాళ్లే ఉంటారు. వాళ్లకు అవసరమయ్యేలా క్యాంపులు నిర్వహించాను. నోటి మాట ద్వారా సాయం చేస్తూ వెళ్లడమే. దీని కోసం నేనేమీ డబ్బులు ఖర్చు పెట్టడం లేదు. ఎవరి నుంచీ సాయం తీసుకోవడం లేదు. నాకున్న నెట్‌వర్క్ ద్వారా నోటి మాట ద్వారా సాయం చేయడం ప్రస్తుతం చేస్తున్న పని. మెడిసిన్స్ అవసరం ఉన్న పేషెంట్స్‌కు జెనెరిక్ మెడిసిన్ ద్వారా సర్వీస్ చేయడం, నర్సుల సాయం తీసుకోవడం వంటివీ జరుగుతుంటాయి. నా టీమ్‌లో అందరూ స్వచ్ఛందంగా సేవ చేసేవారే. ఇంటి వద్ద ఉన్నప్పుడే కాదు గుర్గావ్‌లో ఉన్నా ఫోన్ కాల్ ద్వారా అవసరమైన వారికి అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తుంటాను'' అని వివరించింది నిఖిల.

– నిర్మలారెడ్డి

ఒప్పించి.. మెప్పించాను..

అమ్మనాన్నలు ఇంజనీరింగ్ చేసి త్వరగా స్థిరపడిపోతే చాలు అనుకునేవారు. కానీ, అనుకోకుండా మెడికల్ వైపుగా వచ్చాను. ఎమ్మెస్సీ తర్వాత గుర్గావ్‌లో ఇంటర్వ్యూ ఉందనే విషయం కూడా ఇంట్లో చెప్పలేదు. వద్దంటారు అనే ఆలోచనతో. అమ్మమ్మతో కలిసి ఢిల్లీ టూర్ వెళతాను అని ఒప్పించి వెళ్లాను. అక్కడ మెదంతాలో సీట్ వచ్చాక అప్పుడు విషయాన్ని చెప్పాను. నాకున్న ఆసక్తిని చూసి అమ్మనాన్నలు సరే అన్నారు. కూతురు అంత దూరంలో ఎలా ఉంటుందో అనే బెంగ వాళ్లను ఒప్పుకోనివ్వదని ఆ పని చేశాను. ఇప్పుడు నేను చేస్తున్న రీసెర్చ్‌కి, సర్వీస్‌కు అందరూ చాలా సంతోషంగా ఉన్నారు. నాకు ఇంత మంచి గుర్తింపు రావడం గర్వంగా భావిస్తుంటారు.

– డా.కర్పూరం గోవతి నిఖిల



● నిఖిల గోవతి

కుంగుబాటు కుండతో మాయం

ఏదైనా సమస్య ఎదురైతే చాలామంది దాని నుంచి దూరంగా పారిపోవడానికి చూస్తారు. కొంతమంది మాత్రం సమస్యను అధిగమించేందుకు రకరకాల మార్గాలు వెదుకుతారు. అలా వెతికిన వారికి .. పరిష్కారం తప్పకుండా దొరుకుతుందని చెబుతోంది సైమాషఫీ. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు సైమా చేసిన ప్రయత్నం నేడు మరికొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు, కనుమరుగైపోతున్న కళకు జీవం పోస్తోంది.

కశ్మీర్‌కు చెందిన 33 ఏళ్ల సైమాషఫీ జమ్ము అండ్ కశ్మీర్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. ఎందుకో తనకి తెలియకుండానే మనసులో నిరాశా నిస్పృహలు అలుముకున్నాయి. వాటి నుంచి ఎలాగైనా బయట పడాలని రకరకాలుగా ప్రయత్నించేది. ఒకరోజు చైనా తత్త్వవేత్త చెప్పిన ''మట్టిని పాత్రగా మలిచినప్పటికీ, మనం ఏం కోరుకుంటామో దానితోనే ఆ పాత్రలోని శూన్యం నిండుతుంది'' అన్న కొటేషన్ గుర్తుకొచ్చింది. దీంతో తన డిప్రెషన్‌ను కుండలో నింపాలని నిర్ణయించుకుంది సైమా.



చిన్నప్పటి నుంచి మట్టి అంటే సైమాకు ఇష్టం. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు.. మట్టితో కుండలేగాక, బొమ్మలు కూడా తయారు చేయాలని నిర్ణయించుకుంది. అనుకున్న వెంటనే మట్టి కుండల తయారీకి పూనుకుంది. కశ్మీరి వ్యాలీలో కుండల తయారీ శిక్షణ ఇచ్చేవారు లేరు. పైగా కుండల తయారీ, కుండలకు వేసే రంగులకు సైతం అధునాతన పద్ధతులను జోడించాల్సిన అవసరం ఉందని గుర్తించింది. కుండల తయారీ ఒక కళే కాదు సంప్రదాయంలో భాగం. అది అంతరించకూడదు అనుకుని... కుండల తయారీకి ఎలక్ట్రిక్ చక్రం, గ్యాస్ బట్టీ తీసుకురావాలనుకుంది. కానీ కశ్మీర్‌లోయలో అవి ఎక్కడా దొరకలేదు.

బెంగళూరులో శిక్షణ

కుండల తయారీలో శిక్షణ తీసుకునేందుకు బెంగళూరు వెళ్లింది. అక్కడ కుండల తయారీలో క్రాష్ కోర్సు చేసి వివిధ ఆకారాల్లో కుండలు ఎలా తయారు చేయాలో నేర్చుకోవడంతోపాటు, కశ్మీరీలు వాడే సంప్రదాయ పాత్రల తయారీని సైతం నేర్చుకుని అధునాతన సాంకేతికత జోడించి కుండల తయారీని ప్రారంభించింది. రకరకాల కుండలను తయారు చేసి విక్రయిస్తూనే, మరోపక్క కశ్మీర్ వ్యాప్తంగా ఉన్న కుండల తయారీ కేంద్రాలను సందర్శించి అనుభవం కలిగిన నిపుణులతో వర్క్‌షాపులు నిర్వహించేది. ఇలా కుండల తయారీలో సరికొత్త పద్ధతుల గురించి అవగాహన కల్పిస్తోంది. వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తూ కశ్మీరి కుండలను ఎలా పరిరక్షించుకోవాలో చెబుతోంది. తన కుండల తయారీ జర్నీ గురించి వివరిస్తూ... అందరిలో స్ఫూర్తి నింపుతోంది.

ప్రభుత్వ సహకారంతో..

కశ్మీరీ సనాతన కుండల తయారీని కాపాడుతోన్న విషయం అక్కడి ప్రభుత్వానికి తెలియడంతో స్టేట్ హ్యాండీ క్రాఫ్ట్స్ విభాగం సైమాతో.. తన అనుభవాలను ఇతర కళాకారులకు చెబుతూ సలహాలు సూచనలు ఇప్పిస్తోంది. దీంతో కుండల పునరుద్ధరణకు మంచి స్పందన లభిస్తోంది. అంతేగాక నైపుణ్యం గల కళాకారుల డేటాను హస్తకళల శాఖాధికారులు సేకరిస్తున్నారు. సైమా గురించి తెలిసిన చాలామంది యువతీ యువకులు కుండల తయారీ మొదలు పెట్టి ఉపాధి పొందుతున్నారు.


● సైమా షఫీ

యూత్ పల్స్

థ్రెడ్స్ యువతరం కొత్త చుట్టం



మెటా వారి 'థ్రెడ్స్' ట్విట్టర్-కిల్లర్ అవుతుందా లేదా అనేది తెలియదుగానీ ఈ యాప్‌పై యువత అమిత ఆసక్తి ప్రదర్శిస్తోంది. ట్విట్టర్ కంటే 'థ్రెడ్స్' ఏ రకంగా భిన్నమైనది అనే విశ్లేషణ ఒక కోణం అయితే, కొత్తవాటిపై సహజమైన ఆసక్తి మరో కోణం...

మెటా వారి టెక్ట్స్ ఆధారిత సంభాషణ యాప్ 'థ్రెడ్స్' ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్‌లకు అందుబాటులోకి వచ్చింది. యాప్ మొదలైన రెండు గంటలోనే ఇరవై లక్షల మంది యూజర్‌లు సైనప్ అయ్యారు. నాలుగు గంటలలో ఆ సంఖ్య యాభై లక్షలకు చేరడం చూస్తుంటే థ్రెడ్స్ 'ట్విట్టర్'కు గట్టిపోటీ ఇవ్వనుందనే విషయం అర్థమవుతుంది.

ప్రపంచ వ్యాప్తంగా వందకు పైగా దేశాల్లో అందుబాటులోకి వచ్చిన 'థ్రెడ్స్' డేటా ప్రైవసీ నిబంధనల కారణంగా యూరప్‌లో అందుబాటులోకి రాలేదు.

థ్రెడ్స్‌కు సంబంధించి ఇన్‌స్టాగ్రామ్ యూజర్‌లు తమ యూజర్ నేమ్ కొనసాగించవచ్చు. ఇన్‌స్టాగ్రామ్‌లోని రెడీ-మేడ్ యూజర్ బేస్ వల్ల 'థ్రెడ్స్' ట్విట్టర్‌ని మించిపోతుంది అనే అంచనా ఉంది.

'థ్రెడ్స్‌పై యూత్ ఆసక్తి ప్రదర్శించడానికి కారణం ఏమిటి?' అనే ప్రశ్నకు దేశంలోని వివిధ నగరాలకు చెందిన యువగళాల మాటల్లోనే జవాబు దొరుకుతుంది.

'ట్విట్టర్ ఎలాన్ మస్క్ అధీనంలోకి వచ్చిన తరువాత ప్రయోజనకరమైన మార్పుల కంటే అవసరం లేని మార్పులే ఎక్కువ జరిగాయి. యూజర్‌ల ట్వీట్ల మీద ఆంక్షలు, బ్లూటిక్స్ పై కొత్త రూల్స్... మొదలైనవి చిరాకు తెప్పించాయి' అంటుంది ముంబైకి చెందిన ఎంబీఏ స్టూడెంట్ మనీష.

'థ్రెడ్స్ అనేది ట్విట్టర్‌కు కాపీ-పేస్ట్' అనే విమర్శ మాట ఎలా ఉన్నా 'ట్విట్టర్‌తో పోల్చితే భిన్నంగా ఉంది' అని చెప్పుకోవడానికి కొన్ని అంశాలు ఉన్నాయి.

'జుకర్ బర్గ్ కాపీ-పేస్ట్ విధానాన్ని నమ్ముకొని బాహుబలి లాంటి ట్విట్టర్‌ను ఢీ కొనడానికి రంగంలోకి దిగుతాడని నేను అనుకోవడం లేదు. ట్విట్టర్‌తో పోల్చితే థ్రెడ్స్ కచ్చితంగా భిన్నంగా ఉంటుంది. థ్రెడ్స్‌లో పోస్ట్ చేసే వీడియోల నిడివి అయిదు నిమిషాలు. ట్విట్టర్‌లో అయితే రెండు నిమిషాల ఇరవై సెకండ్లు. థ్రెడ్స్‌లో పోస్ట్ పరిమితి అయిదు వందల. ట్విట్టర్‌లో రెండు వందల ఎనభై. భవిష్యత్తులో మరిన్ని మార్పులు జరగవచ్చు' అంటుంది చెన్నైకి చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ చైత్ర.

'థ్రెడ్స్'లోని వినూత్నమైన ఫీచర్ 'ఫెడివర్స్' యూత్‌కు నచ్చింది. ఆల్టర్‌నేటివ్ మైక్రోబ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ 'మాస్టడన్'లాంటి వాటితో 'థ్రెడ్స్' యూజర్‌లు ఇంటరాక్ట్ కావచ్చు. ఎప్పటికప్పుడు ప్లాట్‌ఫామ్ మైగ్రేషన్‌లో యూత్ చురుగ్గా ఉంటుంది.

'యూనివర్శిటీ ఆఫ్ కొలరాడో బౌండర్'కు చెందిన ప్రొఫెసర్ కేసీ ఫైస్లర్ ఆన్‌లైన్ కమ్యూనిటీని లోతుగా అధ్యయనం చేసిన 'ఇన్‌ఫర్‌మేషన్ సైంటిస్ట్'గా పేరు తెచ్చుకుంది. 'ప్లాట్‌ఫామ్ మైగ్రేషన్స్' గురించి రీసెర్చ్ ప్రాజెక్ట్ చేసింది.

'ప్లాట్‌ఫామ్‌ను ఎందుకు మార్చారు? మార్చడం ద్వారా ఎదురైన సవాళ్లు, అనుభవాలు' అనే అంశంపై యువతరంలో ఎంతోమందితో మాట్లాడింది.

'ఒక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పడిపోయే పరిస్థితుల్లో ఉన్నప్పుడు అందులోని ఆన్‌లైన్ కమ్యూనిటీ తట్టాబుట్టా సర్దుకొని కొత్త ప్లాట్‌ఫామ్‌లోకి వెళుతుంది. మైగ్రేషన్‌కు సంబంధించి తొలి దశలో కొత్త ప్లాట్‌ఫామ్ గురించి ప్రోత్సాహకరంగా మాట్లాడుకుంటారు. ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. అందరి కంటే ముందు తామే ఉండాలనుకునేవారితోపాటు, స్నేహితులు కదిలేవరకు కదలని వారు కూడా ఉంటారు' అంటుంది ఫైస్లర్.

ట్విట్టర్‌తో పోల్చితే హ్యాష్‌ట్యాగ్స్, వెబ్ వెర్షన్, ఎడిట్ పోస్ట్‌లు, డీఎం ఆప్షన్, ఎఐ జనరేటెడ్ ఆల్ట్ టెక్ట్స్, ట్రెండింగ్ టాపిక్స్, క్రోనలాజికల్ ఫీడ్... మొదలైన ఫీచర్స్ 'థ్రెడ్స్'లో లేవు అనే మాట వినిపిస్తోంది. ఎన్నో అంచనాలతో 'థ్రెడ్స్'లోకి వచ్చిన నవతరాన్ని మెటా నిరుత్సాహ పరుస్తుందా? ఒక మీమ్‌లో చూపినట్లు వేగంగా వచ్చిన వాళ్లు అంతే వేగంగా వెళ్లిపోతారా?

'థ్రెడ్స్ ద్వారా జుకర్‌బర్గ్ కచ్చితంగా అద్భుతాలు సృష్టిస్తాడు' అనే ఆశావాదంతో ఎంతకాలమైనా ఎదురుచూసే వాళ్లు ఉంటారా అనేది వేచి చూడాల్సి ఉంది.

ఓహో జిలేబిబాలా!





ట్విట్టర్ వర్సెస్ థ్రెడ్స్ నేపథ్యంలో యువ నెటిజనులు మీమ్స్, జోక్స్ పేలుస్తున్నారు. 'ఎట్ ది రేట్ ఆఫ్' సింబల్‌ని పోలిన 'థ్రెడ్స్' లోగో అచ్చం జిలేబిలా ఉందని కొందరు రెండు ఫొటోలను పక్కపక్కన పెట్టి పోస్ట్ చేస్తున్నారు. ఒక మీమ్‌లో... ట్విట్టర్ ఆఫీస్ కిటికీ నుంచి మార్క్ జుకర్‌బర్గ్ దొంగచాటుగా తొంగి చూస్తుంటాడు. 'థ్రెడ్స్‌లోకి వెళ్లిన వారు కేవలం 5 నిమిషాల తరువాత బ్యాక్ టు ట్విట్టర్ అంటూ ఎలా పరుగెత్తుకు వస్తున్నారో చూడండి' అంటూ ట్విట్టర్ వీరాభిమానులు వీడియో క్లిప్ పోస్ట్ చేశారు. నసీబ్, గ్యాంగ్స్ ఆఫ్ వసీపూర్, సూర్యవంశ్... మొదలైన బాలీవుడ్ సినిమాల క్లిప్‌లకు ట్విట్టర్-థ్రెడ్స్‌కు సంబంధించి ఫన్నీ కామెంట్స్ జత చేస్తున్నారు.

సెంచరీ బామ్మ.. సెన్సేషనల్ టాటూలు!



● అపోవాంగ్ ఓడ్

ఎంతో ఇష్టమైన పేర్లు, నచ్చిన డిజైన్లను శరీరం మీద పచ్చబొట్టు (టాటూ) వేయించుకోవడం ఇప్పుడు ఫ్యాషన్. ఈ అభిరుచి కొత్తగా వచ్చిందేం కాదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న గిరిజన తెగల సంస్కృతి, సంప్రదాయాల్లో వందల ఏళ్లుగా భాగంగా ఉన్నదే. ఇప్పుడు టాటూలు వేయడానికి వాడుతోన్న సూదులు, టాటూ గన్‌లకు బదులు.. అప్పట్లో పదునైన గులాబీ ముళ్లు, సొరచేప పళ్లతో టాటూలు వేసేవాళ్లు. అప్పటి టాటూ పద్ధతులు చాలా వరకు కనుమరుగయ్యాయి. కానీ వందల ఏళ్లనాటి టాటూ టెక్నిక్‌ను సజీవంగా ఉంచేందుకు కృషిచేస్తోంది అపోవాంగ్ ఓడ్. 106 ఏళ్ల వయసులో పురాతన టాటూలను వేస్తూ కళను సజీవంగా ఉంచుతోంది వాంగ్. అంతేగాక ప్రపంచంలో అత్యంత వృద్ధ టాటూ ఆర్టిస్ట్‌గా నిలిచి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.

ఫిలిప్పీన్స్‌కు చెందిన అపో వాంగ్ ఓడ్‌ను మరియా ఒగ్గే అని కూడా పిలుస్తారు. మనీలాకు దగ్గరల్లో ఉన్న కలింగా ప్రావిన్స్‌లోని మారుమూల బుస్కలాన్ గ్రామంలో పుట్టి, అక్కడే స్థిరపడింది. టీనేజీలో ఉండగా 'మాంబా బాటక్' అనే టాటూ కళను నేర్చుకుంది. పదహారేళ్ల వయసులో తండ్రితో కలిసి మాంబా బాటక్ వేస్తూ టాటూ ఆర్టిస్ట్‌గా మారింది. అప్పట్లో మాంబా బాటక్ వేయగల ఒకే ఒక మహిళా ఆర్టిస్ట్ అపోవాంగ్. చుట్టుపక్కల గ్రామాలకు సైతం వెళ్లి అక్కడ టాటూలు వేసేది. పురుషుల్లో ధైర్యసాహసాలకు గుర్తుగానూ, యోధులుగా గుర్తింపు పొందిన వారికి, అందాన్ని రెట్టింపు చేసుకోవడానికి మహిళలు ఈ టాటూలు వేయించుకునేవారు. అలా అప్పటి నుంచి ఇప్పటిదాకా ఏళ్ల తరబడి టాటూలు వేస్తూనే ఉంది వాంగ్.



బొగ్గులో నీళ్ల కలిపి సిరా తయారు చేసి వెదురు పుల్లలు (బ్యాంబూ స్టిక్స్), పంపర పనస ముళ్లతో ఈ టాటూలను వేయడం వాంగ్ ప్రత్యేకత. చుక్కలతో రకరకాల ఆకర్షణీయమైన డిజైన్లు వేస్తుంది. ప్రస్తుతం ఈ టాటూలు వేయడం వచ్చిన వారు ఎవరూ లేరు. వాంగ్ తన తండ్రి దగ్గర నేర్చుకున్న ఈ ఆర్ట్‌ను రక్తసంబంధీకులకు మాత్రమే నేర్పిస్తోంది. వాంగ్‌కు పిల్లలు ఎవరూ లేకపోవడంతో తన మేనకోడలికి మాంబా బాటక్‌లో శిక్షణ ఇస్తోంది.

''ఈ టాటూలు వేసేవాళ్లంతా చనిపోయారు. నేను ఒక్కదాన్నే ఉన్నాను. అయినా నాకు దిగులు లేదు. తరువాతి తరానికి శిక్షణ ఇస్తున్నాను. వాళ్లు టాటూ మాస్టర్స్ అవుతారు'' అని వాంగ్ చెబుతోంది.

వోగ్ స్టార్

మౌలిక నదుపాయాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ కూడా సరిగా లేని గ్రామంలో ఉన్న వాంగ్ దగ్గర టాటూలు వేయించుకోవడానికి అంతర్జాతీయ ఔత్సాహికులు అమితాసక్తి కనబరుస్తున్నారు. అత్యంత వృద్ధ టాటూ ఆర్టిస్ట్ దగ్గర టాటూ వేసుకోవాలన్న ఆసక్తికి తోడు, వాంగ్ వేసే జామెట్రిక్ డిజైన్స్ కోసం ఎగబడుతున్నారు. ఎన్నో ఏళ్లనాటి కళను సెంచరీ దాటాక కూడా కాపాడుతూ తరువాతి తరాలకు అందిస్తోన్న వాంగ్‌ను 'వోగ్' సత్కరించింది. ఈ ఏడాది ఏప్రిల్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆమె రూపాన్ని చిత్రించింది. ఇప్పటి దాక వోగ్ కవర్‌పేజీపై వచ్చిన అత్యంత వృద్ధ స్టార్‌గా వాంగ్ నిలవడం విశేషం.

బ్యూటిప్స్

వర్షాకాలంలోనూ... నీళ్లు పోస్తేనే పచ్చదనం



వర్షాలు పడుతున్నాయి కదా ఇంక మొక్కలకు నీళ్లు పోయనవసరంలేదని కొంతమంది అనుకుంటారు. కానీ వర్షాల్లో కూడా కొన్నిరకాల మొక్కలకు నీళ్లు పోస్తేనే గార్డెన్ పచ్చగా కళకళలాడుతుంది. అందుకు ఇవే కారణాలు...

- సాధారణంగా మొక్కలకు వర్షాకాలంలో సహజసిద్ధంగా నీళ్లు అందుతాయి. కానీ, కుండీల్లో ఉన్న మట్టి తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచలేకపోతే, మొక్కలు త్వరగా ఎండిపోతాయి. అందువల్ల ఎప్పటికప్పుడు తేమను చూసుకుని మొక్కలకు నీళ్లు పోయాలి.
- కుండీల్లో పెరుగుతోన్న కొన్ని రకాల మొక్కలు చాలా పొడవుగా ఉంటాయి. దట్టంగా ఉన్న ఆకులు, కొమ్మలు కూడా వెడల్పుగా విస్తరించి చినుకులను అడ్డుకుంటాయి. వర్షం చినుకులు కొమ్మలపై పడి పక్కకు జారిపోతాయి. దీనివల్ల వేర్లకు సరిగా నీరు అందదు. అందువల్ల గుబురుగా ఉన్న కుండీ మొక్కలకు తప్పని సరిగా నీళ్లుపోయాలి.



సౌత్‌జోన్ జట్టులో రోహిత్ రాయుడు

దేవధర్ ట్రోఫీ ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే సౌత్ జోన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన సౌత్ జోన్ జట్టులో హైదరాబాద్‌కు చెందిన రోహిత్ రాయుడు, ఆంధ్ర క్రికెటర్ రికీ భుయ్‌లకు స్థానం లభించింది. మయాంక్ అగర్వాల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ కూడా సౌత్ జోన్ జట్టులోకి ఎంపికయ్యాడు. దేశవాళీ క్రికెట్‌లో అర్జున్ గోవా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. దేవధర్ ట్రోఫీ ఈనెల 24 నుంచి ఆగస్టు 3 వరకు పుదుచ్చేరిలో జరుగుతుంది.

సింధు ర్యాంక్‌లో పురోగతి

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) మహిళల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ పీవీ సింధు మూడు స్థానాలు పురోగతి సాధించి 12వ ర్యాంక్‌కు చేరుకుంది. గతవారం కెనడా ఓపెన్‌లో సింధు సెమీఫైనల్‌కు చేరింది. కెనడా ఓపెన్‌లో పురుషుల సింగిల్స్‌లో విజేతగా నిలిచిన భారత ప్లేయర్ లక్ష్య సేన్ ఏడు స్థానాలు ఎగబాకి 12వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. హెచ్‌ఎస్ ప్రణయ్ ఎనిమిది నుంచి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోగా... కిడాంబి శ్రీకాంత్ 20వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



టెస్టు సమరం ‘కొత్త’గా మొదలు

సరిగ్గా నెల రోజుల విరామం తర్వాత భారత అభిమానుల కోసం మళ్లీ క్రికెట్ సందడి. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో ఓటమిని ఎదుర్కొన్న అనంతరం టీమిండియా మరోసారి సంప్రదాయ క్రికెట్‌లో కొత్త పోరుకు సన్నద్ధమైంది. 2023-25 డబ్ల్యూటీసీ క్యాలెండర్‌లో భాగంగా భారత్ తమ తొలి సిరీస్ బరిలోకి దిగనుంది. ఈ సారి వెస్టిండీస్ రూపంలో బలహీన ప్రత్యర్థి భారత్ ముందుంది. వన్డే వరల్డ్ కప్‌కు అర్హత సాధించలేక, టెస్టుల్లో అంతంత మాత్రం ప్రదర్శనతోనే పడుతూ లేస్తూ సాగుతున్న విండీస్ జట్టు టీమిండియాకు ఏమాత్రం పోటీనివ్వగలదనేది చూడాలి.

నేటి నుంచి భారత్, వెస్టిండీస్ తొలి మ్యాచ్

- ఫేవరెట్‌గా టీమిండియా
- సొంతగడ్డపై పోటీకి విండీస్ సై

రాత్రి 7:30 నుంచి దూరదర్శన్ స్పోర్ట్స్ చానెల్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


రహానే, యశస్వి

రోసీ (డొమినికా): భారత్, వెస్టిండీస్ మధ్య రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా నేటి నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్టు జరుగుతుంది. చివరిసారిగా 2019లో విండీస్ గడ్డపై పర్యటించిన భారత్ 2–0తో సిరీస్ గెలుచుకుంది. ఇప్పుడు కూడా రెండు జట్ల బలాబలాలను చూస్తే భారత్ అన్ని రకాలుగా పటిష్టంగా ఉంది. అయితే సొంతగడ్డపై అప్పుడప్పుడు సంచలనాలు సృష్టించగల సామర్థ్యం విండీస్‌కు ఉంది. వరుసగా రెండుసార్లు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరిన భారత్ ఇక్కడి నుంచే సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు రాబట్టుకోవాలని భావిస్తోంది.

యశస్విపై దృష్టి...

డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడిన భారత బృందం నుంచి చూస్తే దాదాపు అదే తుది జట్టుతో బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. ప్రధాన తేడా మూడో స్థానంలో పుజారా లేకపోవడమే. ఈ సిరీస్ కోసం కొత్తగా ప్రయత్నించేందుకు యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ రూపంలో భారత్‌కు అవకాశం ఉంది. ముంబైకి ఓపెనర్ అయిన యశస్వి ఇక్కడా ఓపెనర్‌గా, గిల్ మూడో స్థానంలో ఆడటం దాదాపు ఖాయమైంది. ప్రధాన బ్యాటర్లలో రోహిత్, గిల్, కోహ్లిలపై బ్యాటింగ్ భారం ఉంది. ఓవల్ టెస్టులో రాణించి తన స్థానం నిలబెట్టుకున్న రహానే వైస్‌కెప్టెన్‌గా మరింత అదనపు బాధ్యతతో ఆడనున్నాడు. బౌలింగ్‌లో షమీకి ఈ సిరీస్ నుంచి విశ్రాంతినివ్వగా... నవదీప్ సైనీ లేదా జైదేవ్ ఉనాద్కట్‌లలో ఒకరికి అవకాశం లభిస్తుంది. ప్రధాన పేసర్‌గా సిరాజ్... స్పిన్నర్లుగా రవీంద్ర జడేజాతో పాటు డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడని అశ్విన్ కూడా తుది జట్టులో ఉంటారు.

సమష్టిగా ఆడితేనే...

చాలా కాలంగా వెస్టిండీస్ టెస్టు జట్టు పేలవ ఫామ్‌లోనే ఉంది. చివరిసారిగా మార్చిలో టెస్టు సిరీస్ ఆడిన ఆ జట్టు 0–2తో దక్షిణాఫ్రికా చేతిలో ఓడింది. కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్, తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ ఓపెనర్లుగా అందించే ఆరంభం జట్టుకు కీలకం కానుంది. తర్వాతి బ్యాటర్లలో రీఫర్, బ్లాక్‌వుడ్ మాత్రమే నమ్మదగిన ఆటగాళ్లు. ఆల్‌రౌండర్‌గా రోచ్ అనుభవం జట్టుకు ఉపయోగపడవచ్చు. కైల్ మేయర్స్ లేకపోవడం లోటు. రోచ్, జోసెఫ్, హోల్డర్ పేస్ బౌలింగ్ భారం మోస్తారు. షెనాన్ గాబ్రియెల్‌కు అవకాశం దక్కుతుందా చూడాలి. వీరు తమ స్థాయికి తగినట్లుగా ఆడితే భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టవచ్చు. కార్న్‌వాల్ రూపంలో రెండో స్పిన్నర్ జట్టులో ఉన్నాడు.

51 వెస్టిండీస్ గడ్డపై విండీస్‌తో భారత్ 51 టెస్టులు ఆడింది. 9 టెస్టుల్లో నెగ్గి, 16 టెస్టుల్లో ఓడింది. 26 టెస్టులు ‘డ్రా’ అయ్యాయి. ఓవరాల్‌గా రెండు జట్ల మధ్య 98 టెస్టులు జరిగాయి. భారత్ 22 టెస్టుల్లో నెగ్గి, 30 టెస్టుల్లో ఓడింది. 46 టెస్టులు ‘డ్రా’ అయ్యాయి.



స్వితోలినా సంచలనం

- ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ స్వియాటెక్‌పై విజయం
- వింబుల్డన్ టోర్నీలో రెండోసారి సెమీస్‌లోకి


స్వియాటెక్

లండన్: గత ఏడాది అక్టోబర్‌లో పాపకు జన్మనిచ్చి... ఏప్రిల్‌లో మళ్లీ రాకెట్ పట్టిన ఉక్రెయిన్ టెన్నిస్ స్టార్ ఎలీనా స్వితోలినా వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పెను సంచలనం సృష్టించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో స్వితోలినా 7–5, 6–7 (5/7), 6–2తో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించింది. 2019 తర్వాత మళ్లీ వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్లోకి ప్రవేశించింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన స్వితోలినాకు వింబుల్డన్ నిర్వాహకులు ‘వైల్డ్ కార్డు’ కేటాయించారు. స్వియాటెక్‌తో 2 గంటల 51 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో స్వితోలినా ఐదు ఏస్‌లు సంధించింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, స్వియాటెక్ సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చి తొమ్మిదిసార్లు పాయింట్లు నెగ్గిన స్వితోలినా 25 విన్నర్స్ కొట్టింది. నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ నెగ్గి, తొలిసారి వింబుల్డన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన స్వియాటెక్ 41 అనవసర తప్పిదాలు చేసింది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 76వ స్థానంలో ఉన్న స్వితోలినా సెమీఫైనల్ చేరిన క్రమంలో నలుగురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్‌ను ఓడించడం విశేషం. తొలి రౌండ్‌లో వీనస్ విలియమ్స్ (అమెరికా)పై, రెండో రౌండ్‌లో సోఫియా కెనిన్ (అమెరికా)పై, నాలుగో రౌండ్‌లో విక్టోరియా అజరెంకా (బెలారస్)లపై స్వితోలినా గెలిచింది. సెమీఫైనల్లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన మర్కెటా వొంద్రుసోవాతో స్వితోలినా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో 42వ ర్యాంకర్ వొంద్రుసోవా 6–4, 2–6, 6–4తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా)పై సంచలన విజయం సాధించింది.

సెమీస్‌లో సినెర్

పురుషుల సింగిల్స్ విభాగంలో ఎనిమిదో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి అడుగు పెట్టాడు. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6–4, 3–6, 6–2, 6–2తో సఫీయులిన్ (రష్యా)పై గెలుపొందాడు. 2 గంటల 14 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో సినెర్ 14 ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు. సోమవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 3–6, 6–3, 6–3, 6–3తో బెరెటిని (ఇటలీ)పై, ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) 3–6, 7–6 (8/6), 7–6 (7/4), 6–3తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచి తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు.

క్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

పురుషుల డబుల్స్ మూడో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 7–5, 4–6, 7–6 (10/7) తో డేవిడ్ పెల్ (నెదర్లాండ్స్)–రీస్ స్టాల్డెర్ (అమెరికా) జంటను ఓడించింది. జూనియర్ బాలుర సింగిల్స్ రెండో రౌండ్‌లో మానస్ ధామ్నె (భారత్) 1–6, 4–6తో సియర్లీ (బ్రిటన్) చేతిలో ఓడిపోయాడు.

బ్యాటింగ్‌లో నిరాశ... బౌలింగ్‌తో హుషారు

- దీప్తి, షఫాలీ మాయాజాలం
- బంగ్లాదేశ్‌పై 8 పరుగులతో భారత్ విజయం
- సిరీస్ 2–0తో టీమిండియా సొంతం



దీప్తి, షఫాలీ

మిర్పూర్: భారత మహిళా బ్యాటర్ల స్కోరు, జట్టు స్కోరు తక్కువే! మ్యాచ్‌పై ఆశలే లేని చోట స్పిన్నర్లు దీప్తి శర్మ (3/12), షఫాలీ వర్మ (3/15) మ్యాజిక్ చేశారు. ఇద్దరు వరుసగా 19వ, 20వ ఓవర్ వేసి అనూహ్యంగా భారత్‌ను రెండో టి20లో గెలిపించారు. ఇంకో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను అందించి మురిపించారు. బంగ్లాదేశ్ అమ్మాయిలతో జరిగిన ఈ ఉత్కంఠభరిత పోరులో హర్మన్‌ప్రీత్ బృందం 8 పరుగుల తేడాతో గెలిచింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 95 పరుగులు చేసింది. బంగ్లాదేశ్‌పై టి20 మ్యాచ్‌లో భారత్‌కిదే అత్యల్ప స్కోరు! ఏకంగా పది మంది బ్యాటింగ్‌కు దిగితే ఇందులో ఏ ఒక్కరు 20 పరుగులైనా చేయలేకపోవడం గమనార్హం. షఫాలీ వర్మ (14 బంతుల్లో 19; 4 ఫోర్లు) టాప్ స్కోరర్! స్మృతి మంధాన (13; 2 ఫోర్లు), యస్తికా భాటియా (11; 1 ఫోర్), ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ దీప్తి శర్మ (10; 1 ఫోర్), అమన్‌జోత్ కౌర్ (14; 2 ఫోర్లు) డబుల్ డిజిట్ చేశారంతే. దీంతో జట్టు వంద పరుగులైనా చేయలేకపోయింది. సుల్తానా ఖాటున్ 3, ఫాహిమా ఖాటున్ 2 వికెట్లు తీశారు. తర్వాత బంగ్లా 20 ఓవర్లలో 87 పరుగులకు ఆలౌటైంది. మనవాళ్లెవరూ 20 పరుగులైనా చేయలేకపోవడం విడ్డూరమైతే... ప్రత్యర్థి జట్టులో నిగార్ సుల్తానా (38; 2 ఫోర్లు) తప్ప ఇంకెవరూ పట్టుమని పది పరుగులైనా చేయలేకపోయారు. నిగార్‌ను దీప్తి అవుట్ చేసినప్పుడు బంగ్లా స్కోరు 86/6. మిగతా 7 బంతులకు జట్టు 10 పరుగుల దూరంలోనే ఉంది. కానీ షఫాలీ 20వ ఓవర్లో రబేయా (0)ను రనౌట్ చేసింది. నహిదా (6), ఫాహిమా (0), మారుఫా (0)లను స్పిన్‌తో బోల్తా కొట్టించింది. మిన్ను మణి 2 వికెట్లు తీయగా, ఆంధ్రప్రదేశ్ స్పిన్నర్ బారెడ్డి అనూషకు ఒక వికెట్ దక్కింది. గురువారం ఆఖరి టి20 జరుగుతుంది.



నేటి నుంచి దులీప్ ట్రోఫీ ఫైనల్

బెంగళూరు: దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ దులీప్ ట్రోఫీ ఫైనల్ నేడు బెంగళూరులో మొదలుకానుంది. హనుమ విహారి సారథ్యంలోని సౌత్ జోన్ జట్టు ప్రియాంక్ పాంచాల్ కెప్టెన్సీలోని డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుతో తలపడనుంది. గత ఏడాది ఫైనల్లో వెస్ట్ జోన్ జట్టు 294 పరుగుల తేడాతో సౌత్ జోన్ జట్టును ఓడించింది. సౌత్ జోన్ చివరిసారి 2011లో దులీప్ ట్రోఫీ టైటిల్ గెలిచింది. వెస్ట్ జోన్ జట్టు 19సార్లు చాంపియన్‌గా నిలిచింది. విహారితో పాటు మయాంక్ అగర్వాల్, తిలక్ వర్మ, రికీ భుయ్, సాయి సుదర్శన్ ఆటతీరుపై సౌత్ జట్టు విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. పృథ్వీ షా, పుజారా, సూర్యకుమార్ యాదవ్, సర్ఫరాజ్‌లతో వెస్ట్ జోన్ కూడా పటిష్టంగా ఉంది.


సినిమా

మహేశ్‌బాబు, ఎన్టీఆర్, రామ్‌చరణ్‌ల తాజా చిత్రాల సెట్స్‌లో ‘డిష్యుం.. .. డిష్యుం’ సౌండ్స్ ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ ముగ్గురు స్టార్స్ విలన్లను రఫ్ఫాడిస్తున్నారు... రిస్కీ ఫైట్ చేస్తున్నారు. ఆ డిష్యుం.. డిష్యుం... విశేషాలు తెలుసుకుందాం.

డిష్యుం.. డిష్యుం...


‘గుంటూరు కారం’లో మహేశ్‌బాబు


‘దేవర’లో ఎన్టీఆర్


‘గేమ్ ఛేంజర్’లో రామ్‌చరణ్

గుంటూరు కారం.. నాటు ఫైటు

‘గుంటూరు కారం’ ఎంత ఘాటుగా ఉంటుందో ఆ రేంజ్‌లో నాటు ఫైటు చేస్తున్నారు మహేశ్‌బాబు. ‘అతడు’, ‘ఖలేజా’ చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ‘గుంటూరు కారం’ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా తాజా షెడ్యూల్ ఇటీవల హైదరాబాద్‌లో ఆరంభమైంది. తొలుత మహేశ్‌బాబు పాల్గొనగా కాలేజీ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. ప్రస్తుతం యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. నాటు ఫైట్స్‌తో విలన్ల తుక్కు రేగ్గొడుతున్నారు మహేశ్. మరి.. ఈ ఫైట్‌ను విజువల్‌గా ఎంజాయ్ చేయాలంటే సంక్రాంతి వరకూ ఎదురు చూడక తప్పదు. ఎందుకంటే ‘గుంటూరు కారం’ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఎస్. చినబాబు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీ లీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

యాక్షన్ దేవర

‘దేవర’ షూటింగ్ ఎప్పట్నుంచి మొదలైందో అప్పట్నుంచే ఎన్టీఆర్ ఫుల్ యాక్షన్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. ఇప్పటివరకు జరిగిన ఈ సినిమా ప్రతి షెడ్యూల్‌లోనూ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించడమే ఇందుకు ఓ నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఈ నెల మొదటివారంలో ‘దేవర’ తాజా షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రస్తుతం ఎన్టీఆర్, మలయాళ నటుడు షైన్ టామ్ చాకోలపై ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారని టాలీవుడ్ టాక్. ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్స్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేశారట. అంతేకాదు.. ఈ ఫైట్ పూర్తి కాగానే మరో ఫైట్ మాస్టర్ సాల్మోన్ డిజైన్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ పాల్గొంటారు. ఈ చిత్రంలో విలన్ రోల్ చేస్తున్న సైఫ్ అలీఖాన్ ఈ షెడ్యూల్‌లో జాయిన్ అయ్యే చాన్సెస్ ఉన్నాయి. ఆల్రెడీ ఎన్టీఆర్ – సైఫ్‌ల మధ్య హాలీవుడ్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బేట్స్ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించిన సంగతి తెలిసిందే. ఇక ‘జనతా గ్యారేజ్’ (2016) చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ ‘దేవర’లో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్ రామ్, కె. హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న విడుదల కానుంది.

గేమ్ ఛేంజర్ యాక్షన్

‘గేమ్ ఛేంజర్’గా ఫైట్ చేస్తున్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా రూపొందుతున్న సినిమా ‘గేమ్ ఛేంజర్’. ఈ చిత్రదర్శకుడు శంకర్ ‘ఇండియన్ 2’తో బిజీగా ఉండటం, హీరో రామ్‌చరణ్ హాలిడేస్ వంటి కారణాల వల్ల ఈ సినిమా షూటింగ్‌కు కాస్త గ్యాప్ వచ్చింది. తాజాగా ఈ వారంలో షూటింగ్‌ను తిరిగి ఆరంభించడానికి సన్నాహాలు చేస్తోంది యూనిట్. ఈ కొత్త షెడ్యూల్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారని తెలిసింది. స్టంట్ మాస్టర్స్ అన్బు–అరివు ఈ ఫైట్‌ని డిజైన్ చేయనున్నారట. ఆల్రెడీ సినిమా క్లయిమాక్స్ యాక్షన్ సీక్వెన్స్ పూర్తయింది. తాజా యాక్షన్ షెడ్యూల్ చిత్రీకరణతో ‘గేమ్ ఛేంజర్’ సినిమాకు సంబంధించిన యాక్షన్ పోర్షన్స్ పూర్తవుతాయనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. ‘దిల్’ రాజు, శిరీష్‌లు నిర్మిస్తున్న ఈ సినిమా 2024లో రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

సంగీత్ సందడి


సుశాంత్, కీర్తీ సురేష్, చిరంజీవి, తమన్నా

చిరంజీవి టైటిల్ రోల్ చేసిన తాజా చిత్రం ‘భోళా శంకర్’. ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించగా, ఆయనకు జోడీగా తమన్నా నటించారు. సుశాంత్ ఓ కీలక పాత్రలో కనిపిస్తారు. కాగా ‘భోళా శంకర్’ చిత్రంలోని ‘జామ్ జామ్ జజ్జనక..’ పాట లిరికల్ వీడియోను చిత్ర యూనిట్ మంగళవారం విడుదల చేసింది. సంగీత దర్శకుడు మహతి స్వరసాగర్ స్వరకల్పనలో కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి, మంగ్లీ పాడారు. పెళ్లి వేడుకల్లో భాగంగా జరిగే సంగీత్‌లోని పాటగా ‘జామ్ జామ్ జజ్జనక..’ ఉంటుందని తెలిసింది. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది.

థ్రిల్ ఇచ్చే హిడింబ


అశ్విన్

అశ్విన్ బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వం వహించిన చిత్రం ‘హిడింబ’. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో ఎస్‌వీకే సినిమాస్‌పై గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 20న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. ‘‘ఇండియన్ సినిమాల్లో ఇంతకు ముందెన్నడూ చెప్పని కథ, ఇంతకు ముందు ఎవరూ టచ్ చేయని జానర్’’ అంటూ రిలీజ్ డేట్ పోస్టర్‌లో వేశారు మేకర్స్. ‘‘యూనిక్ కథతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని, థ్రిల్‌ని ఇచ్చేలా ‘హిడింబ’ని మలిచారు అనిల్ కన్నెగంటి. ఈ చిత్రంలో కొన్ని ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు అభ్యంతరకరంగా ఉన్నాయని సెన్సార్ వారు చెప్పారు. దీంతో రివ్యూ కమిటీ ద్వారా సినిమాని రీ–సెన్సార్ చేసి విడుదల చేస్తున్నాం’’ అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ బాదిసా, కెమెరా: బి. రాజశేఖర్.

ఆ మాటని నమ్మను

- వైష్ణవీ చైతన్య



‘‘బస్తీలో పెరిగిన ఓ అమాయకురాలు సిటీకి వస్తుంది. చిన్నప్పటి నుంచి ఓ అబ్బాయితో ప్రేమలో ఉంటుంది. సిటీలో కాలేజీకు వచ్చాక మరో అబ్బాయి లైఫ్‌లోకి వస్తాడు. ఆ తర్వాత ఆ అమ్మాయి జీవితం ఎలా ప్రభావితం అయింది? అనేది ‘బేబీ’లో సాయి రాజేష్‌గారు చక్కగా చూపించారు’’ అని వైష్ణవీ చైతన్య అన్నారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ హీరోలుగా, వైష్ణవీ చైతన్య హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బేబీ’. సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా వైష్ణవీ చైతన్య మాట్లాడుతూ– ‘‘మాది హైదరాబాద్. యూ ట్యూబర్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా నా గురించి కొందరికి తెలుసు. ఎనిమిదేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న నాకు హీరోయిన్‌గా ‘బేబీ’ మొదటి సినిమా. నన్ను నమ్మి, నాలో ధైర్యం నింపి అవకాశం ఇచ్చిన సాయి రాజేష్‌గారికి థ్యాంక్స్. నా జీవితంలో చాలా గొప్ప అవకాశం ఇది. వాస్తవ ఘటనలతో రూపొందిన సినిమా. తెలుగు అమ్మాయిలకు తెలుగులో చాన్స్‌లు ఇవ్వరనే మాటని నేను నమ్మను. మన వంతు ప్రయత్నం చేసినప్పుడే అవకాశాలు వస్తాయి. ‘బేబీ’ తర్వాత నేను ఏ కొత్త ప్రాజెక్ట్‌కు సైన్ చేయలేదు’’ అన్నారు.

హై ఓల్టేజ్ యాక్షన్


విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘మార్క్ ఆంటోనీ’ విడుదల తేదీ ఫిక్స్ అయింది. వినాయక చవితి పండగను పురస్కరించుకుని సెప్టెంబర్ 15న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. వినోద్ కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రం రిలీజ్ డేట్ ప్రకటించి, విశాల్ పోస్టర్స్‌ని విడుదల చేశారు. ‘‘సైన్స్ ఫిక్షన్, హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. టైమ్ ట్రావెల్ థీమ్ చుట్టూ తిరిగే ఈ చిత్రంలో భారీ యాక్షన్ సీన్స్, సైన్స్ ఫిక్షన్ అంశాలు, ఎస్‌జే సూర్య కామెడీ.. ఇలా అన్నీ ప్రేక్షకులను అలరిస్తాయి’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. సునీల్, సెల్వ రాఘవన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, కెమెరా: అభినందన్ రామానుజం.

రఖ్ విశ్వాస్


అక్షయ్ కుమార్

అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, పరేష్ రావల్ ప్రధాన పాత్రధారులుగా ఉమేష్ శుక్లా దర్శకత్వంలో రూపొందిన హిందీ చిత్రం ‘ఓఎమ్‌జీ’ (ఓ మై గాడ్). 2012లో విడుదలైన ఈ చిత్రం దాదాపు రూ. రెండొందల కోట్ల వసూళ్లు సాధించి సూపర్‌హిట్‌గా నిలిచింది. పదేళ్ల తర్వాత ‘ఓఎమ్‌జీ’కి సీక్వెల్‌గా ‘ఓఎమ్‌జీ 2’ (ఓ మై గాడ్ 2) రానుంది. అమిత్ రాయ్ దర్శకత్వంలో అక్షయ్ కుమార్, పంకజ్ త్రిపాఠి, యామీ గౌతమ్, అరుణ్ గోవిల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ఇది. ఈ చిత్రం ఆగస్టు 11న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ‘రఖ్ విశ్వాస్’ అంటూ ఈ సినిమా టీజర్‌ను అక్షయ్ కుమార్ షేర్ చేశారు. ఈ సినిమాలో శివుడిగా అక్షయ్‌కుమార్, భక్తునిగా పంకజ్ త్రిపాఠి నటిస్తున్నారు. కాగా ‘ఓఎమ్‌జీ 2’ చిత్రం విద్యా వ్యవస్థ నేపథ్యంలో తెరకెక్కిందని బాలీవుడ్ టాక్.

తెలుగులో తారకాసుర


తృప్తీ శుక్లా

రవికిరణ్, మాన్వితా హరీష్ జంటగా చక్రవర్తి, తృప్తీ శుక్లా, హాలీవుడ్ నటుడు డేని సపని కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘తారకాసుర’. చంద్రశేఖర్ బండియప్ప దర్శకత్వంలో నరసింహులు నిర్మించారు. కన్నడలో హిట్‌గా నిలిచిన ఈ చిత్రాన్ని ‘తారకాసుర’ పేరుతోనే విజయ్ భాస్కర్ రెడ్డి పాళ్యం తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ నగేష్ నారదాసి, నిర్మాతలు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, సాయి వెంకట్, పద్మిని నాగులపల్లి అతిథులుగా హాజరై, ‘తారకాసుర’ తెలుగులోనూ హిట్టవ్వాలని అన్నారు. ‘‘తారకాసుర’లో తెలుగు నేటివిటీకి తగ్గట్టు కొన్ని మార్పులు చేస్తాం. మా బ్యానర్‌లో ఓ స్ట్రయిట్ సినిమా ప్లాన్ చేస్తున్నాం’’ అన్నారు విజయ్ భాస్కర్ రెడ్డి పాళ్యం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	274	65,618
నిఫ్టీ ▲	84	19,439

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,719	▲	33
డోజోన్స్	34,140	▲	197
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,283	▲	9
డాక్స్	15,790	▲	117
షాంఘై	3,221	▲	18
నికాయ్	32,204	▲	14

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,866 ▲	210
బంగారం (99.5 స్వచ్ఛత)	58,630 ▲	209
వెండి (కిలో)	70,828 ▲	197

కార్‌ట్రేడ్ చేతికి సోబెక్ ఆటో

డీల్ విలువ రూ. 537 కోట్లు



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఆటో క్లాసిఫైడ్ ప్లాట్‌ఫామ్ కార్‌ట్రేడ్ టెక్ ఆటోమోటివ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ నిర్వహణ సంస్థ సోబెక్ ఆటో కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. క్లాసిఫైడ్స్ ఇంటర్నెట్ బిజినెస్‌ను సైతం నిర్వహించే సోబెక్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకునేందుకు రూ. 537 కోట్లకుపైగా వెచ్చించనుంది. ఇందుకు ఓఎల్‌ఎక్స్ ఇండియా బీవీతో వాటా కొనుగోలు ఒప్పందాన్ని(ఎస్‌పీఏ) కుదుర్చుకున్నట్లు కార్‌ట్రేడ్ వెల్లడించింది. 2023 జూన్ 30న ఓఎల్‌ఎక్స్ ఇండియాకు చెందిన క్లాసిఫైడ్ ఇంటర్నెట్ బిజినెస్‌ను సోబెక్ కొనుగోలు చేసింది. బిజినెస్ బదిలీ ప్రాతిపదికన డీల్ కుదిరింది.

ఐఫోన్ల తయారీలో టాటా!

విస్ట్రాన్ ప్లాంటు కొనుగోలుకు కసరత్తు



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం టాటా గ్రూప్ త్వరలోనే యాపిల్ ఐఫోన్లను భారత్‌లో తయారు చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐఫోన్ల సరఫరాదారు విస్ట్రాన్‌కు కర్ణాటకలో ఉన్న ప్లాంటును కొనుగోలు చేయడంపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఆగస్టులో ఈ డీల్ పూర్తయ్యే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒకవేళ ఈ ఒప్పందం కుదిరితే ఐఫోన్లను తయారు చేసే తొలి భారతీయ కంపెనీగా టాటా నిలవనుంది. సుమారు 600 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4,000 కోట్లు) విలువ చేసే విస్ట్రాన్ ప్లాంటు కొనుగోలు కోసం దాదాపు ఏడాది కాలంగా చర్చలు జరుగుతున్నట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. ఇందులో ప్రస్తుతం లేటెస్ట్ ఐఫోన్ 14 మోడల్‌ను అసెంబుల్ చేస్తుండగా.. 10,000 మంది పైచిలుకు ఉద్యోగులు ఉన్నారు. టాటా గ్రూప్ ఇప్పటికే ఐఫోన్ చాసిస్‌లను తమ తమిళనాడు ప్లాంటులో తయారు చేస్తోంది.

2 కోట్లకు పైగా ఐటీఆర్‌లు నమోదు



న్యూఢిల్లీ: గడిచిన ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు 2 కోట్లకు పైగా ఐటీఆర్‌లు దాఖలయ్యాయి. జూలై 11 నాటికి ఇంత మంది ఐటీఆర్‌లు దాఖలు చేసినట్టు ఆదాయపన్ను శాఖ ట్విట్టర్‌లో ప్రకటించింది. గతేడాది జూలై 20 నాటికి కానీ 2 కోట్ల ఐటీఆర్‌లు నమోదు కాలేదు. పన్ను చెల్లింపుదారులు ఈ ఏడాది 9 రోజుల ముందే 2 కోట్ల రిటర్నుల మైలురాయి నమోదుకు సహకరించినట్టు ఆదాయపన్ను శాఖ పేర్కొంది. అసెస్‌మెంట్ సంవత్సరానికి 2023–24 సంబంధించి ఇప్పటికీ ఐటీఆర్‌లు దాఖలు చేయని వారు, వెంటనే ఆ పనిని పూర్తి చేసుకోవాలని కోరింది.

మళ్లీ రూపాయి ప్లస్

18 పైసలు బలపడి 82.41కు



న్యూఢిల్లీ: డాలరుతో మారకంలో దేశీ కరెన్సీ మరోసారి బలపడింది. 18 పైసలు పుంజుకుని 82.41 వద్ద ముగిసింది. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్రితం ముగింపు 82.59తో పోలిస్తే తొలుత 82.42 వద్ద ఉత్సాహంగా ప్రారంభమైంది. తదుపరి డాలరుతో మారకంలో 82.32 వరకూ లాభపడింది. ఇంట్రాడే కనిష్టం 82.43కాగా.. చివరికి 82.41 వద్ద ముగిసింది. వెరసి గత రెండు రోజుల్లో 20 పైసలు బలపడింది. ఇందుకు ఈక్విటీ మార్కెట్లు లాభపడటం, విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు సహకరించినట్లు ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి. డాలరుతో మారకంలో ఆసియా కరెన్సీలు పుంజుకోవడం సైతం రూపాయికి బలాన్నిచ్చినట్లు తెలియజేశాయి.

చిప్ ప్లాంటుపై ఫాక్స్‌కాన్ సొంత ప్లాన్

- ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసుకునే యోచన
- భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటుకు కట్టుబడి ఉన్నామని వెల్లడి



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం వేదాంతతో జాయింట్ వెంచర్ నుంచి తప్పుకున్న ఫాక్స్‌కాన్ సొంతంగానే భారత్‌లో సెమీకండక్టర్ల ప్లాంటు నెలకొల్పేందుకు కసరత్తు చేస్తున్నట్లు వెల్లడించింది. చిప్‌ల తయారీకి సంబంధించి ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాల కోసం విడిగా దరఖాస్తు చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు వివరించింది. అనువైన భాగస్వాములను ఎంచుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. వేదాంతాతో జాయింట్ వెంచర్ నుంచి వైదొలగడంపై స్పందిస్తూ.. 'ఇదేమీ ప్రతికూల పరిణామమేమీ కాదు. ప్రాజెక్టు తగినంత వేగంతో ముందుకు సాగడం లేదని ఇరు పక్షాలు గుర్తించాయి. సవాళ్లను అధిగమించడం అంత సులువుగా జరగడం లేదు. పైగా ప్రాజెక్టుకు వెలుపలి అంశాలు కూడా ఇందుకు తోడయ్యాయి. దీంతో మా గ్రూపు, వాటాదారులపై పడే ప్రభావాలన్నింటినీ పరిశీలించిన మీదటే ఈ నిర్ణయం తీసుకున్నాం' అని పేర్కొంది. 'కొత్త ప్రదేశంలో ఫ్యాబ్రికేషన్ యూనిట్లను కొత్తగా ప్రారంభించడమనేది సవాలే. అయితే, 1980ల నుంచి ఇలాంటి సవాళ్లను ఎన్నో అధిగమిస్తూ, ముందుకు సాగుతున్నాం. భారత్‌లో చిప్ ప్లాంటు ఏర్పాటుకు కట్టుబడి ఉన్నాం' అని ఫాక్స్‌కాన్ స్పష్టం చేసింది. తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ తయారీ దిగ్గజం ఫాక్స్‌కాన్.. భారత్‌లో తొలి సెమీకండక్టర్ల తయారీ యూనిట్ ఏర్పాటు కోసం వేదాంతాతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయడం, సాంకేతిక భాగస్వామి కుదరకపోవడంతో దాన్నుంచి తప్పుకోవడం తెలిసిందే.

సోనాలికా క్యూ1 అమ్మకాల్లో రికార్డు

ఏప్రిల్–జూన్‌లో 40,700 ట్రాక్టర్ల విక్రయం



హైదరాబాద్: భారత్ నెంబర్ 1 ట్రాక్టర్ ఎక్స్‌పోర్ట్ బ్రాండ్ సోనాలికా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్)లో రికార్డు స్థాయిలో 40,700 ట్రాక్టర్ల అమ్మకాలు జరిపింది. సోనాలికా వ్యాపార చరిత్రలో ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇంత భారీ స్థాయిలో విక్రయాలు జరపడం ఇదే తొలిసారి. మార్కెట్ షేర్‌లో కూడా సంస్థ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఇదే తరహా రికార్డు విక్రయాలు మున్ముందు త్రైమాసికాల్లో కూడా కొనసాగుతాయన్న విశ్వాసాన్ని ఈ మేరకు వెలువడిన ఒక ప్రకటన తెలిపింది. వ్యవసాయం–పర్యావరణ వ్యవస్థల మధ్య సమతౌల్యత సాధిస్తూ ప్రపంచ స్థాయి ప్రమాణాలు, నాణ్యతతో కూడిన హెవీ డ్యూటీ ట్రాక్టర్లు అలాగే ఇతర సరసమైన వ్యవసాయ ఉత్పాదకతలను అందించడానికి కట్టుబడి ఉన్నట్లు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ (సోనాలికా అండ్ సోలిస్)జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ పేర్కొన్నారు. రైతులను మరింత ఉత్పాదకత దిశగా నడిపించడానికి, ప్రగతిశీల బాటలో వారిని సంపన్నులుగా మార్చడానికి సంస్థ తన వంతు కృషి చేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ మార్కెట్లు అప్

- సెన్సెక్స్ 274 పాయింట్లు ప్లస్
- 65,618 వద్ద ముగింపు
- 84 పాయింట్లు ఎగసిన నిఫ్టీ
- హెవీవెయిట్ షేర్ల దన్ను



ముంబై: వరుసగా రెండో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. సెన్సెక్స్ 274 పాయింట్లు ఎగసి 65,618కు చేరగా.. 84 పాయింట్లు పుంజుకున్న నిఫ్టీ 19,439 వద్ద ముగిసింది. అధికశాతం ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల మధ్యే కదిలాయి. వెరసి సెన్సెక్స్ ఒక దశలో 526 పాయింట్లు జంప్‌చేసి 65,870ను అధిగమించగా.. నిఫ్టీ 19,515 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని అందుకుంది. ప్రధానంగా ఇండెక్స్ హెవీవెయిట్స్ రిలయన్స్, ఐటీసీ, ఇన్ఫోసిస్ తదితరాలు మార్కెట్లకు జోష్‌నిచ్చాయి. ఇటీవల పెట్టుబడుల బాటలో సాగుతున్న విదేశీ ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇవ్వడం సెంటిమెంటుకు ప్రోత్సాహాన్నిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు.

లాభాల బాటలో

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా ఆటో, ఎఫ్‌ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్ 1 శాతం స్థాయిలో లాభపడగా.. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్స్ 0.2 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఐషర్, సన్ ఫార్మా, టాటా కన్జ్యూమర్, అపోలో హాస్పిటల్స్, మారుతీ, టాటా మోటార్స్, ఐటీసీ, ఎల్‌అండ్‌టీ, ఇన్ఫోసిస్, టైటాన్, నెస్లే, ఆర్‌ఐఎల్ 3–1.2% మధ్య ఎగశాయి. అయితే యూపీఎల్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్, హిందాల్కో, హీరో మోటో, ఎస్‌బీఐ 2.3–0.6% క్షీణించాయి.

చిన్న షేర్లు జూమ్: మార్కెట్లను మించుతూ బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ దాదాపు 1 శాతం బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,870 లాభపడితే.. 1,627 నష్టపోయాయి. నగదు విభాగంలో ఎఫ్‌పీఐలు తాజాగా రూ. 1,197 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశారు. డీఐఐలు రూ. 7 కోట్లను వెనక్కి తీసుకోగా.. గత రెండు రోజుల్లోనూ ఎఫ్‌పీఐలు రూ. 1,378 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాగా.. లండన్ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 0.2 శాతం బలపడి 77.83 డాలర్లకు చేరింది.

వేదాంతా నేలచూపు

సెమీకండక్టర్ తయారీ భాగస్వామ్య సంస్థ(జేవీ) నుంచి తైవాన్ దిగ్గజం ఫాక్స్‌కాన్ వైదొలగిన నేపథ్యంలో వేదాంతా లిమిటెడ్ కౌంటర్లో అమ్మకాలు తలెత్తాయి. దీంతో వేదాంతా షేరు బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలలో 2% క్షీణించి రూ. 278 దిగువన స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో 1.36 కోట్లు, బీఎస్‌ఈలో 6.66 లక్షలు చొప్పున షేర్లు చేతులు మారాయి. 19.5 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఏర్పాటు చేయతలపెట్టిన జేవీ నుంచి ఫాక్స్‌కాన్ వైదొలగడం తెలిసిందే.

ఏఐతో ఉద్యోగాలు ఉఫ్..

90 శాతం మందిని తొలగించిన దుకాణ్



న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ) చాట్‌బాట్‌లతో ఉద్యోగాలకు ముప్పు ముంచుకొస్తోంది. తాజాగా ఈ–కామర్స్ స్టార్టప్ సంస్థ దుకాణ్ తమ కస్టమర్ సపోర్ట్ టీమ్‌లో 90 శాతం మంది ఉద్యోగులను తొలగించింది. లాభదాయకతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సుమీత్ షా తెలిపారు. దీనివల్ల కస్టమర్ సపోర్ట్ వ్యయాలు 85 శాతం మేర తగ్గాయని, సమస్య పరిష్కారానికి పట్టే సమయం రెండు గంటల నుంచి మూడు నిమిషాలకు తగ్గిందని ట్వీట్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల స్థానంలో లీనా అనే ఏఐ అసిస్టెంట్ సమర్థంగా పని చేస్తున్న తీరుతెన్నుల గురించి వివరించారు. ఏఐతో ఉద్యోగాలకు ముప్పు ఉందన్న వాదనలు అర్థరహితం అంటూ ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొట్టిపారేసిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, సుమీత్ షా ట్వీట్‌పై విమర్శలు వెల్లువెత్తాయి.

ఐటీసీ సంజీవ్ పురి వేతనం రూ.16.31 కోట్లు

2022–23లో 50 శాతం అధికం



న్యూఢిల్లీ: ఐటీసీ చైర్మన్, ఎండీ సంజీవ్ పురి పారితోషికం గతేడాది (2022–23) 53 శాతం పెరిగి రూ.16.31 కోట్లకు చేరింది. ఇందులో కనీస వేతనం రూ.2.88 కోట్లు కాగా, పనితీరు ఆధారిత బోనస్, ఇతర ప్రోత్సాహకాలు, కమీషన్ మొత్తం రూ.12.86 కోట్లుగా ఉంది. 2021–22 సంవత్సరానికి సంజీవ్ పురి అందుకున్న వేతనం రూ.10.66 కోట్లు. ఆగస్ట్ 11న ఐటీసీ వార్షిక సాధారణ సమావేశం జరగనుంది. సంజీవ్ పురిని మరో ఐదేళ్లపాటు ఎండీ, చైర్మన్‌గా నియమించే ప్రతిపాదనకు వాటాదారుల ఆమోదం కోరనుంది. 2019 జూలై 22న ఐటీసీ ఎండీగా ఆయన నియమితులయ్యారు. 2024 జూలై 21 వరకు ఆయన పదవీకాలం అమల్లో ఉంది. ఆ తర్వాత నుంచి ఐదేళ్లు లేదంటే ఆయన కోరుకున్నంత వరకు ఎండీ, చైర్మన్‌గా కంపెనీ తిరిగి నియమించనుంది. ఐటీసీలో పురి తర్వాత అత్యధికంగా నకుల్ ఆనంద్ రూ.8.18 కోట్ల పారితోషికం అందుకున్నారు.

క్లుప్తంగా...

వివేక్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బరంపురం: ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురం దగ్గర కన్యాకుమారి నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్ రైలులో మంటలు చెలరేగాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే అధికారులు, బరంపురం సబ్ కలెక్టర్ అశుతోష్ కులకర్ణి తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం మధ్యాహ్నం కన్యాకుమారి నుంచి పశ్చిమ బెంగాల్ వెళుతోన్న వివేక్ ఎక్స్‌ప్రెస్ సూపర్ ఫాస్ట్ రైలు 10వ నంబర్ బోగీలో హఠాత్తుగా మంటలు వచ్చాయి. లోకో పైలట్ అప్రమత్తమై రైలుని స్టేషన్ ఔటర్‌లో నిలిపివేశారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రయాణికులను దించి, మంటలను అదుపు చేశారు. అనంతరం రైలు యథావిధిగా బయల్దేరింది. కాగా, ఎస్10 బోగి చక్రంలో ఓ సంచి ఇరుక్కుపోవడంతో బ్రేక్ బైండింగ్ అయ్యి మంటలు వెలువడ్డాయని, సంచిని వెంటనే తొలిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పలు రైళ్లు ఆలస్యంగా నడిచాయి.

రైలులో విరిగిన ఎయిర్ స్ప్రింగ్

40 నిమిషాల్లో మరమ్మతులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): ప్రయాణికులతో నడుస్తున్న రైలులోని ఓ కోచ్‌లో ఎయిర్ స్ప్రింగ్ విరిగిపోగా.. విజయవాడ సిబ్బంది 40 నిమిషాల్లోనే విజయవంతంగా మరమ్మతులు చేశారు. అలప్పుజ–ధన్‌బాద్ (13352) ఎక్స్‌ప్రెస్‌లోని ఒక కోచ్‌లో ఎయిర్ స్ప్రింగ్ విరిగిపోయి ఉండటాన్ని పాలక్కాడ్ డివిజన్ సిబ్బంది గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో 130 కి.మీ. వేగంతో పరుగులు తీస్తున్న రైలును 60 కి.మీ. వేగానికి నియంత్రించారు. రైలు మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు విజయవాడ చేరుకోగా.. అప్పటికే సిద్ధంగా ఉన్న 20 మంది సిబ్బంది ప్రయాణికులను కిందకు దించారు. జాకీలు ఉపయోగించి కోచ్‌ను పైకెత్తి దెబ్బతిన్న ఎయిర్ స్ప్రింగ్‌ను తొలగించి.. కొత్తది ఏర్పాటు చేశారు. అనంతరం రైలు మళ్లీ 130 కి.మీ. వేగంతో పరుగులు తీసింది. విజయవాడ రైల్వే డీఆర్‌ఎం షివేంద్రమోహన్ మాట్లాడుతూ.. తక్కువ సమయంలో ఇలాంటి మరమ్మతులు చేపట్టడం అసాధ్యమని, కానీ సిబ్బంది కృషి వల్ల సాధ్యమయ్యిందన్నారు.

తిరుపతి మార్గంలో పలు రైళ్లు రద్దు

తిరుపతి రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే కొన్ని రైళ్లను పూర్తిగా, కొన్నింటిని పాక్షికంగా రద్దుచేసినట్లు విజయవాడ రైల్వే పీఆర్‌వో నుస్రత్ మండ్రూప్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

75 శాతం ఉద్యోగాలు స్థానికులకే

▶ మొదటి పేజీ తరువాయి



పెట్టుబడులతో 10,181 ఉద్యోగాలను కల్పించే పలు ప్రాజెక్టుల ప్రతిపాదనలకు ఎస్‌ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..

స్థానికుల సహకారం కీలకం..

ప్రైవేట్ సహా అన్ని రకాల పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలను స్థానికులకే ఇవ్వాలి. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి. ఇది అత్యంత ముఖ్యమైనది. ఉద్యోగాలను కల్పిస్తున్న పరిశ్రమలకు అన్ని రకాలుగా తోడుగా నిలుస్తున్నాం. భూములు, ఇతర వనరులను సమకూరుస్తున్నాం. ఒక పరిశ్రమ ఏర్పాటై సమర్థంగా నడవాలంటే స్థానికుల సహకారం ఎంతో అవసరం. స్థానిక ప్రజల మద్దతుతోనే ఇది సాధ్యం. అందుకనే 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి. స్థానికంగా ఆయా పరిశ్రమల పట్ల ఎలాంటి వ్యతిరేకత ఉండకూడదనే ఇవన్నీ చేస్తున్నాం. రాష్ట్రంలో నైపుణ్యాలకు కొదవలేదు. సరిపడా మానవ వనరులున్నాయి.

పంట ఉత్పత్తులకు 'మద్దతు' తప్పనిసరి

కంపెనీలు ఏవైనా సరే.. రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేసినప్పుడు కనీస మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేయాల్సిందే. ఈమేరకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. పరిశ్రమలు వీలైనంత ఎక్కువగా శుద్ధి చేసిన, డీశాలినేషన్ నీటినే వినియోగించుకునేలా చూడాలి. జనాభా పెరుగుతున్న కొద్దీ తాగునీటికి, వ్యవసాయానికి నీటి కొరత తలెత్తకుండా ఉండేందుకు డీశాలినేషన్ లాంటి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వీలైనంత ఎక్కువగా పరిశ్రమలకు నీటిని సమకూర్చడంపై దృష్టి పెట్టాలి. ఇజ్రాయిల్ తరహా విధానాలతో ముందుకు సాగాలి.

హాజరైన మంత్రులు, ఉన్నతాధికారులు

ఎస్‌ఐపీబీ సమావేశంలో ఉపముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ) బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా, వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, పరిశ్రమలశాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవన్, రెవెన్యూ, పర్యాటకశాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ఎస్ రావత్, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ జి.సాయిప్రసాద్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, జీఏడీ స్పెషల్ సీఎస్ కె.ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, మార్కెటింగ్, సహకారశాఖ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ముఖ్య కార్యదర్శి కె. సునీత, పరిశ్రమలశాఖ కమిషనర్ ప్రవీణ్ కుమార్, ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ వీసీ అండ్ ఎండీ ఎస్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐపీబీ ఆమోదించిన ప్రతిపాదిత ప్రాజెక్టులివీ..

1. వైఎస్సార్ జిల్లా వేంపల్లె మండలం అశోక్‌నగర్, ఐక్కన్నవారి పల్లె వద్ద 1,500 మెగావాట్ల హైడ్రో స్టోరేజీ పవర్ ప్రాజెక్టు నెలకొల్పనున్న జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్. రూ.8,104 కోట్ల పెట్టుబడితో డిసెంబర్ 2024లో పనులు ప్రారంభించేలా చర్యలు. ఏటా 3,314.93 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి లక్ష్యం. దాదాపు 1,500 మందికి ఉద్యోగావకాశాలు.
2. నంద్యాల జిల్లా కోటపాడులో సోలార్, అనంతపురం జిల్లా బోయల ఉప్పలూరు, నంద్యాల, వైఎస్సార్ జిల్లాలో హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ అనుబంధ సంస్థ క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటు. 225 మెగావాట్ల సోలార్, 150 మెగావాట్ల విండ్ పవర్ ఉత్పత్తి. రూ.2,450 కోట్ల పెట్టుబడితో 2023 అక్టోబరులో పనులు ప్రారంభం. చివరి దశ 2025 అక్టోబరుకు పూర్తిచేయాలన్నది లక్ష్యం. 375 మందికి ఉద్యోగావకాశాలు.
3. విశాఖ జిల్లా అన్నవరంలో మేఫెయిర్ హోటళ్లు, రిసార్టుల ఏర్పాటు. రూ.525 కోట్ల పెట్టుబడితో 750 మందికి ప్రత్యక్షంగా, 1000 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు. నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి. ప్రాజెక్టులో భాగంగా కన్వెన్షన్ సెంటర్, 250 హోటల్ గదులు, మినీ గోల్ఫ్ కోర్టు నిర్మాణం. షాపింగ్ మాల్ సహా విల్లాల సదుపాయం.
4. తిరుపతి పేరూరు వద్ద రూ. 218 కోట్లతో హయత్ ఇంటర్‌నేషనల్ హోటల్ నిర్మాణం. 260 మందికి ప్రత్యక్షంగా, 1,296 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు. మూడున్నరేళ్లలో పూర్తి కానున్న ప్రాజెక్టు.
5. విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలోని కృష్ణపాలెం వద్ద హిందుస్థాన్ కోకోకోలా బెవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ యూనిట్ ఏర్పాటు. రూ.1,200 కోట్ల పెట్టుబడితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,800 మందికి ఉద్యోగావకాశాలు.
6. తిరుపతి జిల్లా వరదాయ పాలెం మండలం కువ్వకోలి వద్ద సీసీఎల్ ఫుడ్, బెవరేజెస్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు. రూ.400 కోట్ల పెట్టుబడితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మందికి ఉద్యోగ అవకాశాలు. కాఫీ సాగుదారులు 2,500 మందికి కూడా లబ్ధి. ఏడాదికి 16 వేల టన్నుల ఉత్పత్తి లక్ష్యం.
7. నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలో గోకుల్ ఆగ్రో రిసోర్స్ లిమిటెడ్ కంపెనీతో ఎడిబుల్ ఆయిల్ తయారీ ఫ్యాక్టరీ. రూ.230 కోట్ల పెట్టుబడి. రోజుకు 1400 టన్నులు ఉత్పత్తి. ప్రత్యక్షంగా 350 మందికి, పరోక్షంగా 850 మందికి ఉద్యోగావకాశాలు. 2500 మంది రైతులకూ ఉపయోగం.
8. తిరుపతి జిల్లా శ్రీ సిటీ వద్ద కోకో బటర్, కోకో పౌడర్, కోకో మాస్ తయారీ ఫ్యాక్టరీ నిర్మాణం. ఏడాదికి 40 వేల టన్నుల తయారీ లక్ష్యం. రూ.168 కోట్ల పెట్టుబడితో 250 మందికి ప్రత్యక్షంగా, 800 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు. ఫ్యాక్టరీ ఏర్పాటుతో 3 వేల మంది రైతులకు కూడా ప్రయోజనం.

మార్గదర్శిలో 'నల్ల' ఇంధనం!

▶ మొదటి పేజీ తరువాయి

నల్లధనం వ్యవహారాలను వెలికి తీసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం చిట్‌ఫండ్ సంస్థలు డిపాజిట్లను వసూలు చేయకూడదు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం యథేచ్ఛగా అక్రమ డిపాజిట్లు వసూలు చేస్తున్నట్లు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, సీఐడీ అధికారులు వేర్వేరుగా నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. అక్రమ డిపాజిట్లకు సంబంధించి పూర్తి వివరాలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ వెల్లడించలేదు. రశీదుల పేరిట భారీ ఎత్తున నల్లధనం దందా సాగిస్తున్నట్లు సీఐడీ ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం.

ఆదాయ వివరాల పరిశీలన..

రాష్ట్రవ్యాప్తంగా 37 మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో రశీదుల పేరిట డిపాజిట్ చేసిన వారి వివరాలను సీఐడీ సేకరించింది. డిపాజిట్‌దారుల వృత్తి, వ్యాపారాలు, ఆదాయ మార్గాలు, ఇతర వివరాలతో సీఐడీ అధికారులు ఇప్పటికే నివేదిక రూపొందించారు. మొదటి దశలో రూ.కోటి అంతకంటే ఎక్కువ డిపాజిట్ చేసినవారికి నోటీసులు జారీ చేశారు. డిపాజిట్ చేసిన ఆ మొత్తాన్ని ఎలాంటి ఆదాయ మార్గాల ద్వారా సేకరించారు? మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లోనే ఎందుకు డిపాజిట్ చేశారు? తదితర వివరాలను వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నిర్ణీత గడువులోగా దర్యాప్తు సంస్థకు ఈ సమాచారాన్ని అందించాల్సి ఉంటుంది. డిపాజిట్‌దారులు లిఖితపూర్వకంగా తెలిపే వివరాలను సీఐడీ అధికారులు మరోసారి క్షుణ్నంగా పరిశీలించి వాస్తవికతను నిగ్గు తేలుస్తారు. ఆర్బీఐ, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు నిబంధనలను ఎందుకు పాటించలేదు? అనే కోణాల్లో విచారణను వేగవంతం చేయనున్నారు. తద్వారా నల్లధనం వ్యవహారాలపై ఒక నిర్ధారణకు వస్తారు. అనంతరం తదుపరి చర్యలు చేపడతారు.

మూసివేసిన చిట్టీల నిర్వహణకు ప్రత్యేక అధికారి!

కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించినందున మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థకు చెందిన 23 చిట్టీ గ్రూపులను మూసివేయాలని స్టాంపులు–రిజిస్ట్రేషన్లశాఖ ఇప్పటికే ఆదేశించింది. ఆ మేరకు చిట్టీ గ్రూపుల మూసివేత దాదాపు పూర్తయ్యింది. మరిన్ని గ్రూపులను మూసివేసే దిశగా అధికారులు చర్యలు వేగవంతం చేశారు. ఈమేరకు ఇప్పటికే గుర్తించిన అక్రమాలతో నివేదికను రూపొందిస్తున్నారు. మూసివేసిన చిట్టీల నిర్వహణ పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక అధీకృత అధికారిని నియమించడానికి సన్నద్ధమవుతున్నారు. మూసివేసిన చిట్టీల గ్రూపుల్లోని చందాదారులు మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్రాంచి మేనేజర్లకు చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇప్పటికే చిట్టీ పాట పాడిన చందాదారులు మిగిలిన వాయిదాలను చెల్లించాలి. మూసివేసిన చిట్టీ గ్రూపుల చందాదారులకు వారి మొత్తాన్ని తిరిగి చెల్లించే ప్రక్రియ పర్యవేక్షణకు అధీకృత అధికారిని నియమిస్తూ త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు

కేటాయించి 20 ఏళ్లు పూర్తయితే అమ్ముకునే హక్కు

- 22 (ఎ) నుంచి 1.60 లక్షల ఎకరాల సర్వీస్ ఈనాం భూముల తొలగింపు
- 1,700 దళిత వాడల్లో శ్మశాన వాటికలకు వెయ్యి ఎకరాలు
- నేడు మంత్రివర్గంలో ఆమోదించే అవకాశం

సాక్షి, అమరావతి: అసైన్డ్ భూములపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనుంది. కేటాయించి (అసైన్ చేసి) 20 సంవత్సరాలు పూర్తయిన భూములపై సంబంధిత రైతులకు యాజమాన్య హక్కులు కల్పించనుంది. బుధవారం జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి ఆమోదముద్ర వేయనున్నట్లు సమాచారం. ప్రభుత్వాలు గతంలో తమకు కేటాయించిన భూములను (అసైన్డ్ భూములు) అమ్ముకునేందుకు హక్కు కల్పించాలని పలు జిల్లాల్లో రైతులు జిల్లా కలెక్టర్లు, ప్రజాప్రతినిధులను కోరుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోనున్నారు. తమకు కేటాయించిన భూములను పేదలు అనుభవించడం మినహా వాటిపై అమ్ముకునే హక్కులు లేవు. 1954కి ముందు కేటాయించిన భూములను మాత్రమే అమ్ముకునేందుకు హక్కు ఉంది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి భూములు పొందిన లక్షలాది మంది రైతులు వాటిల్లో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వాటిని అమ్ముకోవడానికి, వాటిపై బ్యాంకు రుణాలు తీసుకోవడానికి అవకాశం లేదు. కాగా, అసైన్డ్ రైతులకు పూర్తి యాజమాన్య హక్కుల విషయంపై గత ప్రభుత్వాలు కమిటీలు వేసినా నిర్ణయం మాత్రం తీసుకోలేదు. అసైన్డ్ భూములపై నిర్ణయం తీసుకుని అర్హులైన రైతులకు మేలు చేయాలని ఇప్పుడు ప్రభుత్వం భావించింది. దీనిపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో నలుగురు మంత్రులు, 9 మంది ఎమ్మెల్యేలతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పలుమార్లు సమావేశమై అధ్యయనం చేసింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ పర్యటించి అక్కడ అసైన్డ్ భూములపై అర్హులకు హక్కులు కల్పించిన తీరు, అందుకు అనుసరించిన విధానం, పర్యవసానాలు తదితర అంశాలపై ఆ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో కమిటీ చర్చించింది. అసైన్డ్ భూములపై హక్కులు కల్పించేందుకు ఉన్న అవకాశాలపై విస్తృతంగా పరిశోధించింది. వాటన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కేటాయించి 20 సంవత్సరాలు పూర్తయిన భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసులను మంత్రివర్గం ఆమోదించనున్నట్లు తెలిసింది. అసైన్డ్ భూముల్లో కేటాయించిన వ్యక్తుల చేతుల్లో ఉంటేనే అమ్ముకునే హక్కు ఇవ్వనున్నారు.

22 (ఎ) నుంచి 1.60 లక్షల ఎకరాలకు విముక్తి

గ్రామాల్లో సర్వీస్ ఈనాం భూములను 22 (ఎ) జాబితా నుంచి తొలగించేందుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చే అవకాశం కూడా ఉంది. గ్రామాల్లో రజక, నాయీబ్రాహ్మణ, కంసాలి, కుమ్మరి, కమ్మరి, బారికి వంటి సేవలు (గ్రామానికి సేవ చేసే వృత్తులు) చేసే వారికి గతంలో ఈనాం కింద భూములు ఇచ్చారు. కాలక్రమంలో వాటిని నిషేధిత ఆస్తుల జాబితాలో పెట్టారు. అలాంటి విలేజ్ సర్వీస్ ఈనాం భూములు రాష్ట్రంలో 1.60 లక్షల ఎకరాలు ఉన్నాయి. వాటిని నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడం ద్వారా లక్షల మందికి మేలు చేకూర్చనున్నారు.

1,700 దళితవాడలకు శ్మశాన వాటికలు

శ్మశాన వాటికలు లేని దళితవాడలకు వాటిని ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఇందుకోసం 1,700 గ్రామాల్లో 1,000 ఎకరాలు కేటాయించనున్నారు. ఎకరం లోపు భూమిని శ్మశాన వాటికల ఏర్పాటు నిమిత్తం కేటాయించే అధికారాలను కలెక్టర్లకు ఇవ్వనున్నారు.

క్లుప్తంగా...

వచ్చే నెలలో డీఎస్సీ ప్రకటించే అవకాశం

విద్యా శాఖ మంత్రి బొత్స



రాజాం: వచ్చే నెలలో డీఎస్సీ ప్రకటించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఆయన మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. వేగంగా డీఎస్సీ ప్రకటించి, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఖాళీల వివరాల సేకరణతో పాటు డీఎస్సీ నిర్వహణకు సంబంధిత అధికారులతో ఏర్పాట్లు చేయిస్తున్నారని వివరించారు.

750 పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్బులు

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థి దశ నుంచే వినియోగదారుల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పరిధిలోని 750 స్కూళ్లలో వినియోగదారుల క్లబ్బులను ఏర్పాటు చేసి విద్యార్థులకు వినియోగదారుల బాధ్యతలు, హక్కులపై శిక్షణ కల్పించేందుకు జిల్లాకు ఇద్దరు చొప్పున మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేశామన్నారు. మంగళవారం 'తెలివైన కొనుగోలు', 'ఆహార కల్తీ విషయంలో పిల్లలకు అవగాహన కల్పించడం ఎలా?', 'వినియోగదారుల రక్షణ చట్టం -2019లో ముఖ్యాంశాలు', 'సైబర్ సేఫ్టీ', 'పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశాలపై మాస్టర్ ట్రైనర్లకు వర్చువల్‌గా శిక్షణ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ..వినియోగదారుల వ్యవహారాలకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)ను నోడల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించిందన్నారు. కొత్త చట్టం ప్రకారం ఎక్కడ వస్తువు కొనుగోలు చేసినప్పటికీ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. వినియోగదారుల ఉద్యమకర్త చిరంజీవి దాస్, గుంటూరు జిల్లా కమిషన్ అధ్యక్షురాలు సునీత, గుంటూరు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్ర ఇన్‌చార్జి చదలవాడ హరిబాబు, ఎయిమ్స్(మంగళగిరి) ఎథిక్స్ కమిటీ సభ్యుడు కృష్ణమోహన్, కాకినాడ జిల్లా కమిషన్ సభ్యులు సుశీల, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సలహాదారు పీవీవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

ఇంటర్ 'రీవెరిఫికేషన్' ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల రీవెరిఫికేషన్, రీకౌంటింగ్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఫలితాలను https://bie.ap.gov.in లో చూడవచ్చన్నారు.

పుస్తకాల పంపిణీకి పక్కా ప్రణాళిక

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలను ఈ నెల 22న ఏకకాలంలో విజయవంతంగా పంపిణీ చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి అరుణ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా అధికారులతో వారిద్దరూ సంయుక్తంగా వీడియో సమావేశం నిర్వహించారు. అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రవాణా ఇబ్బందులు, పంపిణీలో తలెత్తే సమస్యలపై ఆరా తీసి పరిష్కార మార్గాలను సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా సప్లై అధికారులు, పాఠ్యపుస్తకాల మేనేజర్లు సమన్వయంతో పనిచేసి పుస్తకాల పంపిణీని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, ప్రభుత్వ పాఠ్య పుస్తకాల డైరెక్టర్ కె.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వివిధ ఉద్యోగాల సీపీటీ ఫలితాల వెల్లడి

సాక్షి, అమరావతి: వివిధ పోస్టులకు ఈ ఏడాది మే 26, 27 తేదీల్లో నిర్వహించిన కంప్యూటర్ ప్రావీణ్య పరీక్ష (సీపీటీ) ఫలితాలను మంగళవారం ఏపీపీఎస్సీ వెల్లడించింది. ఇందులో గ్రామ, వార్డు కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్–5, గ్రేడ్–1, 2 వీఆర్వోలతోపాటు కారుణ్య నియామకం కింద 2014 మే 12 తరువాత విధుల్లో చేరి పదోన్నతులు పొందిన సీనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. ఫలితాలను www. psc. ap. gov. inలో ఉంచినట్టు ఏపీపీఎస్సీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్ తెలిపారు.

ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ పదవీ కాలం పొడిగింపు

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) చైర్మన్ బక్కపట్నం నవీన్ నిశ్చల్ పదవీ కాలం పొడిగిస్తూ వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాల కృష్ణ ద్వివేది మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ పదవిలో నవీన్ నిశ్చల్ మరో ఏడాది పాటు కొనసాగనున్నారు.

గోదావరి నికర జలాల్లో మిగులే లేదు

అలాంటప్పుడు కావేరి–గోదావరి అనుసంధానం ఎలా సాధ్యం

- తీవ్ర అభ్యంతరం తెలిపిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవనరుల అధికారులు
- ఎన్‌డబ్ల్యూడీఏ 71వ పాలక మండలి సమావేశంలో వాడివేడిగా చర్చ
- నికర జలాల్లో మిగులు లేదన్నది వాస్తవమేనన్న ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ
- ఛత్తీస్‌గఢ్ వాడుకోని నీటితో అనుసంధానం చేపడతామని వెల్లడి
- తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖ అధికారులు
- ఏకాభిప్రాయంతోనే అనుసంధానమన్న కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి



సాక్షి, అమరావతి: గోదావరి నికర జలాల్లో మిగులు లేదని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తేల్చిన నేపథ్యంలో గోదావరి–కావేరి అనుసంధానాన్ని ఎలా చేపడతారని ఎన్‌డబ్ల్యూడీఏ(జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ)ను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవనరుల శాఖల అధికారులు నిలదీశారు. గోదావరి బేసిన్‌లో రెండు రాష్ట్రాల్లో పూర్తయిన, నిర్మాణం, ప్రతిపాదన దశలో ఉన్న ప్రాజెక్టులకే 306 టీఎంసీల మేర నికర జలాల కొరత ఉందని సీడబ్ల్యూసీ తేల్చిన అంశాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను తరలిస్తే రాష్ట్రాల్లో ప్రాజెక్టుల ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందన్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ కార్యదర్శి పంకజ్‌కుమార్ అధ్యక్షతన ఎన్‌డబ్ల్యూడీఏ 71వ పాలక మండలి సమావేశం మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ, తెలంగాణ అభ్యంతరాలపై ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ భోపాల్ సింగ్ స్పందిస్తూ.. గోదావరి నికర జలాల్లో మిగులు లేని మాట వాస్తవమేనని అంగీకరించారు. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.26 టీఎంసీలను తరలించేలా గోదావరి–కావేరి అనుసంధానాన్ని చేపడతామని చెప్పారు. దీనిపై ఛత్తీస్‌గఢ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మా కోటా నీటిని ఎలా తరలిస్తారని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్ కోటా నీటిని వాడుకోవడానికి ప్రాజెక్టులు కట్టేలోగా మహానది నుంచి గోదావరికి 314 టీఎంసీలు తెస్తామని.. అప్పుడు ఆ నీటిని కావేరికి తరలిస్తామని ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్ చెప్పారు. ఈ సమయంలో పంకజ్‌కుమార్ స్పందిస్తూ.. గోదావరి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చాకే గోదావరి–కావేరి అనుసంధానం చేపడతామని తేల్చిచెప్పారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ కుశ్వీందర్‌సింగ్ వోరాతో పాటు అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనుసంధానానికి సిద్ధమంటూ..

గోదావరిలో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.26 టీఎంసీలను ఇచ్ఛంపల్లి నుంచి నాగార్జునసాగర్ (కృష్ణా), సోమశిల (పెన్నా) మీదుగా గ్రాండ్ ఆనకట్ట (కావేరి)కి తరలించడానికి రూపొందించిన గోదావరి–కావేరి అనుసంధానం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు ఇచ్చామని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్‌సింగ్ చెప్పారు. ఇందులో తెలంగాణకు 45, ఏపీకి 44, తమిళనాడుకు 40, కర్ణాటకకు 9.9, పుదుచ్చేరికి 2.1 టీఎంసీలు ఇస్తామని పేర్కొన్నారు. దీనిపై ఇప్పటికే నాలుగు సార్లు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపామని.. అనుసంధానం పనులు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పడంతో ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

నికర జలాల్లో మిగులేది..

గోదావరి నికర జలాల్లో మిగులు లేదని, తెలుగు రాష్ట్రాల్లో చేపట్టిన, ప్రతిపాదనలో ఉన్న ప్రాజెక్టులకే నీటి కొరత ఏర్పడుతుందని సీడబ్ల్యూసీ చైర్మన్ వోరా సమావేశంలో చెప్పారు. ఇదే అంశాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధికారులు ప్రస్తావిస్తూ.. ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని నీటిని తరలించినా రెండు రాష్ట్రాల అవసరాలు తీర్చాకే కావేరికి గోదావరిని తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. కోటా నీటిని వాడుకోవడానికి ప్రాజెక్టులు కడుతున్నామని.. ఎట్టిపరిస్థితుల్లోనూ గోదావరి–కావేరి అనుసంధానానికి అంగీకరించబోమని ఛత్తీస్‌గఢ్ అధికారులు తేల్చిచెప్పారు. ఈ క్రమంలో మీరు ప్రాజెక్టులు కట్టేలోగా మహానది నుంచి గోదావరికి జలాలను తరలిస్తామని.. వాటిని కావేరికి తీసుకెళ్తామని ఛత్తీస్‌గఢ్ అధికారులకు ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ సరిదిద్దిచెప్పబోగా ఏపీ, తెలంగాణ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మహానది నుంచి గోదావరికి జలాలను తెచ్చినా సరే.. రెండు రాష్ట్రాల అవసరాలు తీర్చాకే కావేరికి గోదావరిని తరలించాలని స్పష్టం చేశారు. రెండు రాష్ట్రాల ప్రాజెక్టుల ఆయకట్టు ప్రయోజనాలకు విఘాతం కల్గించేలా చేపట్టే గోదావరి–కావేరి అనుసంధానానికి అంగీకరించే ప్రశ్నే లేదని తేల్చిచెప్పారు.

షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరిట రూ.4 కోట్లు స్వాహా

- మోసపోయిన 19 మంది
- పత్తాలేని ఈక్విటీ నాక్స్ యజమాని రాహుల్ సింగ్
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పేరిట విశాఖపట్నంలో చేసిన ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. రూ.4 కోట్ల వరకు పెట్టుబడి పెట్టిన 19 మంది పోలీసుల్ని ఆశ్రయించారు. జార్ఖండ్‌కు చెందిన రాహుల్ సింగ్ విశాఖలోని సత్యం కూడలి సమీపంలో ఈక్విటీ నాక్స్ పేరుతో స్టాక్ మార్కెట్ బిజినెస్ కార్యాలయాన్ని ప్రారంభించాడు. తాను షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి అత్యధిక లాభాలను ఆర్జిస్తున్నట్లు నగరానికి చెందిన పలువురి వద్ద నమ్మబలికాడు. విశాఖలోని బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ గ్రూప్‌లో చేరి నగరంలో వేర్వేరు వ్యాపారరంగాల్లో ఉన్నవారితో పరిచయం చేసుకున్నాడు. తన కార్యాలయానికి ఆహ్వానించి లాభాలు వస్తాయని నమ్మించాడు. ఇలా 19 మందిని నమ్మించి షేర్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరిట రూ.4 కోట్ల వరకు తీసుకున్నాడు. వారికి నూటికి రూ.3 వడ్డీరేటుతో లాభాలను కొంత కాలం ఇచ్చాడు. కొన్ని నెలలుగా పెట్టుబడులు పెట్టిన వారికి నెలనెలా ఇవ్వాల్సిన లాభాలను ఇవ్వకపోవడంతో వారు ప్రశ్నించారు. తాను ముంబైలో ఉన్న చాయిస్ స్టాక్ ఎక్స్ఛేంజ్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నానని, పెట్టుబడులు వారికి మళ్లించానని, అందువల్ల లాభాల కోసం కొంతకాలం వేచి చూడాలని చెప్పాడు. ఇలా కొంత కాలం వ్యవహారం నడిపిన రాహుల్ సింగ్ షేర్ మార్కెట్ పనిమీద కోల్‌కతా వెళుతున్నానని చెప్పి వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగి రాలేదు. గత నెల 16వ తేదీన అతడి భార్య ఈక్విటీ నాక్స్ కార్యాలయానికి తాళాలు వేసి జార్ఖండ్ వెళ్లిపోయింది. దీంతో తాము మోసపోయినట్లు గ్రహించిన 19 మంది సోమవారం స్పందనలో నగర పోలీసు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

చట్టప్రకారం పోస్టులను భర్తీ చేయండి


- ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి 2017, 2018 సంవత్సరాల్లో వేర్వేరుగా దాఖలు చేసిన నోటిఫికేషన్లను రద్దుచేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో ఏ మాత్రం తప్పులేదని, కాబట్టి అందువల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కూడా ఏమీలేదని తేల్చిచెప్పింది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి చట్ట నిబంధనలకు లోబడి తిరిగి నోటిఫికేషన్లు జారీచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. విద్యార్థులు, విద్యా సంస్థల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఈ ప్రక్రియను రెండు నెలల్లో పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది.విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీ నిమిత్తం 2017, 2018 సంవత్సరాల్లో నోటిఫికేషన్లు జారీచేశారు. వీటిని సవాలు చేస్తూ 2018లో పలు పిటిషన్లు హైకోర్టులో దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలపై సింగిల్ జడ్జి జస్టిస్ రావు రఘునందన్‌రావు విచారణ జరిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. పోస్టుల భర్తీలో రిజర్వేషన్లకు సంబంధించి సబ్జెక్టును కాకుండా ఆయా కాలేజీ, యూనివర్సిటీని యూనిట్‌గా పరిగణనలోకి తీసుకోవడాన్ని తప్పుపట్టారు. ప్రొఫెసర్ల పోస్టుల భర్తీలో దివ్యాంగులకు, అణగారిన వర్గాలకు, మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును సవాలుచేస్తూ పలువురు అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై ధర్మాసనం విచారణ జరిపి సింగిల్ జడ్జి తీర్పును సమర్థించింది.

'రాజధాని' వ్యాజ్యాలన్నీ త్రిసభ్య ధర్మాసనానికి

రాజధానిలో పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల వ్యవహారంలో హైకోర్టులో కీలక పరిణామం

- అన్ని వ్యాజ్యాలను తామే విచారిస్తామన్న త్రిసభ్య ధర్మాసనం
- ఆర్ 5 జోన్ ఏర్పాటు, జీవో 45పై వ్యాజ్యాలను మేమే విచారిస్తాం
- ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలన్న అనుబంధ వ్యాజ్యంపైనా విచారణ జరుపుతాం
- ఇవన్నీ ఒకే అభ్యర్థనలున్న వ్యాజ్యాలు
- తేల్చి చెప్పిన త్రిసభ్య ధర్మాసనం.. విచారణ 17కి వాయిదా



సాక్షి, అమరావతి: రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకిచ్చిన ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలను అడ్డుకునే దిశగా టీడీపీ దాఖలు చేయించిన పిటిషన్‌లో మంగళవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. రాజధానిలో పేదల ఇళ్ల నిర్మాణాలను సవాలు చేస్తూ దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యంతో పాటు రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు ఆర్ 5 జోన్‌ను సృష్టిస్తూ ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని, 1402 ఎకరాలు ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయిస్తూ జారీ చేసిన జీవో 45ను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను ద్విసభ్య ధర్మాసనానికి పంపేందుకు ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విముఖత వ్యక్తం చేసింది. సవరణ చట్టం, జీవో 45పై వ్యాజ్యాలన్నింటినీ వేర్వేరు ధర్మాసనాలు విచారించడం, వైరుధ్యమైన ఉత్తర్వులు రావడం అవసరం లేదని తెలిపింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ తామే విచారిస్తామని స్పష్టంచేసింది. వాటన్నింటినీ తమ ముందుంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ప్రధాన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వుల కోసం దాఖలు చేసిన అనుబంధ వ్యాజ్యాలన్నింటిలో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఆర్‌డీఏని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హరీలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులతో ఇళ్ల నిర్మాణాలను సవాలు చేస్తూ ఇద్దరు న్యాయమూర్తుల ముందున్న వ్యాజ్యం కూడా త్రిసభ్య ధర్మాసనం ముందుకే వస్తుంది.

రాజధాని ప్రాంతంలో సదుపాయాల కల్పన, అభివృద్ధి చేసిన ప్లాట్లను రైతులకు అప్పగించాలంటూ హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయడంలేదంటూ రైతులు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాలు మంగళవారం త్రిసభ్య ధర్మాసనం ముందుకు వచ్చాయి. రాజధానిపై ఇతర వ్యాజ్యాలు కూడా విచారణకు వచ్చాయి. రైతుల తరఫున సీనియర్ న్యాయవాది ఉన్నం మురళీధరరావు వాదనలు వినిపిస్తూ.. రాజధాని ప్రాంతంలో పేదలకిచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అన్నీ సిద్ధం చేసిందని, రేపు హైకోర్టు వ్యతిరేకంగా తీర్పునిస్తే ఇళ్ల నిర్మాణం కోసం వెచ్చించిన ప్రజాధనం వృథా అవుతుందని అన్నారు. అందుకే ఇళ్ల నిర్మాణాన్ని నిలిపేయాలని కోరుతూ అనుబంధ వ్యాజ్యం దాఖలు చేశామని చెప్పారు. ఆర్ 5 జోన్‌లో ఇళ్ల స్థలాలపై వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనమే ఈ వ్యాజ్యాన్ని కూడా విచారించడం సబబుగా ఉంటుందని తెలిపారు. సీఆర్‌డీఏ న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. సవరణ చట్టం, జీవో 45పై గతంలో దాఖలు చేసిన వ్యాజ్యాల్లో ఉన్న అభ్యర్థనలే తాజా వ్యాజ్యంలో కూడా ఉన్నాయన్నారు. ఇళ్ల నిర్మాణం అన్నది తాజా వ్యాజ్యం దాఖలు చేయడానికి కారణమని, అందువల్లే ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చిందని మురళీధరరావు తెలిపారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ స్పందిస్తూ.. గతంలో దాఖలు చేసిన వ్యాజ్యాలకు, తాజా వ్యాజ్యానికి పెద్ద తేడా ఏమీ లేదన్నారు. అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇళ్ల నిర్మాణం మినహా మిగిలిన అభ్యర్థలన్నీ ఒకటేనన్నారు. గతంలో సవరణ చట్టాన్ని, జీవో 45ను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు త్రిసభ్య ధర్మాసనం ముందే ఉన్నాయన్నారు. అందువల్ల తాజా వ్యాజ్యాన్ని కూడా త్రిసభ్య ధర్మాసనమే విచారించడం సబబుగా ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా ధర్మాసనం అన్ని వ్యాజ్యాలలోని అభ్యర్థనలను పరిశీలించింది. అన్ని వ్యాజ్యాల్లోని అభ్యర్థనలు ఒకేలా ఉన్నాయని స్పష్టం చేసింది.

కోర్టు ధిక్కార వ్యాజ్యాల్లో విచారణ 8 వారాలకు వాయిదా...


రాజధాని ప్రాంతం అభివృద్ధి విషయంలో దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్లపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. రాజధానికి సంబంధించి తాము దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు విచారణ జరుపుతోందన్నారు. ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా, అదే అంశంపై దిగువ న్యాయస్థానాలు విచారణ జరపడం సబబుగా ఉండదని వివరించారు. ఈ వాదనలతో త్రిసభ్య ధర్మాసనం ఏకీభవించింది. రైతులు దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యాల విచారణను 8 వారాలకు వాయిదా వేసింది.

త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు పరిశీలించాకే..

ఇళ్ల నిర్మాణాన్ని సవాలు చేస్తూ రాజధాని రైతులు తాజాగా దాఖలు చేసిన వ్యాజ్యం జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ జ్యోతిర్మయి ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. రైతుల తరఫు న్యాయవాది ఉన్నం మురళీధరరావు, రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది (జీపీ) బి.శశిభూషణ్‌రావు ఉదయం త్రిసభ్య ధర్మాసనం ముందు జరిగిన విషయాలను వివరించారు. అన్ని వ్యాజ్యాలను విచారిస్తామని త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో ఆ ఉత్తర్వులను పరిశీలించిన తరువాత ఈ వ్యాజ్యంలో ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం తెలిపింది.

రాష్ట్రంలో విప్లవాత్మక విద్యాసంస్కరణలు


- నిర్మాణాత్మక బోధనతో భావితరాలకు ఉజ్వల భవిత
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్
- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ సదస్సు



సాక్షి, అమరావతి: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రాష్ట్రంలో విప్లవాత్మక విద్యాసంస్కరణలు అమలు చేస్తోందని పాఠశాల విద్య కమిషనర్ ఎస్.సురేశ్‌కుమార్ చెప్పారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో 259 పాఠశాలలు సీబీఎస్ఈకి అనుబంధంగా ఉంటే ఇప్పుడు 1000 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విద్యావిధానం అమలు చేయడం సీబీఎస్ఈ చరిత్రలోనే మైలురాయిగా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ నిర్మాణాత్మక బోధన అంశంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపల్స్‌కు నాలుగు రోజుల శిక్షణ సదస్సు మంగళవారం విజయవాడలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యాసంస్కరణల్లో భాగంగా సీబీఎస్ఈ పాఠశాలలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్యతో పాటు సరైన మూల్యాంకనం, విద్యార్థుల్లో ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమైక్యంగా కృషి చేయాలని కోరారు. ప్రస్తుతం ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యాసంవత్సరంలో పదోతరగతి పరీక్షలు సీబీఎస్ఈ విధానంలో రాయనున్నారని చెప్పారు. ఇక్కడ నేర్చుకున్న నైపుణ్యాలు, విద్యావిధానాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ (క్రిస్ప్) కార్యదర్శి ఆర్.సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్ రెడ్డి, మోడల్ స్కూల్ కార్యదర్శి ఎం.వి.కృష్ణారెడ్డి, వివిధ ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన పాఠశాలల ప్రిన్సిపల్స్, ఏపీ, తెలంగాణ ఎస్‌సీఈఆర్టీ, ప్రథమ్, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, రూమ్ టూ రీడ్, అజీమ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇక ఆటంకం లేని విద్యాబోధన

- క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల నియామకం
- ఉపాధ్యాయులు సెలవులో ఉన్నచోట సేవలు
- 3,489 మంది సీఆర్పీలను సీఆర్ఎంటీలుగా మార్పు
- ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలల్లో విద్యా కార్యకలాపాలకు ఆటంకం లేకుండా విద్యార్థులకు బోధన అందించేందుకు ప్రభుత్వం 'క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్' (సీఆర్ఎంటీ) వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. తద్వారా పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరైనా సెలవులో ఉంటే వారి స్థానంలో రిసోర్స్ పూల్‌లో ఉన్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ బోధన చేస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట సెలవు పెట్టినా, డెప్యుటేషన్లపై మరో చోటకు వెళ్లినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడం వల్ల బోధనకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు సీఆర్ఎంటీ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. హైస్కూల్ కాంప్లెక్స్‌లో బడి బయట పిల్లల డేటాను సేకరించి వారిని బడిలో చేర్పించేందుకు, ఇతర విధులకు 2001–09 మధ్య రెండు మూడు ఉన్నత పాఠశాలలకు ఒక్కరు చొప్పున క్లస్టర్ రిసోర్స్ పర్సన్లను (సీఆర్పీ) నియమించింది.ప్రస్తుతం ఆయా విధుల్లో చాలా వరకు ఎంఈవోలు, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో బోధనకు అన్ని అర్హతలు ఉన్న సీఆర్పీలను బోధన ప్రయోజనాల కోసం ఉపయోగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించి మండలాన్ని ఒక క్లస్టర్‌గా రిజర్వ్ మొబైల్ టీచర్లుగా వారిని నియమించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 3,489 మంది క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు ఇకపై క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లుగా మారనున్నారు. ఎంఈవో పర్యవేక్షణలో ఒక్కో సీఆర్ఎంటీ మూడు లేదా నాలుగు పాఠశాలలకు సేవలు అందించేలా విధులను నిర్ణయించారు. రాష్ట్రంలోని 9,602 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు పెట్టినప్పుడు వీరిద్వారా నిరాటంకంగా బోధన అందించవచ్చు.

నేటి నుంచి ఫీవర్ సర్వే

- ఇంటింటికీ వెళ్లనున్న వైద్య శాఖ సిబ్బంది, వలంటీర్లు
- డెంగీ, మలేరియా వంటి వ్యాధులున్న వారి గుర్తింపు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. బుధవారం నుంచి ఇంటింటి ఫీవర్ సర్వేను ప్రారంభిస్తోంది. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు రాష్ట్రంలోని 1.63 కోట్ల గృహాలను సందర్శించి డెంగీ, మలేరియా, విష జ్వరాలతో బాధపడుతున్న వారిని, లక్షణాలున్న వారిని ఈ సర్వే ద్వారా గుర్తించనున్నారు. ఈ సర్వే కోసం సోమవారం ఉన్నతాధికారులు జిల్లాల వైద్య శాఖ, ఇతర శాఖల అధికారులతో వర్చువల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే చేపట్టాల్సిన విధానం, మార్గదర్శకాలను వివరించారు. కరోనా వ్యాప్తి సమయంలో వైరస్ నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఫీవర్ సర్వేను ప్రారంభించింది. ఆరోగ్య సిబ్బంది రాష్ట్రంలోని ప్రతి ఇంటిని సందర్శించి, లక్షణాలున్న వారిని గుర్తించి, పరీక్షలు నిర్వహించడం ద్వారా ప్రారంభ దశలోనే వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఈ సర్వే ఎంతగానో ఉపయోగపడింది. ఆ తర్వాత కూడా వ్యాధుల నియంత్రణకు సర్వే కొనసాగుతోంది. ఇప్పటివరకు 49 విడతలు రాష్ట్రంలో సర్వే నిర్వహించారు. ఇదే తరహాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నియంత్రణకు సర్వే చేపడుతున్నారు. డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులున్న వారిని, లక్షణాలున్నవారిని గుర్తిస్తారు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. బాధితులకు మందులు అందిస్తారు. అవసరమైన వారిని ఆస్పత్రుల్లో చేర్పిస్తారు. సీజనల్ వ్యాధులను గుర్తించడానికి ఫీవర్ సర్వే యాప్‌లో మార్పులు చేశామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గతంలో కరోనా వైరస్ ప్రశ్నావళి మాత్రమే ఉండేదని, ప్రస్తుతం డెంగీ, మలేరియా, విష జ్వరాల లక్షణాల ప్రశ్నావళిని అదనంగా చేర్చామని చెప్పారు. ఫీవర్ సర్వే నిర్వహణపై అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలకు మార్గదర్శకాలు జారీ చేశామన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలను సమన్వయం చేసుకుంటూ వైద్య శాఖ పనిచేస్తోందని వివరించారు.

నైపుణ్య శిక్షణలో ఏపీ ముందంజ

సాక్షి, అమరావతి: యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ముందంజలో నిలవడం అభినందనీయమని నైపుణ్యాభివృద్ధి సంస్థ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సంస్థ ఆధ్వర్యంలోని సీడాప్ (సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఏపీ) 8వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. సీడాప్ నిర్వహిస్తున్న కార్యక్రమాలపై సమీక్ష జరిగింది. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన కింద 1,16,022 మందికి శిక్షణ అందించి, 78,128 మందికి వివిధ పరిశ్రమలలో ఉద్యోగాలు కల్పించి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన సీడాప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, సిబ్బందిని సురేష్ కుమార్ అభినందించారు.

సమాజ అధ్యయనం కోసం 'బీసీడీఈ సోల్జర్స్'

- సమాజాభివృద్ధిలో విద్యార్థులకు భాగస్వామ్యం
- బీసీడీఈ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్

సాక్షి, అమరావతి: విద్యార్థులను సమాజంలో గొప్ప పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని బోర్డ్ ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ (బీసీడీఈ) చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్ చెప్పారు. మంగళవారం గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు 'కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సమాజ అధ్యయనానికి దోహదం చేస్తుందన్నారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చే విద్యార్థులను 'బీసీడీఈ సోల్జర్స్'గా నామకరణం చేశామన్నారు. వలంటీర్లు, రాజకీయాలతో సంబంధం లేకుండా విద్యార్థులు నేరుగా సమాజంతో మమేకమై ప్రజా అవసరాలను తెలుసుకుంటారన్నారు. ఇప్పటివరకు 40,776 మంది బీసీడీఈ సోల్జర్లుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు చెప్పారు. యూనివర్సిటీ స్థాయితో పాటు ప్రతి కళాశాలలో బీసీడీఈ కో–ఆర్డినేటర్లు, బాలబాలికల్లో నుంచి ఒక్కొక్కరు చొప్పున బీసీడీఈ అంబాసిడర్లుగా నియమించి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వీటితో పాటు యునిసెఫ్‌తో కలిసి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ఐపీ)లో ప్రత్యేక యాప్ ద్వారా పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులకు 20కి పైగా అంశాలపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

సీఎంకు సీఆర్పీ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లుగా (సీఆర్ఎంటీ) క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్‌ను (సీఆర్పీ) మార్చడం అభినందనీయమని ఏపీ సీఆర్పీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. సీఆర్పీలను సీఆర్ఎంటీలుగా విద్యాశాఖలోకి తీసుకున్న సందర్భంగా ఆయన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పేరు మార్పడంతో రాష్ట్రంలోని 3,489 మంది సీఆర్పీలకు మేలు జరిగిందన్నారు. సీఆర్పీల మేలు కోసం కృషి చేసిన విద్యా శాఖ మంత్రి బొత్స, ఏపీజీఈఎఫ్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943